# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - బుధవారం 23 ఏప్రిల్ 2025 | సంపుటి: 9 | సంచిక: 116 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## ఆదిలాబాద్‌కు జాతీయ అవార్డు



ప్రధాని నుంచి అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

2

## తీవ్ర దిగ్భ్రాంతికరం.. అతి కిరాతకం



పహల్గాం ఉగ్రదాడిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

2

### జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి

# 27 మంది పర్యాటకుల మృతి



## 20 మంది పరిస్థితి విషమం

రక్తపు మడుగులు.. ఛిద్రమైన మృతదేహాలతో భీతావహ దృశ్యాలు

గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా తరలింపు

సౌదీ నుంచి ప్రధాని మోడీ ఆరా

హుటాహుటిన శ్రీనగర్‌కు కేంద్ర హోం మంత్రి అమిత్ షా

2

# హిరోషిమా మాదిరిగానే ప్రజల ఆశలు, పోరాటాలకు చిహ్నం తెలంగాణ

## పరస్పర పెట్టుబడులపై ఆ నగర డిప్యూటీ గవర్నర్‌తో టి. రైజింగ్ టీం చర్చ

తెలంగాణ-జపాన్ మధ్య బలమైన సంబంధాల వారధిని నిర్మిద్దాం

హిరోషిమా శాసనసభ్యులతో సీఎం రేవంత్ రెడ్డి

గాంధీ మొమోరియల్, హిరోషిమా పీస్ మెమోరియల్ పార్క్, అణుబాంబు డోమ్‌ల సందర్శన



హైదరాబాద్, మనం బ్యూరో: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో పాటు పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని తెలంగాణ అధికారుల బృందం జపాన్‌లోని హిరోషిమా ప్రి ఫెక్చర్‌ను (రాష్ట్ర ప్రభుత్వం)ను సందర్శించి హిరోషిమా డిప్యూటీ గవర్నర్‌తో సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హిరోషిమా ప్రభుత్వ ఆతిథ్యానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శాంతితో పాటు సాంకేతిక పురోగతిలోనూ హిరోషిమా ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిందని అన్నారు. తెలంగాణ కూడా కొత్త ఆవిష్కరణలు, సుస్థిర విధానాలు, శాంతియుత వాతావరణానికి కట్టుబడి ఉందన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ, హిరోషిమా కలిసి పని చేయగలిగే రంగాలపై విస్తృతంగా చర్చలు జరిపినట్లు వెల్లడించారు. వ్యర్థాల నుంచి ఇంధనం లాంటి క్లీన్ టెక్నాలజీ, మున్సిపాలిటీల్లో వ్యర్థాల ప్రాసెసింగ్, మురుగు నీటి శుద్ధి,

...మిగతా 2లో

### ముగిసిన రేవంత్ జపాన్ పర్యటన

8 రోజుల్లో రూ.12062 కోట్ల పెట్టుబడుల ఆకర్షణ

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జపాన్ పర్యటన ముగిసింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకు

...మిగతా 2లో



### ఇండో-యూఎస్ ట్రేడ్ రిలేషన్స్..

## వాణిజ్య చర్చల కోసం రోడ్ మ్యాప్ ఖరారు

### ప్రధాని మోడీ, జేడీ వాన్స్ భేటీలో నిర్ణయం



ఢిల్లీ, ఏప్రిల్ 22: భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో కీలక ముందడుగు పడింది. వాణిజ్య చర్చల కోసం రోడ్ మ్యాప్‌ను వివరించే సూచనలు, నిబంధనలపై ఇరు దేశాలు ఓ అంగీకారానికి వచ్చాయి. త్వరలో జరగబోయే చర్చలు ఈ విషయంలో సమతూకం పాటించడానికి దోహదపడతాయని యూఎస్ వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ పేర్కొన్నారు. యూఎస్

...మిగతా 2లో

### అంబర్ కోటలో వాన్స్ కుటుంబం

మంగళవారం వాన్స్ దంపతులు తమ కుమారులు ఇవాన్, వివేక్, కుమార్తె మీరాబెల్ లతో

...మిగతా 2లో

## పార్లమెంటే సుప్రీం

ప్రజాప్రతినిధులే 'అల్టిమేట్ మాస్టర్స్'

సుప్రీం కోర్టు సూపర్ పార్లమెంటులా వ్యవహరించలేదు

మరో సారి కోర్టులపై ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యలు

2



### ఇంటర్ ఫలితాలను విడుదల చేసిన డిప్యూటీ సీఎం

ఫస్టియర్‌లో 66.89 శాతం ఉత్తీర్ణత

సెకండియర్లో 71.37 శాతం

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ ఫలితాల్లో బాలికలు సత్తాచాటారు. ఇంటర్

...మిగతా 2లో

# సివిల్స్‌లో సత్తా చాటిన తెలుగోళ్లు

### టాప్-10లో లేని మనోళ్లు

సాయి శివానికి 11వ ర్యాంక్, బన్నా వెంకటేశ్‌కు 15వ ర్యాంక్

యూపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ తుది ఫలితాలు విడుదల

తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

హైదరాబాద్, మనం ప్రతినిధి: దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యూపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ) 2024 తుది ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో 1,009 మందిని యూపీఎస్సీ ఎంపిక చేయగా, జనరల్ కేటగిరీలో 335 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 109 మంది, ఓబీసీ నుంచి 318 మంది, ఎస్సీ కేటగిరీ నుంచి 160 మంది, ఎస్టీ కేటగిరీ నుంచి 87 మంది

...మిగతా 2లో



## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఎర్త్ డే స్టూడెంట్-యూత్ ఇన్ యాక్షన్

పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి కొండా

### ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా

## కలెక్టర్లు పనిచేయాలె

2

మే మొదటి వారం 28 మండలాల్లో భూ భారతి సదస్సులు

యుద్ధ ప్రాతిపదికన ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

ఎల్ఆర్ఎస్ గడువు పెంచబోం

రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి



భూభారతి పేదలకు చుట్టం లాంటిది

3

## బండిపై ఈసీకి ఫిర్యాదు చేస్తం

హిందుత్వవాదులు బీజేపీకి ఓటు వేయాలన్న సంజయ్ ప్రకటనపై మంత్రి పొన్నం ఫైర్



హైదరాబాద్, మనం బ్యూరో: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో హిందుత్వవాదులు బీజేపీకి ఓటు వేయాలన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటనపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ,

...మిగతా 2లో

### నేడు హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలు

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక బుధవారం జరుగనుంది. మొత్తం 112 మంది ఓటర్లు ఉండగా, అత్యధికంగా ఎంఐఎంకు 50 మంది ఓట్లు ఉండగా, కాంగ్రెస్‌కు 14 ఉన్నాయి. బీజేపీకి 24 ఓట్లు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీకి గెలిచేందుకు సరైన సంఖ్యాబలం లేనప్పటికీ అభ్యర్థిని నిలబెట్టింది. అలాగే, మజ్లీస్ పార్టీ కూడా అభ్యర్థిని నిలబెట్టింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. అయితే,

...మిగతా 2లో

### చీటింగ్ చేసిన చెన్నమనేని

భారత పౌరసత్వం లేనప్పటికీ తప్పుడు పత్రాలతో మోసం

రమేశ్‌పై డీజీపీకి విప్ ఆది శ్రీనివాస్ ఫిర్యాదు

2



## శనివారం పోప్ అంత్యక్రియలు

వాటికన్ సిటీ, ఏప్రిల్ 12: పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు ఇటలీకాలమానం ప్రకారం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వాటికన్ సిటీ ప్రకటించింది. నేడు జరిగిన కార్డినళ్ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. పోప్ ఫ్రాన్సిస్ భౌతిక కాయాన్ని బుధవారం సెయింట్ పీటర్స్ బసిలికాకు తరలించి ప్రజల సందర్శనార్థం

...మిగతా 2లో




# పిల్లల్ని కనండి.. బోనస్ పట్టండి



అమెరికాలో 'బేబీ బోనస్' పథకం • ప్రసవానికి 5 వేల డాలర్లు • జనాభా వృద్ధి కోసం తంటాలు

వాషింగ్టన్, ఏప్రిల్ 22: దేశంలో జననాల రేటు తగ్గుదలపై అమెరికా ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎక్కువ మంది పిల్లలను కనేలా ప్రోత్సహించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా జన్మనిచ్చిన మహిళకు 5వేల డాలర్ల 'బేబీ బోనస్' వంటి అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నట్లు అమెరికన్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. క్షీణిస్తున్న జననాల రేటును అధిగమించేందుకు అవసరమైన ప్రణాళికలకు సంబంధించి

...మిగతా 2లో

### ట్రంప్ టీంపై కేసు

నిధులు కోత పెట్టడంపై హార్వర్డ్ యూనివర్సిటీ ఆగ్రహం

అధ్యక్షుడి చట్టవిరుద్ధమైన నిర్ణయాలపై చర్యలు తీసుకోవాలంటూ కోర్టుకు విన్నపం

2



# 27 మంది పర్యాటకుల మృతి



**ఆనంత్ నాగ్, ఏప్రిల్ 22:** జమ్మూకశ్మీర్లో ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. అనంత్ నాగ్ జిల్లా పహల్గాంలో పర్యటకులే లక్ష్యంగా దాడులకు తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్ గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో విహారానికి వచ్చిన వారిపై దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో 27 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది పరిస్థితి విషమంగా ఉంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బైసరన్ ప్రాంతంలో ఉన్న దాదాపు 40 మంది పర్యటకులను అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఉగ్రవాదులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. అనంతరం విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. దీంతో కొంతమంది అక్కడికక్కడే కుప్పకూలగా.. అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. రక్తపు మడుగులో పడిఉన్న మృతదేహాలతో స్థానికంగా భీతావహ వాతావరణం నెలకొంది. తమ వారిని కాపాడాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండటంతో బాధితులను తరలించడం కష్టమవుతోంది.

బైసరన్లో కాల్పుల శబ్దం వినిపించడంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి తరలివెళ్లాయి. గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే స్థానికులు గుర్రాల సాయంతో పలువురిని తీసుకెళ్లినట్లు సమాచారం. తొలుత మృతుల సంఖ్య తక్కువగానే ఉన్నట్లు పేర్కొన్నప్పటికీ.. ప్రస్తుతం 27కి చేరినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. కాల్పుల ఘటనతో పహల్గాం వీధులు నిర్మానుష్యంగా మారాయి. పర్యటకులు సైతం సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు తెలిసింది.

**అమర్నాథ్ యాత్ర వేళ..**

38 రోజుల పాటు కొనసాగే అమర్నాథ్ యాత్ర జులై 3 నుంచి ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా లక్షల మంది యాత్రికులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంత్నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కి.మీ మేర ఉండగా.. 14కి.మీ మార్గం గండేర్బల్ జిల్లా నుంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో పర్యటకులపై ఉగ్రవాదులు దాడికి తెగబడటం ఆందోళన కలిగిస్తోంది.

**మోడీ ఆరా.. హుటాహుటిన శ్రీనగర్‌కు అమిత్ షా**

ఈ ఘటనపై ఆరా తీసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వెంటనే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కాల్ చేసి కాల్పులు జరిగిన చోటుకు వెళ్లాలని ఆదేశించారు. కాగా, శ్రీనగర్‌వెళ్లిన వెంటనే అత్యవసర భద్రతా సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఉగ్రవాద చర్యలో పాల్గొన్న వారిని వదిలిపెట్టబోము ఇప్పటికే హెచ్చరించారు. నేరస్థులను కఠినంగా శిక్షిస్తామన్నారు. ఈ ఘటనను కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ సైతం ఖండించారు అమాయక పౌరులపై దాడికి పాల్పడిన వారిని వదిలి పెట్టబోమని తీవ్రంగా రియాక్ట్ అయ్యారు. ఈ ఘటన వెనుక ఉన్నవారిని న్యాయస్థానం ముందు నిలబెడుతామని ప్రకటించారు.

# ఆదిలాబాద్‌కు జాతీయ అవార్డు

**ఢిల్లీ, ఏప్రిల్ 22:** ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం జాతీయ స్థాయిలో ఉత్తమ ఆకాంక్షిత మండలంగా నిలిచింది. 'ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన' ఉత్తమ పురస్కారానికి దేశవ్యాప్తంగా 5 బ్లాకులు ఎంపిక కాగా వాటిలో నార్నూర్ ఒకటిగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంను సమర్థంగా అమలు చేసి మండల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఢిల్లీలోని విజ్ఞాన్భవన్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా సోమవారం పురస్కారం అందుకున్నారు. 17వ సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ అరుదైన పురస్కారం అందుకోవడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్ కు అభినందనలు తెలిపారు. నార్నూర్ కు టాప్-5లో ఒకటిగా నిలపడంలో కలెక్టర్ పాత్ర ఎంతో ఉందని కొనియాడారు.

## వాణిజ్య చర్చల కోసం
# రోడ్ మ్యాప్ ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

వాణిజ్య ప్రతినిధుల కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో గ్రీర్ మాట్లాడుతూ.. అమెరికా-భారత్ వాణిజ్య సంబంధాలలో ఇప్పటివరకు పలు లోపాలు ఉన్నాయని అన్నారు. అమెరికన్ వస్తువులకు కొత్త మార్కెట్లను తెరవడం, ఇక్కడి కార్మికులకు హాని కలిగించే అన్యాయమైన పద్ధతులను తొలగించడం వంటి విషయాలపై ప్రస్తుతం భారత్తో చర్చిస్తున్నామన్నారు. అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, ప్రధాని నరేంద్ర మోడీతో సమావేశమయిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు భారత్, అమెరికా కొనసాగిస్తున్న చర్చల్లో పురోగతిపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఇంధనం, వ్యూహాత్మక సాంకేతికతలు, రక్షణ తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవడంపై దృష్టిసారించాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయం వ్యక్తంచేశారు. ట్రంప్ ఈ ఏడాది భారత్ పర్యటన కోసం తాను ఉత్సాహంగా ఎదురుచూస్తున్నట్లు మోడీపేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లపై చాలా దేశాలు ప్రతీకార చర్యలకు సిద్ధమవుతున్న వేళ భారత్ మాత్రం విభిన్నంగా ఆలోచించి.. ప్రతి సుంకాలకు బదులుగా అగ్రరాజ్యంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై దృష్టిసారించింది. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి అడుగులు పడిన సంగతి తెలిసిందే. పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పందం చేసుకునేలా దేశాధినేతలు అంగీకారం తెలిపారు. రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య సమతుల్యాన్ని కొనసాగించేందుకు అమెరికా నుంచి చమురు, గ్యాస్ ల దిగుమతి పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ అధికారులు పేర్కొన్నారు. దీనిపై కొంతకాలంగా చర్చలు జరుగుతున్నాయి. తాజా పరిణామాలతో త్వరలోనే ఒప్పందం ఖరారుపై ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి.

**అంబర్ కోటలో వాన్స్ కుటుంబం**

(మొదటి పేజీ తరువాయి)

జైపూర్‌లోని అంబర్ కోటను సందర్శించారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, డిప్యూటీ సీఎం దియాకుమార్ వారికి స్వాగతం పలికారు. చంద, పుష్ప అనే ఏనుగులతో వారికి ప్రత్యేక ఆహ్వానాన్ని ఏర్పాటుచేశారు. కోటలో ప్రదర్శించిన పలు రాజస్థానీ సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలను వీక్షిస్తూ.. వాన్స్ కుటుంబం కోటను సందర్శించారు.

## చీటింగ్ చేసి ఎన్నికల్లో పోటీ

**హైదరాబాద్,** మనం ప్రతినిధి: వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పౌరసత్వం వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. చెన్నమనేని రమేశ్ భారత పౌరసత్వం కలిగి లేనప్పటికీ, తప్పుడు పత్రాలు సమర్పించి గతంలో ఎన్నికల్లో పోటీ చేశారని ఆరోపిస్తూ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హైదరాబాద్లోని డీజీపీ కార్యాలయంలో ఈ ఫిర్యాదు అందజేశారు. చెన్నమనేని రమేష్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. తన భారత పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ చెన్నమనేని రమేశ్ గతంలో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఆయన దాఖలు చేసిన పిటిషన్ను జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం ఇటీవల కొట్టివేసింది.

# తీవ్ర దిగ్భ్రాంతికరం.. క్షమించరానిది

**ఆనంత్ నాగ్, ఏప్రిల్ 22:** జమ్మూకశ్మీర్లోని పహలాంలో ఉగ్రదాడి ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ సహా పలువురు నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీన్ని అత్యంత హేయమైన ఘటనగా పేర్కొన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ 'ఎక్స్' వేదికగా పోస్టులు పెట్టారు. 'పహల్గాం ఉగ్రదాడి దిగ్భ్రాంతికరం. ఇదొక క్రూరమైన, అమానవీయ చర్య. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం భయానకం. ఇది క్షమించరానిది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పోస్ట్ చేశారు.

**వారిని వదిలిపెట్టం: ప్రధాని మోదీ**

పహల్గామ్లో జరిగిన ఉగ్రదాడిని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఫోన్లో మాట్లాడిన ఆయన.. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. అత్యంత హేయమైన ఈ చర్య వెనుక ఉన్నవారిని చట్టం ముందుకు తీసుకొస్తామని.. వారిని వదిలిపెట్టబోమన్నారు.

ఉగ్రమూకల దుష్ట ఎజెండా ఎప్పటికీ విజయవంతం కాదన్నారు. ఉగ్రవాదంపై పోరాడాలనే తమ సంకల్పం దృఢమైనదన్న ప్రధాని.. అది మరింతగా బలపడుతుందని స్పష్టంచేశారు.

# మోడీకి ఆకాశ స్వాగతం

- **ఫైటర్ జెట్స్‌తో వెల్‌కం చెప్పిన సౌదీ**

**ఢిల్లీ, ఏప్రిల్ 22 :** ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆ దేశం ప్రత్యేకంగా స్వాగతించింది. ప్రధాని ప్రయాణిస్తున్న విమానం సౌదీ అరేబియా గగనతలంలోకి ప్రవేశించగానే.. రాయల్ సౌదీ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన ఎఫ్-15 విమానాలు దానిని అనుసరించి, సగౌరవంగా స్వాగతించాయి. రెండు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు పడతాయని ఈ ఆత్మీయ స్వాగతం చాటుతోంది.

ప్రధాని రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ రోజు సౌదీ వెళ్లారు. ఇంధనం, వాణిజ్యం, రక్షణ వంటి పలు కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడం లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. మోదీ, సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ల నడుమ ఇటీవల జరిగిన చర్చల తర్వాత ఇరుపక్షాల మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి. భారత్, సౌదీ అరేబియాల మధ్య ఇప్పటికే బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది.

సౌదీ అరేబియా చేరిన వెంటనే ప్రధాని ఎక్స్ వేదికగా స్పందిస్తూ ''ఈ పర్యటన రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేయనుంది. ఈ రోజు, రేపు పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎదురుచూస్తున్నాను'' అని పోస్టు చేశారు. మోదీ ఆ దేశానికి వెళ్లడం ఇది మూడోసారి.

# శనివారం పోప్ అంత్యక్రియలు

(మొదటి పేజీ తరువాయి)

ఉంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం 9 రోజులపాటు సంతాపదినాలు పాటిస్తున్నారు. వీటిని నవెండియలెస్ అంటారు. సాధారణంగా పోప్ అంత్యక్రియలు, ఖననం ప్రక్రియ మృతి చెందిన నాటినుంచి నాలుగు నుంచి ఆరో రోజు మధ్యలో పూర్తి చేయాల్సి ఉంది. ఈ క్రమంలోనే శనివారం అంత్యక్రియల రోజుగా నిర్ణయించారు. పోప్ భౌతికకాయం ఫొటోలను కూడా తొలిసారి వాటికన్ విడుదల చేసింది. పోప్ ఫ్రాన్సిస్ అంతిమ సంస్కారాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ స్వయంగా హాజరుకానున్నారు.

**కొత్త పోప్ ఎన్నికలో ఓటు వేయనున్న భారతీయ కార్డినల్స్..**

పోప్ ఫ్రాన్సిస్ తర్వాత ఆ స్థానంలోకి వచ్చే కొత్త వారిని ఎన్నుకోవడంలో భారత్ కూడా కీలక పాత్ర పోషించనుంది. దాదాపు 135 మంది కార్డినళ్లు కలిసి నూతన పోప్ను ఎన్నుకోనున్నారు. వీరిలో భారతీయులు కూడా ఉన్నారు. తొలుత ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్డినళ్లు పోప్ అంత్యక్రియలకు హాజరుకానున్నారు. ఆ తర్వాత సిస్టీన్ ఛాపెల్లో పాపల్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలో భారత్ తరఫున కార్డినళ్లు ఫిలిప్ నెరి ఫెర్రావ్, క్లీమిస్ బసెలియోస్, ఆంథోనీ పూల, జార్జ్ జాకబ్ కూవకాడ్ పాల్గొంటారు.

## ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలె

**హైదరాబాద్, మనం బ్యూరో:** ప్రభుత్వ ఆలోచనలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వానికి ప్రతిష్ఠాత్మకమైన ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి చట్టం అమలుపై కలెక్టర్లు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలసి భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లు, ఎల్ఆర్ఎస్ తదిర అంశాలపై కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన చిరస్మరణీయమైన భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామనీ, దీనిని సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. ఈ చట్టంపైనే కాకుండా లోతుగా అధ్యయనం చేసి ప్రజల్లోకి వెళ్లాలని కలెక్టర్లకు సూచించారు. భూ భారతి పైలెట్ ప్రాజెక్టు అమలు చేస్తున్న నాలుగు మండలాల్లోని 16 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందనీ, ఇప్పటి వరకు ఈ సదస్సుల్లో 5905 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**మనం బ్యూరో, హైదరాబాద్ :** పర్యావరణ పరిరక్షణ ప్రతీ పౌరుడి బాధ్యత అని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ఎర్త్ డే-స్టూడెంట్, యూత్ ఇన్ యాక్షన్ పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి సమస్త జీవ రాశులకూ ఆధారమని పేర్కొన్నారు. పుడమి తల్లి మానవాళి జీవనానికి అవసరమైన గాలి, నీరు, ఆహారం, ఉపాధి కల్పిస్తోందన్నారు. వాతవారణ మార్పులు వంటి ఇతరత్రా చర్యలతో ప్రకృతి వనరులు విధ్వంసానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధనాలు, గ్రీన్ హౌస్ వాయువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని సూచించారు. అలాగే, సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధనాలను పెంచుకోవాలన్నారు. రానున్న రోజుల్లో భూమిని కాపాడుకునేందుకు సోలార్ ఎనర్జీ చాలా అవసరమనీ, సోలార్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు దేవాదాయ శాఖకు చెందిన భూముల వినియోగంపై చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

## హిరోషిమా మాదిరిగానే ప్రజల ఆశలు, పోరాటాలకు చిహ్నం తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టులు, అర్బన్ ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హైదరాబాద్‌లో విపత్తుల నివారణ డిజైన్లు, భూ గర్భ మెట్రో ఇంజనీరింగ్ స్మార్ట్ సిటీ సొల్యూషన్స్, పారిశ్రామిక సహకారం, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, అధునాతన ఉత్పత్తుల తయారీకి హిరోషిమా-తెలంగాణ ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ కారిడార్ ఏర్పాటు చేయలనే ప్రతిపాదనలను ప్రస్తావించారు. వీటితో పాటు విద్య, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో తెలంగాణలో ప్రముఖ విశ్వవిద్యాలయాల మధ్య సంబంధాలు, పరిశోధనలకు సహకారం, తెలంగాణ సంస్కృతి, శాంతి, పర్యాటకం, పీస్ పార్క్, సాంస్కృతిక ప్రదర్శనలు, బౌద్ధ వారసత్వానికి సహకరించాలని కోరారు.

**హిరోషిమా అసెంబ్లీని సందర్శించిన రేవంత్ బృందం**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం జపాన్‌లోని హిరోషిమా ప్రీ పెక్చర్‌ను సందర్శించింది. హిరోషిమా ప్రిపెక్చరల్ అసెంబ్లీ హాల్ సందర్శనకు వెళ్లిన బృందానికి అసెంబ్లీ స్పీకర్ తకాషి నకమోటో, వారి శాసనసభ్యుల బృందం ఘనంగా స్వాగతించింది. ముఖ్యమంత్రి వెంట ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు జయేష్ రంజన్, వి.శేషాద్రి, అజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి అసెంబ్లీని సందర్శించారు. శాసనసభ్యుల సమావేశాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హిరోషిమాకు రావడం గౌరవంగా ఉంది. హిరోషిమా అంటే ఆశ. ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తే ఏదైనా సాధ్యమని ప్రపంచానికి నిరూపించిన నగరం. హిరోషిమా మాదిరిగానే ప్రజల ఆశలు, ఆకాంక్షలు, పోరాటానికి చిహ్నం తెలంగాణ. దూరదృష్టితో విజయం సాధించిన రాష్ట్రమని పేర్కొన్నారు. శాంతి, స్థిరత్వం, సమృద్ధి వంటి విలువలను పంచుకుందామని మంత్రి శ్రీధర్‌బాబు హిరోషిమా ప్రభుత్వానికి పిలుపునిచ్చారు. పెట్టుబడులకు కాకుండా పరస్పర సహకారం, భాగస్వామ్యం గురించి మాట్లడటానికి వచ్చామనీ, కలిసికట్టుగా మెరుగైన పచ్చని, సమగ్రమైన ప్రపంచాన్ని నిర్మిద్దామని అన్నారు. ఇప్పటికే యాభైకి పైగా జపాన్ కంపెనీలు తెలంగాణలో అద్భుతంగా పని చేస్తున్నాయనీ, మరిన్ని కంపెనీలకు స్వాగతించారు.

**ముగిసిన రేవంత్ జపాన్ పర్యటన**

(మొదటి పేజీ తరువాయి)

రావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ నేతృత్వంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులు ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 22 వరకు 8 రోజుల పాటు జపాన్‌లోని పలు నగరాల్లో పర్యటించారు. ఆ దేశంలోని ఒసాకా నగరంలో జరిగిన ఇండస్ట్రియల్ ఎక్స్‌పోలో పాల్గొన్న అనంతరం వివిధ పారిశ్రామిక వర్గాలతో పలు సమావేశాలు జరిపారు. 8 రోజుల జపాన్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం రూ.12062 కోట్ల పెట్టుబడులను సాధించడంలో విజయవంతమైంది. కాగా, సీఎం రేవంత్ జపాన్ పర్యటన సందర్భంగా రాష్ట్రంలో దాదాపు 3500 మందికి పైగా ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు రానున్నాయని అధికారులు పేర్కొన్నారు. కాగా, సీఎం రేవంత్ పర్యటనలో చివరిగా ప్రసిద్ధ హిరోషిమా శాంతి స్మారకాన్ని,

## ఇంటర్ ఫలితాలను విడుదల చేసిన డిప్యూటీ సీఎం

(మొదటి పేజీ తరువాయి)

ఫస్టియర్ ఫలితాల్లో 66.89 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 73.83 శాతం, బాలురు 57.83 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ పరీక్షలకు 4,88,430 మంది హాజరు కాగా 3,22,191 మంది ఉత్తీర్ణత సాధించారు.

సెకండియర్‌లో 71.37 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, బాలికలు 74.21 శాతం, బాలురు 57.31 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ పరీక్షలకు 5,08,582 మంది హాజరు కాగా... 3,33,908 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల కోసం ప్రభుత్వ అధికారిక వెబ్ సైట్ టీఎస్‌బీఐఇ.సీజీజీ.జీఓవీ.ఇన్ లేదా రిజల్ట్స్.సీజీజీ.జీఓవీ.ఇన్‌లో అందుబాటులో ఉంటాయి. అందులో చూడొచ్చు. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేసి, రిజల్ట్ చూసుకోవచ్చు. కాగా, మార్చి 5 నుంచి 25 వరకు 1,532 కేంద్రాల్లో ఇంటర్ వార్షిక పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఇంటర్ వార్షిక పరీక్షలకు మొత్తం 9.96 లక్షల మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు ప్రకటించారు.

# బండిపై ఈసీకి ఫిర్యాదు చేస్తం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మతపరమైన అంశాలతో ఎన్నికల్లో రెచ్చగొడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్పొరేటర్ల ఇళ్ల ముందు ఫ్లెక్సీలు కడుతూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీకి ఓటు వేయకపోతే హిందువు కాదా ? బీజేపీకి ఓటు వేయమని కాంగ్రెస్ పార్టీని బండి సంజయ్ ఎలా అడుగుతారని ప్రశ్నించారు. నైతికత ఉండాలి...రాజకీయంగా రూరల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని పార్టీలు పోటీ చేస్తాయనీ ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎన్నికలను బహిష్కరించిందనీ, కాంగ్రెస్ పార్టీకి ప్రజాస్వామ్యం మీద నమ్మకం ఉంది బీజేపీకి ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు వేయమని స్పష్టం చేశారు.

# సివిల్స్‌లో సత్తా చాటిన తెలుగోళ్లు

చొప్పున ఎంపికయ్యారు. ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల అనంతరం మొత్తం 2,845 మంది అభ్యర్థులు తుది దశగా జరగనున్న ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలో భాగంగా 2024 జూన్ 16న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించగా, జులై 1న ఫలితాలు వెలువడ్డాయి. అనంతరం సెప్టెంబర్ 20 నుంచి 29 వరకు మెయిన్స్ పరీక్షలు జరిగాయి. వాటి ఫలితాలను డిసెంబర్లో ప్రకటించారు. మెయిన్స్‌లో ఉత్తీర్ణులైన వారికి 2025 జనవరి 7 నుంచి ఏప్రిల్ 17 వరకు రెండు సెషన్లలో ఢిల్లీలో ఇంటర్వ్యూలు నిర్వహించి తాజాగా తుది ఫలితాలను ప్రకటించింది.

**సాయి శివానికి 11వ ర్యాంక్, బన్నా వెంకటేశ్‌కు 15వ ర్యాంక్**

ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటారు. సాయి శివాని 11వ ర్యాంకుతో సత్తా చాటారు. బన్నా వెంకటేశ్ 15వ ర్యాంకు, అభిషేక్ శర్మ 38వ ర్యాంకు, రావుల జయసింహారెడ్డి 46వ ర్యాంకు, శ్రవణ్ కుమార్ రెడ్డి 62వ ర్యాంకు, సాయి చౌతన్య జాదవ్ 68వ ర్యాంకు, ఎన్. చేతనరెడ్డి 110వ ర్యాంకు, చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డి 119వ ర్యాంకు సాధించారు. జాతీయస్థాయిలో టాప్ 10 ర్యాంకర్ల జాబితాను కూడా యూపీఎస్సీ ప్రకటించింది. వారిలో శక్తి దుబే, హర్షిత గోయెల్, డోంగ్రే అర్చిత్ పరాగ్, షా మార్గి చిరాగ్, ఆకాశ్ గార్గ్, కోమల్ పూనియా, ఆయుషి బన్సల్, రాజ్‌కృష్ణ ఝా, ఆదిత్య విక్రమ్ అగర్వాల్, మయాంక్ త్రిపాఠి ఉన్నారు.

# పిల్లల్ని కనండి.. బోనస్ పట్టండి

(మొదటి పేజీ తరువాయి)

వైట్హౌస్లో ఇటీవల అంతర్గతంగా ఓ కీలక సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. సంతాన సాఫల్యంపై మహిళలకు అవగాహన, బిడ్డల్ని కనే కుటుంబాలకు ప్రోత్సాహకాలు చర్చకు వచ్చాయి. ఇందులో భాగంగా బిడ్డకు జన్మనిచ్చే ప్రతి అమెరికన్ మాతృమూర్తికి 'బేబీ బోనస్' కింద 5వేల డాలర్లు, పన్ను మినహాయింపుల వంటి అంశాలు ప్రతిపాదించినట్లు తెలిసింది. వివాహం చేసుకున్న లేదా పిల్లలున్న వారికి ప్రతిష్ఠాత్మక స్కాలర్షిప్లలో 30శాతం స్లాట్లు కేటాయించాలనే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ.. వీటిపై కొంత వివాదం నడుస్తున్నట్లు సమాచారం.

**పోప్గా ఎన్నికైన వ్యక్తి పేరు ఎందుకు మారుతుంది..?**

ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, బిలియనీర్ ఎలాన్ మస్క్ వంటి నేతలు పాల్గొన్న ఈ సమావేశంలో జనాభా పెరుగుదలపై ప్రణాళికకు సంబంధించి ఎటువంటి నిర్ణయాలు తీసుకోనప్పటికీ.. దీనిపై అనేక మంది ఆసక్తి కనబరిచినట్లు తెలుస్తోంది. దేశంలో క్షీణిస్తున్న సంతానోత్పత్తిపై పలు సందర్భాల్లో ప్రస్తావించిన వాన్స్ (ఒృ గ్నిఛ్ఛి).. నాగరికత సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఎలాన్ మస్క్ కూడా అధిక సంతానానికి మద్దతు తెలుపుతున్న సంగతి తెలిసిందే.

**క్షీణిస్తోన్న జననాల రేటు..**

అమెరికాలో 1990ల నుంచి జననాల రేటు క్రమంగా క్షీణిస్తోంది. సీడీసీ (ఇృఇ) నివేదిక ప్రకారం.. 2023లో సంతానోత్పత్తి రేటు 1.62గా ఉంది. రీప్లేస్మెంట్ రేటు కంటే చాలా తక్కువ.

## ట్రంప్ టీంపై కేసు

ట్రంప్ పరిపాలనా యంత్రాంగంపై హార్వర్డ్ విశ్వవిద్యాలయం కోర్టులో కేసు వేసింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి 2.2 బిలియన్ డాలర్ల నిధులపై ట్రంప్ యంత్రాంగం ఇప్పటికే కోత విధించిన విషయం తెలిసిందే. తాజాగా మరో 1 బిలియన్ డాలర్ల నిధుల కోతకు అమెరికా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో హార్వర్డ్ ఈ దావా వేసింది. హార్వర్డ్ కు నిధులు నిలిపివేయడం ద్వారా విద్యాపరమైన నిర్ణయాలపై నియంత్రణ సాధించడానికి ప్రయత్నిస్తున్నారని కేసు దాఖలు చేసింది. ట్రంప్ యంత్రాంగం లక్ష్యంగా చేసుకున్న ఇతర విద్యాసంస్థల పేర్లను కూడా ఫిర్యాదులో పేర్కొంది. విశ్వవిద్యాలయానికి నిలిపివేసిన 2.2 బిలియన్ డాలర్లకు పైగా గ్రాంట్ నిధులను సమాఖ్య ప్రభుత్వం నిలిపివేయాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరింది. గత వారం హార్వర్డ్ తన చట్టవిరుద్ధమైన డిమాండ్లను పాటించడానికి నిరాకరించడంతో సమాఖ్య ప్రభుత్వం విశ్వవిద్యాలయంపై ఇటువంటి చర్యలు తీసుకుంటోందని హార్వర్డ్ అధ్యక్షుడు అలాన్ గార్బర్ పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వారికి ఉన్న అధికారానికి మించినవి అయినందువల్ల తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని అన్నారు. విదేశీ విద్యార్థుల అక్రమ, హింసాత్మక కార్యకలాపాల రికార్డులను సమర్పిస్తేనే కొత్తగా విదేశీయులను చేర్చుకునేందుకు అనుమతిస్తామని అధ్యక్ష కార్యాలయం గతవారం హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి స్పష్టం చేసింది.

# నేడు హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అభ్యర్థిని నిలబెట్టకుండా మజ్లిస్ పార్టీకి మద్దతిస్తూ మతతత్వ పార్టీతో కుమ్మక్కయ్యాయని బీజేపీ ఆరోపించగా, బీజేపీ అభ్యర్థిని గెలిపించడానికి బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉందని కాంగ్రెస్ ఆరోపించింది.

# పార్లమెంటే సుప్రీం

**ఢిల్లీ, ఏప్రిల్ 22:** రాష్ట్రపతిని సుప్రీం కోర్టు ఆదేశించలేదంటూ ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఆయన మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగపరమైన అంశాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులే 'అల్టిమేట్ మాస్టర్స్' అని ధన్ఖడ్ పేర్కొన్నారు. మంగళవారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికైన ప్రజాప్రతినిధులు జవాబుదారీతనంగా ఉండాలి. ఎమర్జెన్సీ విధించిన ప్రధాని అయినా సరే. ప్రజలకు రక్షణ కల్పించేందుకే ప్రజాస్వామ్యం. రాజ్యాంగపరమైన అంశాల్లో ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్. పార్లమెంట్ కంటే అత్యుత్తమమైనది ఉందని రాజ్యాంగంలో ఎక్కడా లేదు.

# దశాబ్ద కాలంగా పరిశ్రమ ఎలాంటి ప్రోత్సాహకాలను నోచుకోలే

## ఇది మంచి సంప్రదాయం కాదని సీఎం భావించారు • డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఏప్రిల్ 22(మనంన్యూస్):** హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్‌లో గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవారడ్స్ కర్టెన్ రైజర్ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దిల్ రాజు, సీనియర్ నటి జయసుధ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారి ఏర్పాటు చేసుకున్న అవార్డులని.. దశాబ్ద కాలంగా పరిశ్రమ ఎలాంటి ప్రోత్సాహకాలకు, అవార్డులకు నోచుకోలేదన్నారు. దశాబ్దకాలంగా నిర్లక్ష్యంగా చేయడం మంచి సంప్రదాయం కాదని సీఎం భావించినట్లు తెలిపారు. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులు ప్రవేశపెట్టడానికి చాలా కారణాలున్నాయని.. తన గళంతో తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తం చేశారన్నారు.గద్దర్ పుట్టడం తెలంగాణ రాష్ట్ర అదృష్టం. తన పాటతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోశారు. అలాంటి వ్యక్తి పేరు మీద అవార్డులు ఇవ్వడం సముచిత నిర్ణయం. కళలకు పుట్టినిల్లు హైదరాబాద్. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల పట్ల ప్రభుత్వానికి స్పష్టమైన విధానం ఉంది. ప్రతివారు ఈ అవార్డులు గురించి మాట్లాడుకునేలా వేడుకలు చేస్తాం. చలన చిత్ర అవార్డులతోపాటు వ్యక్తిగత అవార్డులను కూడా పొందుపర్చాం. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా ఉండేలా అవార్డుల ప్రదానం చేస్తాం. అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రపంచ స్థాయిలో సినిమా అవార్డుల ఫంక్షన్ ఏ తీరుగా నిర్వహిస్తారో అందుకు ఏమాత్రం తగ్గకుండా తెలంగాణలో గద్దర్ సినిమా అవార్డుల కార్యక్రమం నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్లో నిర్వహించనున్న ఈ గద్దర్ చలనచిత్ర అవార్డుల ఫంక్షన్ గురించి ప్రపంచం మొత్తం మాట్లాడుకునేలా ఈవెంట్ నిర్వహించాలని కమిటీ సభ్యులు, అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి సూచించారు. గత 10 ఏళ్లలో రాష్ట్రంలో సినీ పరిశ్రమ నిరాదరణకు గురైందన్నారు. 2011లో చలనచిత్ర అవార్డుల పంపిణీ కార్యక్రమం నిలిచిపోయిన తరువాత ఇండస్ట్రీకి ప్రోత్సాహం కరువైంది అన్నారు.




**ప్రత్యేక రాష్ట్రానికి నాంది పలికిన గద్దర్**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ పుట్టడం మన అదృష్టం అని, దశాబ్దానికి ఒకరు అలాంటి మహానుభావులు పుడతారని కొనియాడారు. తెలంగాణ సంస్కృతి, గుండె చప్పుడును విశ్వవ్యాప్తం చేసిన గొప్ప వ్యక్తి గద్దర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, భావజాలాన్ని రాష్ట్రానికి దేశానికి ప్రపంచానికి సరైన మార్గంలో గద్దర్ ప్రచారం చేశారని భట్టి విక్రమార్క వివరించారు. ఆయన బానిని చిన్నపిల్లలు నుంచి వృద్ధుల వరకు, ఆడ, మగా అనే వ్యత్యాసం లేకుండా అందరూ అనుకరించారని తెలిపారు. సింగరేణి ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర సాధన డిమాండ్ తో పాదయాత్ర చేసి గద్దర్ ప్రత్యేక రాష్ట్రానికి నాంది పలికారని గుర్తుచేశారు. ఎక్కడో మద్రాసులో ఉన్న చిత్ర పరిశ్రమను కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్కు తీసుకురావడంతో పాటు ప్రోత్సహించింది అన్నారు. చిత్ర పరిశ్రమను తరలించి ప్రోత్సాహకాలు అందించడమే కాదు, సినీ ఇండస్ట్రీలో సేవలు అందించిన వారికి ఇళ్ల స్థలాలను సైతం కేటాయించినట్లు చెప్పారు. సమాజంలో అభివృద్ధి, విలువలను ప్రోత్సహించేది మీడియానే, జర్నలిస్టులు అని.. అలాంటి మీడియాను కాపాడుకునే బాధ్యత పాలకులు, ప్రభుత్వానిపై ఉందన్నారు. బంధాలు, రాగద్వేషాలకు అతీతంగా గద్దర్ సినీ అవార్డులకు సినిమాలను ఎంపిక చేయాలని జూరీ సభ్యులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. సినీ అవార్డులతో పాటు సినీ పరిశ్రమకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిన వారి పేరిట సైతం అవార్డులు ఇస్తున్నాం, ఇవి భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు బాధ్యత గల ప్రభుత్వాలు బలమైన సినిమా రంగం ద్వారానే ప్రజలకు సందేశం ఇవ్వాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రం సాధించుకున్నాక గత దశాబ్దం నుంచి ప్రోత్సాహానికి ఏ విధంగా నోచుకోని సినీ పరిశ్రమకు చేయూతనివ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.

# భూభారతి చట్టం పేద ప్రజలకు చుట్టం లాంటిది



- రెవిన్యూ మంత్రి పొంగులేటి
- భూ భారతి చట్టం యొక్క నియమాలను వివరించిన జిల్లా కలెక్టర్...
- పేద ప్రజల రైతులకు అండగా భూభారతి చట్టం
- ఎమ్మెల్యే కుంభం

**వలిగొండ, ఏప్రిల్ 22 (మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం పేద ప్రజలకు చుట్టం లాంటిదని రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం ధరణి తీసుకువచ్చి రైతులను పేద ప్రజలను ఎంతోమందిని ఇబ్బందులకు గురి చేసిందని అలా జరగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి ని బంగాళాఖాతంలో కలిపి భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చి రైతులకు పేద ప్రజలకు అందరికీ న్యాయం జరిగే విధంగా చూడాలని ప్రభుత్వం ప్రత్యేకంగా కొన్ని రోజులపాటు సంబంధిత అధికారులతో చర్చించి అందరి ఆలోచనలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్క రైతు పేద ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా మీ వద్దకు అధికారులు వచ్చి మీ సమస్యలను పరిష్కరిస్తారని అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని, త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ధరణి పేరుతో వందల ఎకరాల భూమిని స్వాహా చేసిందని ఒక నలుగురు మాత్రమే ఆ ధరణిని ఏర్పాటు చేసి ఎన్నో ఇబ్బందులకు గురిచేశారని ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని తుంగలో తొక్కి భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని అన్నారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రైతులకు రైతు రుణమాఫీ చేసిందని భూ భారతి చట్టాన్ని పేద ప్రజలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. అంతేకాకుండా గతంలో ధరణి తో గొడవలు జరిగి హత్యలు జరిగిన సంఘటనలు కూడా జరిగాయని ఈ ధరణిని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టి భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి ప్రతి పేదవాడి కళ్ళలో ఆనందాన్ని చూడాలి అనే లక్ష్యం కాంగ్రెస్ ప్రభుత్వ దెయ్యం అని అన్నారు. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చి అందరికీ సమానత్వం కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పేద ప్రజలకు అండ కాంగ్రెస్ ప్రభుత్వం అని ఇందిరమ్మ రాజ్యాన్ని మళ్లీ తీసుకురావాలని దృఢ సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన ధరణి వల్ల పేద ప్రజలకు రైతులకు మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని ఈరోజు ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిర్మించుకున్నారని అన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ పేద ప్రజలకు రైతులకు పండుగలాగా భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని ప్రతి పేద ప్రజల కుటుంబాల లో ఆనందాన్ని నింపడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో భూ భారతి చట్టాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని ఎవరు ఎలాంటి ఆందోళనలు చెందకుండా తమ యొక్క సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ భూ భారతి చట్టంపై రైతులకు పేద ప్రజలకు అధికారులకు ప్రతి ఒక్కరికి భూ భారతి చట్టం యొక్క నిబంధనలను క్షుణ్ణంగా వివరించారు. అంతేకాకుండా ప్రజలు రైతులు భూ సమస్యలపై ఎలాంటి ఆఫీసుల చుట్టూ తిరగకుండా నేరుగా మీ గ్రామాలలోనే భూ భారతి చట్టం పై అవగాహన సదస్సు నిర్వహిస్తారని అధికారులు మీ వద్దకే వచ్చి మీ సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తారని మీరు ఎలాంటి ఆందోళన చెందవద్దని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తి, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో శేఖర్ రెడ్డి, స్థానిక తాసిల్దార్ పి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో జితేందర్ రెడ్డి, వివిధ మండలాల మార్కెట్ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, మండల పట్టణ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజ్, నాయకులు బత్తిని లింగయ్య, గరిసె రవి, బత్తిని సహదేవ్, బోళ్ల శ్రీనివాస్, కాసుల వెంకన్న గౌడ్, కొండూరు భాస్కర్ గౌడ్, బద్ధం సంజీవరెడ్డి, చిలుగురి సత్తిరెడ్డి, చెరుకు శివయ్య, కొండూరు సాయి గౌడ్, బత్తిని పాండు, బత్తిని వరుణ్, మైసొల్ల ప్రవీణ్, సంబంధిత అధికారులు, రైతులు, పేద ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పటోళ్ల ఇంద్రా రెడ్డి కి ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే



**రంగారెడ్డి ఏప్రిల్ 22 (మనం న్యూస్):** మాజీ హోంమంత్రి, తెలంగాణ ఉద్యమ పోరాట యోధుడు స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రా రెడ్డి వర్ధంతి సందర్భంగా మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంద్రారెడ్డి ఆశయాలను కొనసాగించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ముందుండి నడిచిన తొలి నాయకుల్లో ఒకరు అని, ఆయన బడుగు, బలహీన వర్గాల కోసం చేసిన పోరాటం ఆదర్శప్రాయమైనది. నేటి తెలంగాణ రాష్ట్రం రూపుదిద్దుకున్న దారిలో ఆయన పాత్ర మరువలేనిది' అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మీర్ పెట్ మున్సిపల్ కార్పొరేషన్ టిఆర్ఎస్ ప్రెసిడెంట్ అర్కల కామేష్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్ గౌడ్, సిద్దాల బీరప్ప, మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సీను నాయక్, పో రెడ్డి ప్రభాకర్ రెడ్డి, బాలరాజ్, మహిళా అధ్యక్షురాలు సునీత బాలరాజ్, సుర్వీలత శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది టూ ఉగాది డైరీ ఆవిష్కరణ

**రంగారెడ్డి,ఏప్రిల్22(మనం న్యూస్):** ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కాకతీయుల కాలం నా నిర్మించినటువంటి కర్మన్ ఘాట్ ఆలయంలో ఆలయ కార్యనిర్వాహన అధికారి లావణ్య పర్యవేక్షణలో మంగళవారం అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉగాది టు ఉగాది డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అర్చకులు అంబ ప్రసాద్ శర్మ, చంద్రకాంత్ శర్మ, సంతోష్ శర్మ వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... దేవాలయంలో అర్చక ఉద్యోగాలు నిర్వహిస్తున్నవారు ఐక్యమత్యం, ఆరాధన భావంతో



పనిచేయాలని, ఇప్పుడే ఆలయంలో ఆధ్యాత్మిక ధార్మిక భావనలు పెంపొందుతాయని అన్నారు. మనోభావాలే ముఖ్యమని గుర్తు చేశారు. అధికారులు అర్చకులు కలిసి ఆలయ అభివృద్ధికి దోహదపడాలని అన్నారు. ఆలయాలు పచ్చదనం పరిశుభ్రత విరజిల్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆలయ శాఖ మంత్రి కొండా సురేఖ రెడ్డి ఆశయమని అందుకు తగ్గట్టుగానే ప్రయాగరాజ్ లో జరిగినటువంటి మహా కుంభమేళకు దీటుగా మే నెలలో 15వ తారీఖున నుండి భూపాలపల్లిలోని కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి సన్నిధిలో త్రివేణి సంగమమైన అంతర్వాహిని సరస్వతి నది పుష్కరాలు ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగే పుష్కరాలకు ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరూ వచ్చి పుణ్యస్నానాలు ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు రమాదేవి, వెంకట య్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సౌకర్యం కల్పిస్తాం

**ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**తుర్కయంజాల్, ఏప్రిల్ 22( మనం న్యూస్):** మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, డీఈఓ సుశీందర్ రావు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాలలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పాఠశాలలో



ఉపాధ్యాయుల సంఖ్య తక్కువ ఉండడంతో అధికారులతో మాట్లాడి త్వరలోనే ఏడు మంది ఉపాధ్యాయులను భర్తీ చేస్తామన్నారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, వాష్ రూమ్ లు పెంచేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జగదీశ్వర్, మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ, మాజీ కౌన్సిలర్ కోశిక ఐలయ్య, నాయకులు గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, సామ భీమ్ రెడ్డి, కుంట గోపాల్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, పూజారి శంకరయ్య, రేవల్ల యాదగిరి, నారని శేఖర్ గౌడ్, ఒరుసు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి,జ్యోతి, ఉపాధ్యాయులు డి ఈ బిక్షపత్తి,ఎ ఈ చంద్రశేఖర్ రెడ్డి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్, పాల్గొన్నారు.

## నేడు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

**రంగారెడ్డి, ఏప్రిల్ 22 (మనం న్యూస్):** భూభారతి చట్టం పై అవగాహన సదస్సులను బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు అని సరూర్ నగర్ మండల తహసిల్దార్ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. సరూర్ నగర్ లోని జిహెచ్ఎంసి కౌన్సిల్ హాల్ లో ఉదయం 9 గంటలకు , బాలాపూర్ లోని బడంగ్ పేట్ లోని మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో మధ్యాహ్నం 2 గంటలకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం కు ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి , ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారు అని అన్నారు. మండలంలోని అందరు మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుంది: దేప భాస్కర్ రెడ్డి

**రంగారెడ్డి ఏప్రిల్ 22 (మనం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుంది అని కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం వ్యవస్థలన్ని నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతుందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచెన్న గారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రామకృష్ణ పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ లోని నిర్వహించిన జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ సమావేశనికి దేప భాస్కర్ రెడ్డి, రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సన్నబియ్యం- సహపంక్తి భోజనం చేశారు.ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జై భీమ్ జై బాబు జై సంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోడీ ప్రభుత్వం విధానాలను ప్రజలు వివరించాలని పార్టీ నేతలు కార్యకర్తలుకు పిలుపునిచ్చారు. 11 ఏళ్లగా రాజ్యాంగాన్ని రాజ్యాంగ విలువలని కాలగర్భంలో కలిపేసే ప్రయత్నం బిజెపి చేస్తుందని మండిపడ్డారు. రాజ్యాంగ విలువలని గౌరవిస్తూ రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ తీసుకుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మధుసూదన్ రావు, ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్, తలాటి రమేష్ , బొడ్డుపల్లి మహేందర్, రాజు నాయక్, ప్రేమ్ నాయక్,కళ్యాణ్ యాదవ్, లింగస్వామి గౌడ్,అలేటి కిరణ్, పెద్దవూర సైదులు,నబి, సంహేడ్ జహంగీర్, మహమ్మద్, హరి, సలీం, రఫీ,రేణుక సుజాత రెడ్డి, మాధవి,మమత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే నిధులతో సిసి రోడ్డు పనులు



**చేవెళ్ల, ఏప్రిల్ 22(మనం న్యూస్):**గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కృషి చేస్తున్నారని మాజీ సర్పంచ్ శేరి శివారెడ్డి అన్నారు. మంగళవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్ వార్డులో ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించేలా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలి:నక్క శరత్ కుమార్

**ఎల్బీనగర్ ఏప్రిల్ 22 (మనం న్యూస్)** బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలి అని బీమ్ ఆర్మీ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ నక్క శరత్ కుమార్ అన్నారు. బెంగాల్ లో హిందువులను టార్గెట్ చేస్తూ చేస్తున్న హింసాకాండ కు వ్యతిరేకంగా ఆర్కే పురంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శరత్ కుమార్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్లోని ముర్షిదాబాద్ జిల్లా జఫ్రాబాద్ ప్రాంతంలో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా గత వారం నుంచి జరుగుతున్న నిరసనల నేపథ్యంలో ఘటనలో హత్యకు గురైన దళిత కుటుంబానికి చెందిన హరోగోబిందో దాస్ , అతని కుమారుడు చందన్ దాస్. బెంగాల్లో హిందువులపై దాడులు జరుగుతున్నా అక్కడి ప్రభుత్వం ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం సిగ్గు చేటు అన్నారు. మమతా బెనర్జీ వెంటనే రాజీనామ చేయాని అని కోరారు. బెంగాల్లో దాడులు ఆగకపోతే భారీ ఎత్తున నిరసనలు చేస్తామని చెప్పారు. ఈ మతోన్మాద శక్తులను తిప్పికోడతాం అన్నారు. ఈ కార్యక్రమం లో సయ్యద్ అలీ, సాయి, శ్రీధర్, సత్యనారాయణ, పవన్, సతీష్, బాల కొటేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఎల్.ఆర్.ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణకు అవకాశం.
- ఈ నెల 30లోగా చేసుకుంటే 25 శాతం రాయితీ వర్తింపు.
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**నిజామాబాద్ ప్రతినిధి మనం న్యూస్ , ఏప్రిల్ 22 :**అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణకు, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ 25 శాతం రాయితీ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వారందరూ నిర్ణీత గడువు లోగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. రాష్ట్ర సచివాలయం నుంచి మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారితో కలిసి రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 30వ తేదీ నాటితో ఎల్ ఆర్ ఎస్ రాయితీ గడువు ముగుస్తుందని, దానిని పొడిగించబోమని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లాలో అర్హులైన వారందరు ఎల్ ఆర్ ఎస్ రాయితీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని గుర్తు చేశారు. ఎఫ్.టి.ఎల్, నిషేధించిన సర్వే నెంబర్లు



మినహా ఎల్.ఆర్.ఎస్ కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి పరిశీలించుకోవచ్చని అన్నారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులు ఈ నెల 30వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు. రుసుము చెల్లించిన వారి దరఖాస్తును అధికారులు పరిశీలించి వెంటదివెంట అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అనేక మంది తమ ప్లాట్లను, అనధికార లే ఔట్లను రాయితీతో కూడిన రుసుము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకున్నారని అన్నారు.

## పుస్తకం పదాల క్షేత్రం



పుస్తకం అక్షర పద క్షేత్రం
త్రికాల దర్శన నేత్రం
పదాల పంట
అనుభూతులై జాలువారు
పెదాల వెంట
పుస్తకం మస్తిష్క మధనం
అక్షరాల తో రణం
పుస్తకం విజ్ఞాన సాగరం
పుస్తకం పరోక్ష గురువులు
పెంపొందించు స్వీయ ఆలోచనలు
పుస్తకం విజ్ఞాన వాహిని
విజ్ఞాన సంపదలను
మానవాళికి అందించే ప్రసాదాలు
పుస్తకం తరాల సంస్కృతి సంపద
పుస్తకం మహా సముద్రం
ఎక్కడ మునిగి ఎక్కడ తేలుతామో!
పుస్తకాలు చదువ
జీవితాలు చాలునే!

పుస్తకానికి మతిమరుపుండదు
కాలానుగుణంగా మారుతుంది
తాళపత్ర గ్రంథాల నుండి
ఆధునిక ఇంటర్ నెట్ వరకు
మారుకుంటు మనిషిని మార్చుకుంటు
పుస్తకం సదా సజీవంగా ఉంటుంది.

**(అంతర్జాతీయ పుస్తక దినోత్సవ సందర్భంగా)**

**- పల్లొళ్ళ బక్కారెడ్డి**
**9705315250**

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# విశ్వ వేదికపై ఆంగ్ల భాషా ప్రాముఖ్యత



పరస్పర భావ వనిమయానికి భాష ఒక బలమైన వారధి. భాష ద్వారానే మనుషులు తమ సంస్కృతిని, జ్ఞానాన్ని తరతరాలకు బదిలీ చేస్తారు. ఒకనాటి బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణ ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లం మాట్లాడే వారి సంఖ్య అనూహ్యంగా పెరిగింది. భాష కేవలం భావ వ్యక్తీకరణకు ఒక సాధనమే కాదు ! అంతకు మించి ఒక గొప్ప సాంస్కృతిక సంపద.

**ఆంగ్ల భాషా దినోత్సవం వెనుక కథ:**

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 23న ఆంగ్ల సాహిత్య శిఖరం, నాటక చక్రవర్తి విలియం షేక్స్పియర్ పుట్టినరోజుతోపాటు మరణించిన రోజు కూడా కావడంతో ఈ రోజును ఆంగ్ల భాషా దినోత్సవంగా జరుపుకోవడం విశేషం. 1564 ఏప్రిల్ 23న జన్మించిన ఆయన విధి విచిత్రంగా సరిగ్గా 52 ఏళ్ల తర్వాత 1616 ఏప్రిల్ 23న కన్నుమూశారు. ఆంగ్ల సాహిత్యంలో తిరుగులేని రచయితగా షేక్స్పియర్ ఆధునిక ఆంగ్ల భాషపై చెరగని ముద్ర వేశారు. భాషతో ఆయన చేసిన సృజనాత్మక ప్రయోగాలు అద్భుతం. వందలాది కొత్త పదాలు, పదబంధాలను ఆంగ్ల భాషకు అందించారు. నేడు మనం విరివిగా వాడే 'గాసిప్', 'ఫ్యాషన్', 'లోన్లీ' వంటి పదాలు మొదట షేక్స్పియర్ కలం నుండి జాలువారినవే. అంతేకాదు, 'బ్రేక్ ది ఐస్', 'ఫైంట్-హార్టెడ్', 'లవ్ ఈజ్ బ్లైండ్' వంటి ఎన్నో అందమైన పదబంధాలను ఆయనే పరిచయం చేశారు. ఆయన రచించిన 39 నాటకాలు, 154 సొనెట్లు, మూడు సుదీర్ఘ కథన పద్యాలు ఆంగ్ల సాహిత్యాన్ని భాషను సుసంపన్నం చేశాయి. కానుకలు. నిపుణులు భావించేదాని ప్రకారం ఆయన రచనల్లోని విషాద ఛాయలు ఆయన వ్యక్తిగత జీవితంలోని దురదృష్టకర సంఘటనలకు అద్దం పడతాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే షేక్స్పియర్ సుమారు 1700 కొత్త పదాలను ఆంగ్ల భాషకు బహూకరించారు.

**ఈ ఏడాది ప్రత్యేక ఇతివృత్తం**

2025 సంవత్సరానికి ప్రపంచ ఆంగ్ల భాషా దినోత్సవం యొక్క ఇతివృత్తం 'ఇంగ్లీష్'. ఈ అంశం ప్రపంచ భావ వ్యక్తీకరణ, సహకారం కోసం ఆంగ్లం పోషిస్తున్న కీలక పాత్రను నొక్కి చెబుతుంది. అంతేకాకుండా, ఆంగ్లం విభిన్న సంస్కృతులను ఎలా కలుపుతుంది ? భావ వ్యక్తీకరణ అడ్డంకులను ఎలా తగ్గిస్తుంది ? అనే విషయాలపై చర్చలు జరుగుతాయి. అంతర్జాతీయ దౌత్యం, సాహిత్యం, శాస్త్ర విజ్ఞానం, విద్య వంటి అనేక రంగాలలో ఆంగ్లం ప్రాముఖ్యతను ఈ రోజున గుర్తు చేసుకుంటారు. నేటి ప్రపంచంలో బహుభాషావాదం యొక్క ప్రాధాన్యతను, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు ప్రపంచంలో ఆంగ్ల భాష ప్రత్యేక స్థానాన్ని చాటి చెప్పడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం. యునెస్కో 2010లో మొదటిసారిగా ఈ దినోత్సవాన్ని నిర్వహించింది. ప్రపంచంలోని 75 కంటే ఎక్కువ దేశాలు ఆంగ్లాన్ని తమ అధికారిక భాషగా గుర్తించాయి. భాషను అన్వేషించడం ద్వారా బహుభాషావాదం సాంస్కృతిక వైవిధ్యాన్ని ఎలా పరిరక్షిస్తుందో తెలియజేయడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. ఆంగ్ల భాషా దినోత్సవం చరిత్ర, సంస్కృతి, భాషతో ముడిపడి ఉన్న విజయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం దీని ముఖ్యోద్దేశం.



**నేటి ప్రపంచంలో ఆంగ్లం యొక్క అనివార్యత**

ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా మాట్లాడే రెండవ భాషగా ఆంగ్లం తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ప్రపంచీకరణ యుగంలో ఆంగ్లం నేర్చుకోవడం ఒక అనివార్య అవసరంగా మారింది. వివిధ దేశాల ప్రజలు ఒకరితో ఒకరు సులభంగా సంభాషించడానికి ఇది ఒక విశ్వ వేదికగా ఉపయోగపడుతుంది. బహుళజాతి కంపెనీలు ఆంగ్లంపై పట్టు ఉన్న ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాయి. ప్రపంచంలోని అనేక ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో ఆంగ్ల మాధ్యమంలోనే విద్యా బోధన కొనసాగుతోంది. సైన్స్, ఏవియేషన్, కంప్యూటర్లు, దౌత్యం, పర్యాటకం వంటి అనేక కీలక రంగాలకు సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు అధికంగా ఆంగ్లంలోనే అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్, ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలకు ఆంగ్లమే ప్రాథమిక ఆధారం. నేటి డిజిటల్ యుగంలో ప్రపంచవ్యాప్తంగా కంప్యూటర్లలో నిక్షిప్తం చేయబడిన సమాచారంలో 80 శాతానికి పైగా ఆంగ్లంలోనే ఉండటం విశేషం. దాదాపు అన్ని ముఖ్యమైన వెబ్సైట్లు ఆంగ్లంలోనే రూపొందించబడ్డాయి. అంతర్జాతీయ వ్యాపార లావాదేవీలకు ఆంగ్లం ఒక కీలకమైన సాధనం. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య సంబంధాలు విజయవంతంగా కొనసాగించడానికి ఆంగ్ల భాషా పరిజ్ఞానం అవసరం. ఆంగ్లం నేర్చుకోవడం కేవలం ఉద్యోగ అవకాశాలనే కాకుండా ఇతర సంస్కృతులను అర్థం చేసుకోవడానికి, విభిన్న ప్రాంతాల ప్రజలతో నిజమైన అనుబంధం ఏర్పరచుకోవడానికి, వారి జీవనశైలిని తెలుసుకోవడానికి కూడా సహాయపడుతుంది.

**ప్రపంచ పటంలో ఆంగ్ల స్థానం**

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 కోట్ల మంది ప్రజలు ఈ భాషను మాట్లాడుతున్నారు. ఈ సంఖ్య 2050 నాటికి 200 కోట్లకు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మన భారతదేశంలో దాదాపు 14 కోట్ల మంది అంటే జనాభాలో 10 శాతం మంది ఆంగ్లం మాట్లాడేవారు ఉన్నారు. ఆంగ్లం మాట్లాడే వారిని 'ఆంగ్లోఫోన్స్' అని పిలుస్తారు. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో రెండవ స్థానంలో ఉన్న మాండరిన్ చైనీస్ కంటే ఆంగ్లం మాట్లాడే వారి సంఖ్య 28 శాతం అధికంగా ఉండటం గమనార్హం. సుమారు 1500 సంవత్సరాల క్రితం కేవలం మూడు తెగల ప్రజలు మాత్రమే ఈ భాషను మాట్లాడేవారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 95 కోట్ల మంది ఆంగ్లాన్ని వారి మొదటి భాషగా, మరో 60 కోట్ల మంది రెండవ భాషగా మాట్లాడుతున్నారు. ఆంగ్లం ప్రపంచంలో అత్యంత విస్తృతంగా మాట్లాడబడుతున్నందున దీనిని తరచుగా 'ప్రపంచ భాష'గా అభివర్ణిస్తారు. ఇది ఆధునిక యుగం యొక్క భాష. అనేక దేశాలలో అధికారిక భాష కానప్పటికీ ప్రస్తుతం ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా బోధించే ఒక విదేశీ భాషగా ప్రాచుర్యం పొందింది. ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీతో సహా అనేక ముఖ్యమైన అంతర్జాతీయ సంస్థల అధికారిక భాషల్లో ఆంగ్లం ఒకటి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో పనిచేసే వ్యోమగాములకు రష్యన్‌తోపాటు ఇది ఒక సహ అధికారిక భాష కావడం దీని ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లం మాట్లాడే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఆంగ్లం ఇతర భాషల నుండి అనేక పదాలను స్వీకరించింది.

**ఆంగ్లంలోని కొన్ని ఆసక్తికరమైన విషయాలు:**

ఆంగ్ల భాషలో వ్యాకరణపరంగా సరైన అతి చిన్న వాక్యం 'గో'. కేవలం ఒక అక్షరం కలిగిన 'ఐ' అతి చిన్నదైనప్పటికీ అత్యంత పురాతనమైన సాధారణంగా ఉపయోగించే పదం. ఆంగ్లంలో ఎక్కువగా ఉపయోగించే విశేషణం 'గుడ్', సాధారణంగా ఉపయోగించే నామవాచకం 'టైమ్'. 'సెట్' అనే పదానికి అత్యధిక సంఖ్యలో నిర్వచనాలు ఉన్నాయి. మనం తరచుగా వాడే 'గుడ్బై' అనే పదం 'గాడ్ బి విత్ యూ' అనే పాత ఆంగ్ల పదబంధం నుండి వచ్చింది. మొత్తం ఆంగ్ల భాషలోని పదాలలో 11 శాతం అక్షరాలు 'ఈ'ని కలిగి ఉంటాయి. ప్రపంచంలోని అత్యంత సంతోషకరమైన భాషల్లో ఇంగ్లీషు ఒకటిగా పరిగణించబడుతుంది. 'సాడ్' అనే పదం కంటే 'హ్యాపీ' అనే పదం మూడు రెట్లు ఎక్కువగా ఉపయోగిస్తారు! 'ది క్విక్ బ్రౌన్ ఫాక్స్ జంప్స్ ఓవర్ ది లేజీ డాగ్' అనే వాక్యంలో ఆంగ్లంలోని అన్ని అక్షరాలు ఉండటం విశేషం. ప్రతి 98 నిమిషాలకు ఒక కొత్త ఆంగ్ల పదం డిక్షనరీలో చేరుతుంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం, గూగుల్ సమాచారం ప్రకారం ఆంగ్లంలో మొత్తం 1,022,000 పదాలు ఉన్నాయి. అయితే ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ప్రకారం ప్రస్తుతం వాడుకలో ఉన్న పదాలు కేవలం 170,000 మాత్రమే.

**ఆకాశ భాష – ఆంగ్లం:**

విమానాలు నడిపే పైలట్లు తమ మాతృభాష ఏదైనాప్పటికీ, గాలిలో వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా ఆంగ్లంలోనే మాట్లాడాలి. అందుకే ఆంగ్లాన్ని సరదాగా 'ఎయిర్ భాష' అని కూడా అంటారు. ఆంగ్ల భాష నేర్చుకోవడం ద్వారా వ్యక్తిగత, విద్యా, వృత్తిపరమైన జీవితంలో అనేక అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ఇది ప్రపంచంతో అనుసంధానం కావడానికి ఒక శక్తివంతమైన సాధనం.

**నేడు షేక్స్పియర్ జయంతి,ఆంగ్ల భాషా దినోత్సవం**

**- జనక మోహన రావు దుంగ**
**8247045230**

# మానవ పరివర్తనకు పుస్తకం ఓ నేస్తం



పుస్తకం ఓ మంచి నేస్తం. ఓ మంచి పుస్తకం చదవడంలో ఉన్న ఆనందం అనుభవించే వాళ్ళకే తెలుస్తోంది. పుస్తకం అమ్మలా లాలిస్తుంది, నాన్నలా ఆదరిస్తుంది, గురువులా హితబోధ చేస్తుంది, ఒంటరితనంలో స్నేహితుడిలా అక్కున చేర్చుకుంటుంది, బాధపడే వారిని ఓదారుస్తుంది. మనిషిలో మానసిక పరివర్తనను తీసుకువస్తుంది. అలసిన మనసులకు సేద తీర్చుతుంది. అందుకే పుస్తకం అనితరమైన ఆయుధంగా,నేస్తంగా సమస్తంగా అన్ని తరాలవారినీ అలరిస్తోంది. జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి దారి చూపెట్టే సాధనంగా దోహదపడుతుంది. మనోవికాసానికి, మార్గనిర్దేశానికి గురువులా ఉపయోగపడుతుంది. అందుకే జీవితంలో నిజమైన నేస్తం.. పుస్తకం. మానవజీవన గమనం, విధానంలో పుస్తకాలు వచ్చాక విప్లవాత్మక మార్పులు వచ్చాయంటే నమ్మాల్సిందే. ఆధునిక జీవన విధానం చుట్టుముడుతున్న ఈ రోజుల్లోనూ పుస్తక పఠనాన్ని ఇష్టపడేవారూ తగ్గలేదని యునెస్కో చెప్పింది. ప్రముఖ ఆంగ్ల రచయిత విలియం షేక్స్పియర్ వర్ధంతి సందర్భంగా ప్రతిఏటా ఏప్రిల్ 23వ తేదీన ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని నిర్వహించాలని యునెస్కో నిర్ణయించింది. ఈ దినోత్సవాన్ని1995 నుంచి నిర్వహిస్తున్నారు. ఈ రోజును కాపీ హక్కుల దినోత్సవంగా కూడా జరుపుకుంటారు. అదేవిధంగా ఈ రోజున ప్రపంచంలో ఒక ప్రముఖ నగరాన్ని ప్రపంచ పుస్తక రాజధానిగా ప్రకటిస్తారు. ఈ సంవత్సరం బ్రెజిల్ లోని రీడి జీనరో(ఖజీ° ఛీీ ఋ్బజీట౯, ఆట్బజీజా) పట్టణాన్ని 'పుస్తక రాజధాని'గా ప్రకటించడం జరిగింది. ఈ దినోత్సవాన్ని (ఖ్బఛీ గా౯టు గ్బిఢ) 'మీ మార్గంలో చదవండి' అనే ఇతివృత్తంతో నిర్వహించుకోవడం జరుగుతోంది. కాలం ఎంత మారినా పుస్తక ప్రియులకు కొదవ లేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్ మొబైల్ లాంటి అనేక ఆధునిక సాంకేతికత సాధనాలు అందుబాటులోకి వచ్చిన పుస్తకం పఠనానికి ప్రత్యేకత ఉన్నది. పుస్తకాలు గొప్ప ఆలోచనకు పదును పెట్టి అనేక ఆవిష్కరణలు చేయడానికి తోడ్పడతాయి. మనుషులలో అజ్ఞానం ఛాయలు తొలగిపోయి విజ్ఞానం వైపు నడిపించే నావ ఓ మంచి పుస్తకం. 'పుస్తకాలు మనో మాలిన్యాలను తొలగించి దీపాలు'అని భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ దేశ వాసులు ఎక్కువసేపు పుస్తకాలు చదువుతారానే విషయంపై ఓ అంతర్జాతీయ సర్వే నిర్వహించగా ఆ సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ప్రపంచంలో అందరికన్నా ఎక్కువ సేపు పుస్తకాలు చదివే వారు భారతీయులని ఆ సర్వే పేర్కొనడం హర్షించదగ్గ విషయం. నేటి డీజిటల్ యుగములో 71 శాతం ప్రజలు పుస్తకాలను డిజిటల్ సాధనాలపైనే, కేవలం 29 శాతం మాత్రమే ప్రత్యక్షంగా పుస్తకాలను చదువుతున్నారని పేర్కొనడం జరిగింది. డిజిటల్ యుగంలో పుస్తకాలు చదివే అలవాటులో కూడా విప్లవాత్మకమైన మార్పు వచ్చిందని చెప్పవచ్చు.



ఒకప్పుడు మనుషులు ప్రయాణాలు చేస్తున్నప్పుడు, విశ్రాంతి సమయంలో చేతిలో పుస్తకం ఉండేది, కానీ నేడు ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఉండడమే దీనికి కారణమని చెప్పవచ్చు.

ప్రపంచంలో పుస్తక భాండాగారం గురించి తెలుసుకోవాలంటే మనదేశంలో కూడా ఐదు ప్రముఖ పుస్తక మార్కెట్లు ఉన్నాయి. ఇక్కడ కొత్త పుస్తకాలే కాదు పాత పుస్తకాలు మరెక్కడ దొరకని అరుదైన గ్రంథాలు లభిస్తాయి. అవి దేశ రాజధాని ఢిల్లీలో రెండు పుస్తక మార్కెట్లు ఉన్నాయి. దరియాగంజి, నైసాదక్ మార్కెట్లు ప్రసిద్ధి గాంచినవి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్కతాలో ఉండే పుస్తక మార్కెట్ వారసత్వంగా వస్తున్న ఆస్తిగా పేర్కొంటారు. మనదేశంలో అతి పెద్ద పుస్తక మార్కెట్ ఇది. పూణెలోని అప్పా బల్వంత్ చౌక్లో ఉండే పుస్తక మార్కెట్లో ప్రపంచంలో విలువైన పుస్తకాలన్నీ లభ్యమవుతాయి. హైదరాబాద్లోని కోఠి కూడా విలువైన పుస్తకాలకు కేంద్రంగా ఉంది. ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసే, వ్యక్తిత్వ వికాసానికి పదునుపెట్టే పుస్తకాల్లోని ప్రతి అక్షరం జీవంతో తొణకిసలాడుతుందని మరువద్దు. పుస్తకాలను ఎంపిక చేసుకునేటపుడు సమకాలీన సమస్యలకు పరిష్కారాన్ని చూపిస్తూ మార్గనిర్దేశం చేసేవాటిని ఎంపిక చేసుకొని ఆనందమయ జీవితానికి యువత బాటలు వేసుకోవాలి. పుస్తకం మహాసముద్రంలాంటిది. అందుకే సంఘ సంస్కర్త కందుకూరు విరేశలింగం పంతులుగారు చిరిగిన చొక్క అయినా తొడుక్కోగానీ మంచి పుస్తకం కనుక్కో అని అన్నారు. కాని నేడు సాంకేతిక విజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న కొద్ది ఇంటర్నెట్, వాట్సాప్ సంభాషణలతో పసి పిల్లాడి నుంచి పెద్దల వరకు విలువైన కాలాన్ని వృథా చేస్తున్నారే గానీ ఎవ్వరూ కూడా మంచి పుస్తకం చదవటానికి మక్కువ చూపటం లేదు. చిన్నప్పటి నుంచి పిల్లల్లో కథలు పుస్తకాలు చదివే అలవాటు చేస్తే అదే అలవాటుగా మారి యువతరం అన్ని విషయాల్లో పోటీపడినట్లే పుస్తకాలు చదవటంలో పోటీపడతారు. మనిషి మేధస్సును విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతో దోహదపడతాయానడంలో సందేహం లేదు. ఒకసారి విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ తుదివరకు జీవితాన్ని నడిపిస్తుంది. పుస్తకాలు చదవడం అంటే మానవత్వాన్ని పంచుకోవడం. ఇతరుల జీవితాల్లోకి అడుగుపెట్టడానికి, వారి కళ్లతో ప్రపంచాన్ని చూడటానికి, వారితో సహానుభూతి చెందడానికి పుస్తక పఠనం వీలు కల్పిస్తుంది. మహోన్నత విజ్ఞానం అందించే పుస్తక జ్ఞానాన్ని ప్రతి ఒక్కరు అందిపుచ్చుకొని అజ్ఞానపు పొరలను తొలిగించు కోవాలి. అప్పుడే మనిషి ఉన్నత శిఖరాలను అధిరోహించుకోవడనికి అవకాశం ఉంటుంది. కావునా పుస్తకాలను చదవడం అలవాటుగా మార్చుకొని వాటి శక్తిని తెలుసుకోండి.

**(నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం)**

**- సంపతి రమేష్ మహారాజ్**
**7989579428**

## మన శక్తి, మన గ్రహం...మన బాధ్యత



ప్రతి సంవత్సరం ఏప్రిల్ 22న జరుపుకునే భూమి దినోత్సవం ఈసారి 55వ వసంతంలోకి అడుగుపెడుతోంది. 1970లో అమెరికాలో ఒక చిన్న ఉద్యమంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం, ఈ రోజు 193 దేశాలలో బిలియన్ మందికిపైగా ప్రజలను ప్రభావితం చేస్తూ ప్రపంచ స్థాయిలో నిర్వహించబడుతుంది.

2025 ఏప్రిల్ 22న, భూమి దినోత్సవం 55వ వార్షికోత్సవాన్ని జరుపుకోనుంది, ఈ సందర్భంగా 192 దేశాలు మరియు ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది ప్రజలు పాల్గొనే అవకాశం ఉంది. ఇది భవిష్యత్తు కోసం అన్ని వర్గాల ప్రజలను కలిపి పనిచేసే దీర్ఘకాల సమావేశ శక్తినిప్రదర్శిస్తుంది.



ఈ ఏడాది భూమి దినోత్సవం మన శక్తి, మన గ్రహం అనే థీమ్‌తో రూపొందించబడింది. శక్తి ఉత్పత్తిలో పునరుత్పాదక వనరులను మరింతగా వినియోగించాలి. ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తించాలి. భూమిని కాపాడడంలో భాగస్వామిగా మారాలి. ఈ లక్ష్యంతో 2030 నాటికి శుద్ధ విద్యుత్ ఉత్పత్తిని మూడింతలు పెంచాలన్నదే ఎర్త్ డే నెట్‌వర్క్ ప్రధాన దృష్టికోణం.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 16 నుంచి 22 వరకు భూమి వారం నిర్వహించబడుతోంది. మొక్కలు నాటడం, శుభ్రత కార్యక్రమాలు, పర్యావరణంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా జరుగు తున్నాయి. ఏప్రిల్ నెలంతా భూమి నెలగా అనేక చైతన్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలు మరింత పర్యావరణ పరిష్కారాలు అంగీకరించి, పునరుత్పాదక శక్తి వినియోగం, చెట్టు నాటడం వంటి చర్యలు చేపట్టాలని ప్రోత్సహించబడుతున్నారు.

పర్యావరణ సమస్యలు ఇప్పుడు ప్రపంచానికి పెనుముప్పుగా మారాయి. గాలి కాలుష్యం, నీటి కొరత, వాతావరణ మార్పులు - ఇవన్నీ మన ఆరోగ్యాన్ని, భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి.

ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు పచ్చ విధానాలను తీసుకురావాలి. పరిశ్రమలు హరిత మార్గాలను అవలంబించాలి. ప్రతి వ్యక్తి కూడా తన జీవనశైలిలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మార్పులు చేసే ప్రతి చిన్న ప్రయత్నం కూడా భూమిని కాపాడడంలో భాగస్వామ్యం అయ్యి, గ్లోబల్ స్థాయిలో పెద్ద మార్పు తీసుకొచ్చే అవకాశం ఉంది.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి. విద్యుత్‌ను ఆదా చేయాలి. ప్రకృతిని పరిరక్షించే అలవాట్లను అలవరుచుకోవాలి. మనం తీసుకునే ప్రతి చిన్న చర్య భూమి రక్షణ దిశగా పెద్ద మార్పును తీసుకురాగలదు.

భూమి కోసం సమగ్ర చర్యలు తీసుకోవడం అనేది మనందరి బాధ్యత. మనం ప్రస్తుతమున్న ప్రకృతిని కాపాడాలని కోరుకుంటే, ఆ ప్రకృతిని కాపాడటానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలి.

ప్రపంచ ఆర్థిక వేదిక ప్రకటించిన గ్లోబల్ రిసెర్చ్ రిపోర్ట్ 2025 ప్రకారం, రాబోయే పదేళ్లలో మనకు ఎదురయ్యే ప్రధాన ప్రమాదాల్లో సగం వరకూ పర్యావరణ సమస్యలే ఉండే అవకాశం ఉంది. ఈ నివేదిక ప్రకారం, మనం ఇప్పటి నుంచే సమగ్ర మార్పులు తీసుకోవాలి. ఇతర సమస్యలతో పోలిస్తే, పర్యావరణ సమస్యలు ఎక్కువగా ప్రభావం చూపే ప్రమాదాలను కలిగిస్తున్నాయి. వాటి పరిష్కారం కోసం ప్రతి ఒక్కరి ప్రయత్నం అత్యవసరం.

ఈ పరిస్థితుల్లో, భూమి వేచి ఉండలేని పరిస్థితి వచ్చింది. మన చేతుల్లో భవిష్యత్తు ఉంది. ఆ భవిష్యత్తు శుభ్రమైనదిగా ఉండాలంటే, మార్పు ఇప్పుడే మొదలవ్వాలి. భూమి కోసం మనం ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఇదే. భవిష్యత్తుకు మనం ఇప్పుడు నిర్ణయం తీసుకోవాలి.ప్రతి చిన్న చర్య కూడా పర్యావరణంలో మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తుంది.ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఈ థీమ్‌ను అనుసరించి పునరుత్పాదక శక్తి వినియోగాన్ని ప్రోత్సహించడానికి చర్యలు చేపడుతున్నాయి. స్వచ్ఛమైన, పునరుత్పాదక శక్తి వినియోగం మన భవిష్యత్తుకు కీలకమైనదిగా మారింది.భూమి పట్ల మన ప్రేమను మన బాధ్యతను గుర్తెరగడానికి ఈ ప్రపంచ ధరిత్రి దినోత్సవం మేలు చేస్తుంది. మనల్ని ప్రతి ఒక్కరిని మార్పు కోసం ప్రేరేపించే అవకాశం ఇస్తుంది. అప్పుడే జనహితం జరుగుతుంది.

**-డా. కృష్ణ కుమార్ వేపకొమ్మ**

## ఏ ఈర్ష్య శకలం రాలిపడిందో?



ఇసుక తుఫానుతో
కళ్లని కప్పేసి
మనిషిని ఎర్రని గాలికి
కట్టేసాడు.

బతుకుగోళంపై
ఏ ఈర్ష్య శకలం
రాలిపడిందో?
ముఖాల్లో గోతులు
పడి
మాట మౌనంలో
కూరుకుపోయింది.

నిన్ననేగా
సముద్రంలా వాడు
కౌగిలి కెరటంగా
మనసును చల్లపరిచాడు.

ఈ రోజేమిటి?
వెనక్కి వెళ్లి ఎడారిగా మారి
ఎండిన మనసుల
రాపిడిలో
చూపులు చిరిగి
నల్లని దృశ్యాల మధ్య నిజాలని
గుర్తుపట్టడం కష్టమైంది వాడికి.

**- చందలూరి నారాయణరావు**
**9704437247**

## ఎదురు చూడు !

ఎదురుచూడు
పరిస్థితులు ఎరగాలంటే
నష్టం కాదు !
వెంటెళ్ళి చూడు
ఎదుటివారు తెలియాలంటే



కష్టం కాదు !
ఆల్చిప్ప స్వాతి చినుకులకు
ఎదురు చూస్తేనే కదా
ముత్యం అవుతుంది!
సీతమ్మ ఓపిక పడితేనే కదా
లంకకు వారధి కట్టింది
రావణాసురుని జయించింది !

నూరు తప్పులు చేసే వరకు
సహనం వహిస్తేనే కదా
శిశుపాలుని కంఠం తెగింది!
అజ్ఞాతవాసం ముగిసే వరకు
తెలియకుండా గడిపితేనే కదా
భారత యుద్ధం
జరిగింది!
ఉత్తరాయన
పుణ్యకాలం వరకు
భీష్ముడు బాధ
బరిస్తేనే కదా
స్వర్గ ద్వారం
తెరెచుకుంది!
ఎదగాలంటే
,గెలవాలంటే
కొత్త పొద్దు పొడవాలంటే
ఓపికగా ఎదురు
చూడవలసిందే!

**-పల్లొళ్ళ బక్కారెడ్డి**
**9705315250**

## మాసిపోని అక్షరం...




దేశ దిమ్మరినై తిరుగుతున్న
నన్ను
ఎందుకనో ఆ పల్లె
ఆకస్మికంగా ఆపివేసింది
తొలితలపుల వెలుగురేఖ
తొట్టతొలియవ్వనం రాల్చిన
కన్నీటిచుక్క
ఆరి అట అపురూపమై
కనిపించింది...
గుండెగదిన దాపిన ఆనాటి
జ్ఞాపకాల రాతల్ని
తిరిగిచ్చేయ్యాలని ఆ పల్లె
ఒక్కసారిగా మంత్రం
వేసింది
ఎదురుగా కూర్చుని
ముచ్చటించిన ఆ మోమున
అప్పటి ఆమే మళ్ళీ మళ్ళీ
అగుపించింది...
ఆమెను కలవాలని పాత
సైకిలై సాగిన ఆ ప్రయాణం
ఆమె చూడాలని కనులు
కలపాలని అలుపెరుగని
ప్రయత్నం
తిరుగుప్రయాణంలో నే
చించేసిన ఒక్కో ఉత్తరం
ఓపెన్ విత్ స్మైల్ అంటూ
తను రాసిన మాసిపోని
అక్షరం...

**- అశోక్ గుంటుక**
**9908144099**

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి 'భూభారతి'

- **జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**






**రామడుగు, ఏప్రిల్ 22 (మనం న్యూస్):** దీర్ఘకాలిక భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి ఎంతగానో దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రామడుగు మండల కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్ లో మంగళవారం భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యంతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావానికి తావు లేకుండా జవాబుదారితనాన్ని పెంచేందుకు భూ భారతి నూతన చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కలెక్టర్ తెలిపారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, ఆర్ ఓ ఆర్ మార్పులు చేర్పులు, సాదా బైనామా వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు సరళంగా ఉండే విధంగా గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి రూపొందించారని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయ చుట్టూ తిరగకుండా గ్రామాల్లోకి ప్రజలు దగ్గరకు అధికారులు వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న అసైన్మెంట్, సాదా బైనమాలు, పాసు పుస్తకాలలోని సమస్యలను పరిష్కరించేందుకు కొత్త ఆర్ఓఆర్ చట్టం ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఆధార్ తరహాలో భవిష్యత్తులో భూములకు సంబంధించి సర్వే చేసి, హద్దులు, కొలతలు, భూముల వివరాలు ఒకే పుస్తకంలో ఉండేలా 'భూధార్'ను రూపొందించనున్నట్లు తెలిపారు. సాదా బైనామాల పరిష్కారం వేగవంతం అవడంతో పాటు, వారసత్వ మ్యూటేషన్, హక్కుల సంక్రమణను గడువులో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూభారతి ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు.తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీవోకు, అక్కడ కూడా సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడినదని, భూమి రిజిస్ట్రేషన్,మ్యూటేషన్కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భూభారతి ద్వారా భూమికి సంబంధించిన సమస్యలు జిల్లా స్థాయిలోనే సత్వరం పరిష్కారం అవుతాయని అన్నారు.చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ భూ భారతి చట్టం దేశానికి దిక్సూచిలా నిలవనుందని తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం రైతుల పాలిట శాపంగా మారిందని అన్నారు. ఏ తప్పు చేయకుండానే రైతులను, అధికారులను ధరణి దోషులుగా నిలబెట్టిందని పేర్కొన్నారు. ధరణి చట్టంలోని లోపాలు రైతులు, అధికారుల మధ్య గొడవలు సృష్టించేలా చేశాయని, రైతులను ఆత్మహత్యలకు ఉసిగొల్పాయని అన్నారు. రైతు అవసరానికి భూమి అమ్ముకొనివ్వకుండా చేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎంతోమంది మేధావులు, రాజకీయ నాయకులు, రైతు సంఘాల నాయకులు, అధికారులతో చర్చించి మెరుగైన ఆర్ఓఆర్ చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ చట్టం ద్వారా పేరుకుపోయిన భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని అన్నారు. భూభారతి చట్టంలో అప్పీలు వ్యవస్థ ఉండడం ద్వారా రైతులు అన్ని స్థాయిల్లో ఉన్న అధికారులకు అప్పీలు చేసుకోవచ్చని అన్నారు. కోర్టుల చుట్టూ తిరగాల్సిన పనిలేదని చెప్పారు. వారసత్వ భూముల మ్యూటేషన్ కు ఈ చట్టంలో సత్వర పరిష్కారం లభిస్తుందని అన్నారు. 2004లో ఆ నాటి ప్రభుత్వం రూ.72 వేల కోట్ల రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు.తమ ప్రభుత్వం సుమారు రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసి, దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, తహసిల్దార్ వెంకటలక్ష్మి ఇతర శాఖల అధికారులు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## స్వర్ణయుగాన్ని తలపించిన కేసీఆర్ పదేళ్ల పాలన



- **మహా కుంభమేళా తలపించే విధంగా బిఆర్ఎస్ రజతోత్సవ సభ**
- **మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

**రామడుగు,ఏప్రిల్ 22 (మనం న్యూస్):** ఈ నెల 27న వరంగల్లో జరుగనున్న బిఆర్ఎస్ రజతోత్సవ సభకు జనాన్ని తరలించేందుకు నాయకులు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని,సభకు ప్రజలు,పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రామడుగు మండల బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మంగళవారం రామడుగు మండలం కేంద్రంలోని వైశ్యభవన్ లో మండల బిఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేయ కుండా ఆపసోపాలు పడుతుందని విమర్శించారు. ఈ 16 నెలల కాలంలో రైతులు,కార్మికులు, సామాన్య ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, సబ్బండ వర్గాలు అనేక కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నీ వర్గాలను మోసం చేసి బూటకపు మాటలతో అరాచక పాలన చేస్తున్నారని విమర్శలు చేశారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ప్రజలంతా గమనిస్తున్నారని, రాబోయే ఏ ఎన్నికైనా బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు.రజతోత్సవ సభకు బయలుదేరే ముందు గ్రామాల్లో గులాబీ జెండాలు ఆవిష్కరించాలని, అనంతరం ప్రజలతో కలిసి సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వీర్ల వెంకటేశ్వర రావు, పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్ రెడ్డి, మాజీ ఎంపీ పి మారుకొండ కిష్టారెడ్డి, మాజీ సర్పంచ్ లు ఒంటెల వెంకట్ రమణ రెడ్డి, చాడ శేఖర్ రెడ్డి, పంజాల జగన్, మామిడి తిరుపతి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని వివరించాలి

- **రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




**మంచిర్యాల,ఏప్రిల్ 22(మనం ప్రతినిధి):** భూ సమస్యల పరిష్కారం, రైతుల సంక్షేమం దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో పొందుపరిచిన హక్కులు, అంశాలను ప్రతి రైతుకు వివరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, గృహ నిర్మాణశాఖ అధికారులతో భూ భారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో పైలట్ మండలాలలో రెవెన్యూ సదస్సులు, అవగాహన సదస్సుల నిర్వహణ, పైలెట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, మిగతా గ్రామాలలో అర్హుల జాబితా రూపకల్పన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టం అమలులో భాగంగా రాష్ట్రంలో మొదటగా నారాయణపేట, ఖమ్మం, కామారెడ్డి, ములుగు జిల్లాలలో జిల్లాకు ఒకటి చొప్పున నాలుగు మండలాలను ఎంపిక చేయడం జరిగిందని, ఆయా మండలాలలోని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అంశాల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అందులో పరిష్కరించడానికి వీలు ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఇతర జిల్లాలలో భూభారతి నూతన ఆర్ఆర్ చట్టం లోని అంశాలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి చట్టంలో పొందుపరిచిన హక్కులు, అంశాలను వివరించాలని తెలిపారు.

ఈ నెల 30వ తేదీ వరకు అవగాహన సదస్సులు పూర్తి చేయాలని ఆదేశించారు. పైలెట్ గ్రామాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, మిగతా గ్రామాలలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రతిపాదించిన జాబితాను గెజిటెడ్ అధికారులతో మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపాలని, జాబితాలో అర్హుల వివరాలు మాత్రమే ఉండాలని సూచించారు.

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్ ఓఆర్ చట్టం లోని హక్కులు, అంశాలపై జిల్లాలోని మండలాలలో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించి, ఆ ప్రకారంగా అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు వివరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలలో అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు చట్టంలోని అంశాలు, హక్కులు వివరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ నెల 30వ తేదీలోగా అవగాహన సదస్సుల ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో పైలెట్ గ్రామాలలో ఎంపికైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అర్హులైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, మిగతా గ్రామాలలో అర్హులైన వారి జాబితా రూపకల్పనకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, హౌసింగ్ పి.డి. బన్సీలాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రం సందర్శించిన కలెక్టర్




**రామడుగు, ఏప్రిల్ 22( మనం న్యూస్):** రామడుగు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గల భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రమేలా సత్పతి సందర్శించారు. దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటించారు. టీచింగ్ మెటీరియల్ ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. టైం టేబుల్, సిలబస్ ప్రకారం భవిత కేంద్రం నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కేంద్రంలో చదువుతున్న ప్రతి విద్యార్థికి ప్రత్యేక డైరీని నిర్వహించాలన్నారు. జిల్లా యంత్రాంగం తరపున భవిత కేంద్రాలకు అవసరమైన టీచింగ్, లెర్నింగ్, మెటీరియల్, సౌకర్యాలు సమకూరుస్తామని తెలిపారు. ప్రతి భవితా కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భవిత కేంద్రం పరిధిలోని వి.వోలు సందర్శించి సేవలను పరిశీలించాలని అన్నారు.

# కమనీయం రమణీయం

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

- **ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్**



**మెట్ పల్లి, ఏప్రిల్ 22 ( మనం న్యూస్):** కమనీయం రమణీయం శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణం. అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం కోరుట్ల నియోజకవర్గంలోని. మెట్ పల్లి డివిజన్ మల్లాపూర్ మండలంలోని. రేగుంట గ్రామంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిపించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కమనీయం రమనీయం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరిని ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని దేవుడిని మొక్కుకున్నానన్నారు. అనంతరం రాఘవపేట గ్రామంలో జరుగుతున్న. మల్లన్న స్వామి జాతరలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట మండలంలోని బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

# వైఎస్ స్ఫూర్తితోనే రేవంత్ సర్కార్ ముందడుగు

- **మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్ల**



**మానకొండూర్, ఏప్రిల్ 22 (మనం న్యూస్):** దివంగత మాజీ ముఖ్యమంత్రి వైస్ రాజశేఖర్ రెడ్డి స్ఫూర్తితోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మానకొండూర్ మండలం గంగిపల్లి , కొండపల్కల గ్రామాల్లో సింగిల్ విండ్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి మహిళలను లక్షాధికారులను చేయాలన్న సంకల్పంతో పని చేయగా, ఆయన స్ఫూర్తితోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ఆశయంతో ముందుకు సాగుతున్నారన్నారు. అందులో భాగంగానే మహిళలను అన్నిరంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రభుత్వం వారిని ప్రోత్సహిస్తోందన్నారు. ఆ క్రమంలోనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు అంతేకాకుండా ప్రభుత్వ పథకాల్లోనూ వారికి సముచిత ప్రాధాన్యం కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కోరారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ ఆర్.తిరుమల్ రెడ్డి, గంగిపల్లి సింగిల్ విండో చైర్మన్ నల్ల గోవింద్ రెడ్డి, డైరెక్టర్లు వాల అంజిత్ రావు, మాడ తిరుపతిరెడ్డి, సుధగోని తిరుపతిగౌడ్, ముల్కల సుధారాణి, పంజాల శ్రీనివాస్, మీస సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ఎం.రామకృష్ణ, దూలం దేవేంద్ర వీరస్వామి, పంజాల సంపత్, రావుల పెద్ద రవి, చిన్న రవి, సాయిరి దేవయ్య, గొల్లెన కొమురయ్య,నాగిశెట్టి రాజయ్య, కొత్తిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నల్లగొండ రాములు, అయిత అనిత, లంబు సరిత తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పరిశీలించిన కలెక్టర్



**రామడుగు ఏప్రిల్ 22 (మనం న్యూస్):** రామడుగు మండలం దేశరాజుపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్దిదారులతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. మంజూరైన ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలనీ అన్నారు. 100 శాతం ఇండ్లు స్లాబ్ లెవెల్ కి చేరేలా లబ్దిదారులతో మాట్లాడాలని అధికారులకు సూచించారు. రెండవ దఫా లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని, అత్యంత పేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

# కార్మిక శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయాలి

- **ఎంసిపిఐయు పార్టీ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్**



**మంచిర్యాల, 22, ఏప్రిల్, ( మనం న్యూస్):** కార్మిక శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయాలని ఎంసిపిఐయు పార్టీ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మంగళవారం కోరారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్ కు కార్మిక శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇచ్చారు.

ఈ సందర్భంగా మాట్లాడు తూ, బెల్లంపల్లిలో దాదాపు 10 వేల పైచిలుకు కార్మికులు ఉన్నారని,కార్మికుల కోసం అడ్డా మీద వాటర్ సౌకర్యాలు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, దాదాపు కొన్ని సంవత్సరాల నుంచి అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కూడా, కూలీల దాహాన్ని మాత్రం తీర్చడం లేదని అన్నారు. రెక్కడితే డొక్కాడని నిరుపేదలు ప్రభుత్వాన్ని మణులు, మాణిక్యాలు,అడగడం లేదనీ దాహం కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తులు చేస్తున్నారని, అడ్డ కూలీల బాధలు మాత్రం ఇక్కడ ఉన్న ప్రజా ప్రతినిధులు గాని, అధికారులు గానీ పట్టించుకోకపోవడం చాలా వింతగా విచిత్రంగా ఉందన్నారు. ఇప్పటికైనా అడ్డా కూలీల కోసం చలివేలింద్రాలు ఏర్పాటు చేయాలని, ఈ విషయంలో జిల్లా అధికారులు స్పందించాలని, వెంటనే బెల్లంపల్లిలో ఉన్న అడ్డా కూలీల ప్రాంతంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల ఎంసిపిఐయు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్బని రాజశేఖర్ పాల్గొన్నారు.

# దశల వారి పోరాటాల బాటపట్టిన బొగ్గు గని కార్మిక సంఘం

- **దశల వారి పోరాటం లో భాగంగా శ్రీరాంపూర్ అన్ని గనుల్లో నిరసనలు**



**మంచిర్యాల, 22, ఏప్రిల్, ( మనం న్యూస్):** బిఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టిబిజికేఎస్) నాయకులు సింగరేణి వ్యాప్తంగా కార్మికుల అపరిష్కృత సమస్యల పరిష్కార కోసం దశల వారి పోరాటాల బాట పట్టారు . అందు లో భాగంగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని మంగవారం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్, పెట్టెం లక్ష్మణ్, అద్వర్యములో ఇతర నాయకులు కలసి శ్రీరాంపూర్ -1,3,ఆర్,కే- 5,6,7,ఆర్ .కే న్యూ టెక్,ఇందారం - 1ఎ అండ్ ఇందారం ఓ.సి , శ్రీరాంపూర్ ఓ.సి ఎరియా వర్క్ షాప్ ,ఏరియా స్టోర్స్ ల వద్ద నిరసనలు తెలిపి అధికారులకు వినతి పత్రాలను ఇచ్చారు . ఈ సందర్భంగా . మాట్లాడుతూ, నూతన భోగ్గు గనుల ఏర్పాటు చేయాలని , సంక్షేమ చర్యలు విస్తృత పరచాలని, సింగరేణి యాజమాన్యం గనుల వేలంలో పాల్గొనవద్దని అన్నారు . అలాగే సులభతరం చేసి కార్మికులకు అనువైన మెడికల్ విధానాన్ని అమలు చేయాలని, కొత్తగూడెం, బెల్లంపల్లి రీజియన్లలో కార్మికుల కుటుంబాలకు రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలని,తదితర కార్మిక సమస్యల పై మెమోరాండం ఇచ్చినట్లు తెలిపారు డి శ్రీరాంపూర్ నెం.1 గనిలో అసిస్టెంట్ మేనేజర్ కు ఇవ్వగా ఇందులో ఈ గని సంఘం నాయకులు మారం శ్రీనివాస్,బత్తుల రాజేశం,మేడం తిరుపతి పాల్గొన్నారు. ఎస్.ఆర్ పి -3 లో మేనేజర్ వెంకట్ రావు వినతి పత్రం ఇవ్వగా ఈ కార్యక్రమంలో టిబిజికేఎస్ జనరల్ సెక్రటరీ కేతిరెడ్డి సురేందర్ రెడ్డి , నాయకులు ఉత్తేజ్ రెడ్డి ,చీఫ్ అడ్వైసర్ సాదుల భాస్కర్, పిట్ సెక్రటరీ తీగల వెంకట్ రెడ్డి , టీ.నరేష్, జంగా తిరుపతి రెడ్డి ,గంగాధర్, సుభాష్ , సోషల్ మీడియా ఇంచార్జ్ పవన్ యువనాయకులు, సల ప్రశాంత్, అనిరుద్, సిరాజ్, టి.రవి, రాజేష్ లోత్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అయే.కే .5 లో పొగాకు రమేష్, ,దుర్గం రవికుమార్ పాపి రెడ్డి , గోవిందరాల రమేష్, తోట వెంకటేష్ తదితరులు, ఆర్.కే . 6 లో పొగాకు రమేష్ ,దుర్గం రవి కుమార్ పాపి రెడ్డి జాడి శ్రీనివాస్ , వెంకటేష్ లు ఆర్ కే న్యూ టెక్ గని మేనేజర్ డిప్యూటీ జి.ఎం. స్వామిరాజు కు తెలంగాణ యూనియన్ మాజీ జనరల్ సెక్రటరీ,పెద్దపల్లి కోటిలింగం ,లాల, బుద్ధి ప్రసాద్, రాజు, జయకృష్ణ, సందీప్ గౌడ్, శంకర్ ఆర్ కే - 7 లో మేనేజర్ తిరుపతి కి వినతి పత్రం ను రాజు నాయక్ పాదం శ్రీనివాస్ తోగల రమేష్ కొవ్వూరి వినోద్ ధనుష్ లు ఇచ్చారు .ఇందారం -1 ఎ అండ్ ఓ.సి మేనేజర్ కు జాయింట్ సెక్రటరీ పానుగంటి సత్తయ్య, అన్వేష్ రెడ్డి , దినేష్ రెడ్డి , అనిల్ తదితరులు పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండి రమేష్ , గడ్డం సుధాకర్ గారు, మాజీ బ్రాంచ్ సెక్రెటరీ గడ్డం మహిపాల్ రెడ్డి , సీనియర్ నాయకులు సారయ్య , జంగ రమేష్, బుర్ర శ్రీనివాస్ మెకానికల్ ఫోర్ మెన్ నిఖిల్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం సేకరించాలి

- **నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలి**
- **ధాన్యం కొనుగోలు పై సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 22(మనం ప్రతినిధి):** యాసంగి పంట కొనుగోలు లో రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన వరి ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.

మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో జరగాలని అన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని అన్నారు. మన జిల్లాలో ఇప్పటి వరకు 241 కొనుగోలు కేంద్రాలకు గాను 239 కేంద్రాల ప్రారంభం చేసి 198 కొనుగోలు కేంద్రాల నుంచి 16 వేల 22 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు జమ అయ్యేలా చూడాలని అన్నారు.

సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసిల్దార్ లు సిరిసిల్లలో అపెరల్ పార్క్ లో ఇతర చోట్ల అవసరమైన ఇంటర్మీడియట్ గోదాములను గుర్తించి ధాన్యం తరలింపు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

కొనుగోలు కేంద్రాలకు ట్యాగ్ చేసిన రైస్ మిల్లర్లకు సామర్థ్యం ప్రకారం ధాన్యం అలాట్మెంట్ చేయాలని అన్నారు.మిల్లు అలాట్మెంట్ కాని కోనుగోలు కేంద్రాలకు సమీపంలో గల అపెరల్ పార్క్ లో ఇంటర్మీడియట్ గోదాము నందు ధాన్యం భద్రత కోసం బుక్ చేయాలని అన్నారు. రైస్ మిల్లుల సమస్య కారణంగా ఎక్కడా ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడానికి వీలు లేదని, కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని కలెక్టర్ సూచించారు.కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలని, ప్యాడీ క్లీనర్, టార్ఫాలిన్ కవర్లు, వెయింగ్ యంత్రాలు తేమ యంత్రాలు మొదలగు సామాగ్రి అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు.

సిరిసిల్ల జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని అన్నారు.ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద 2 లారీలను అందుబాటులో పెట్టాలని, ధాన్యం రవాణా ఎటువంటి ఇబ్బందులు ఉండవద్దని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో డిఆర్డిఓ శేషాద్రి, డిఏఓ అఫ్జలి బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారులు రజిత, వసంత లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక

- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**




**రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 22 (మనం ప్రతినిధి) :** పేదల సొంతింటి కల నిజం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడత లబ్ధిదారుల ఎంపికను అధికారులు పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర సీఎస్ శాంతి కుమారి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌతమ్ లతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి పై కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. చందుర్తి మండలం నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదవాడు సొంత ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రజా ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలను ఉచితంగా సబ్సిడీ కింద అందిస్తుందని, దేశంలో మరే రాష్ట్రంలో ఇంత పెద్దన సాయం అందడం లేదని, మిగిలిన రాష్ట్రాల్లో లక్షన్నర నుంచి 3 లక్షల వరకు ప్రభుత్వాలు సహాయం చేస్తుంటే మన తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలను అందిస్తుందని మంత్రి తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి విడత లో 3 వేల 500 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతి పర్యవేక్షించేందుకు నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని అన్నారు.మనకు వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు, జనాభా ఆధారంగా గ్రామాలకు, మున్సిపల్ వార్డులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పూర్తి చేయాలని అన్నారు.గ్రామాలు, మున్సిపల్ వార్డులో ఉన్న ఇందిరమ్మ కమిటీల ద్వారా ఇందిరమ్మ ఇండ్లకు అర్హుల జాబితా ఎంపిక చేయాలని, ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇండ్లకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి ఏప్రిల్ 30 లోపు మరో సారి ఫీల్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి నాణ్యతతో పారదర్శకంగా జరగాలని, ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే మంజూరు చేసే జాబితా నుంచి తొలగించాలని అన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చూడాలని, బలహీన వర్గాల ఇంటి నిర్మాణానికి ఉచితంగా సరఫరా చేయాలని ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నందున, ప్రతి మండల కేంద్రంలో ఇసుక అందుబాటులో పెట్టాలని మంత్రి తెలిపారు.ప్రతి మండలంలో జరిగే ఇందిరమ్మ ఇండ్ల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలియజేస్తూ సదరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల సహాయం త్వరగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలలో స్లం ఏరియాలో జి+3 మోడల్ లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించేందుకు వీలుగా లబ్ధిదారులు ముందుకు వస్తే రాబోయే విడత లలో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు.ప్రతి జిల్లాకు అవసరమైన సర్వే సామాగ్రి అందించడం జరుగుతుందని అన్నారు.భూ భారతి చట్టాన్ని క్షేత్రస్థాయిలో తూచ తప్పకుండా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లు, జిల్లా స్థాయి ఉన్నతాధికారుల పై అధికంగా ఉంటుందని అన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రజలకు భారం కాకుండా 25% రాయితీని అందించామని, దీనినే ముఖ్యమంత్రి ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించామని అన్నారు. మరోసారి ఎల్.ఆర్.ఎస్ 25% రాయితీ గడువు పొడిగింపు మరొక్కసారి ఉండదని ఈ అంశాన్ని ప్రజలకు విస్తృతంగా తీసుకుని వెళ్లి, ఆమోదం పొందిన దరఖాస్తుల ఫీజులు వసూలు చేసి క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

# పేకాట రాయుళ్ల పై పోలీస్ పంజా



- **తొమ్మిది మంది అరెస్టు**
- **రెండు కార్లు, రెండు బైక్స్ స్వాధీనం**
- **వివరాలు వెల్లడించిన హుస్నాబాద్ ఎస్.ఐ.తోట మహేష్**

**హుస్నాబాద్,ఏప్రిల్ 22,(మనం న్యూస్):** పేకాట రాయుళ్ల స్థావరం పై హుస్నాబాద్ పోలీసులు పంజా విసిరారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మంది నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హుస్నాబాద్ ఎస్.ఐ.తోట మహేష్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణ కేంద్రంలోని హీరో హోండా షోరూం వద్ద ఉన్న చందా శ్రీనివాస్ ఇంటిలో అక్రమంగా పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో రైడ్ చేయడం జరిగిందన్నారు. ఈ రైడ్‌లో పేకాట ఆడుతున్న బత్తిని అరుణ్‌కుమార్, ఎం.డీ.సయ్యద్, కొండూరు చంద్రశేఖర్, చుంచు రాకేష్, తమ్మనవేని అంజయ్య, బొంగోని రమేష్, ఏనుగు మహిపాల్ రెడ్డి, ఎదులపురం చందు, పడాల శ్రీకాంత్ తొమ్మిది మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. ఇంటి యజమాని చందా శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు చెప్పారు.

నిందితుల నుంచి రూ.37 వేల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు, తొమ్మిది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్.ఐ.తోట మహేష్ మాట్లాడుతూ ఏవరైనా పేకాట ఆడితే వెంటనే డయల్ 100 లేదా పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు.

# ఇంటర్ ఫలితాల్లో నంగునూరు విద్యార్థికి రెండో ర్యాంకు

- **ఎంపీసీలో 467 మార్కులు సాధించిన స్పందన**



**నంగునూరు, ఏప్రిల్ 22, (మనం న్యూస్):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రానికి చెందిన సందెబోయిన స్పందన అనే విద్యార్థి ఇంటర్ మొదటి సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకును సాధించింది. మండల కేంద్రానికి చెందిన సందెబోయిన లక్ష్మి, సురేశ్ దంపతుల కూతురైన స్పందన ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గాను 467 మార్కులు పొంది రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకును సాధించింది. రెండవ తరగతి వరకు నంగునూరులోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్లో, మూడు నుంచి ఎనిమిదవ తరగతి వరకు సిద్దిపేటలోని బ్రిలియంట్ స్కూల్లో చదివింది. తొమ్మిది నుంచి పదవ తరగతి వరకు సిద్దిపేటలోని వికాస్ హైస్కూల్లో చదివింది. పదో తరగతిలో 9.7జీపీఏ సాధించింది. హైదరాబాదులోని అభ్యాస జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ గ్రూపు చదువుతోంది. మార్చిలో జరిగిన మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలను ఇంటర్మీడియట్ బోర్డు మంగళవారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో స్పందన 467 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. స్పందన తల్లిదండ్రులు నంగునూరు చుట్టుపక్కల గ్రామాలలో కూరగాయల అమ్ముతూ తమ పిల్లల్ని చదివిస్తున్నారు. వీరి కుమారుడు సందెబోయిన వికాస్ రాజస్థాన్ రాష్ట్రంలోని శ్రీ పద్మపత్ సింఘానియా విశ్వవిద్యాలయం ఉదయపూర్ లో బీటెక్ చదువుతున్నాడు. బీటెక్ లో కంప్యూటర్ సైన్స్(ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్) చదువుతున్నాడు. రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించిన స్పందనను గ్రామస్తులు అభినందించారు.

# ధాన్యం కుప్పలను ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



**కొండపాక, ఏప్రిల్ 22, (మనం న్యూస్):** కొండపాక మండలం మర్పడగ శివారులో రైస్ మిల్ వద్ద ధాన్యం కుప్పలను ఢీకొని ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని సిరసనగండ్ల గ్రామానికి చెందిన బాబు అనే వ్యక్తి మోటార్ సైకిల్ పై సిద్దిపేట నుంచి గ్రామానికి వెళుతున్న క్రమంలో అదుపుతప్పి రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలపైకి దూసుకెళ్లి కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది శ్రీకాంత్, రమేష్ చేరుకొని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థుల వికాసం



**నంగునూరు, ఏప్రిల్ 22, (మనం న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శారీరక మానసిక వికాసం జరుగుతుందని గట్ల మల్యాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్ అన్నారు. నంగునూరు మండలం ఖాతా, కొండంరాజు పల్లి, గట్లమల్యాల గ్రామాలలో మంగళవారం ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు, స్కూల్ యూనిఫామ్ ఉచితంగా అందజేస్తారని తెలిపారు. మధ్యాహ్న భోజనం అందివ్వడంతో పాటు ఎలాంటి ఫీజులు వసూలు చేయరని చెప్పారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు డిజిటల్ ద్వారా విద్యను బోధిస్తారని తెలిపారు. కొండం రాజు పల్లి, ఖాతా, గట్ల మల్యాల ప్రాథమిక పాఠశాలల్లో 5 వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులచే గట్ల మల్యాల ఉన్నత పాఠశాలను సందర్శింపజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో డిజిటల్ తరగతులను వీక్షించారు. విద్యార్థులకు ప్రయోగశాల, గ్రంథాలయం, స్పోర్ట్స్ గదిని చూపించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరారెడ్డి, ఉపాధ్యాయులు రామస్వామి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# మూగజీవాలను కాపాడుదాం

- **ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్ పిలుపు**




**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 22, (మనం న్యూస్) :** వేసవికాలం దృష్ట్యా ఎండ తాపానికి పశు పక్ష్యాదులు, పక్షులు ఇబ్బందులు పడకుండా వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్ పిలుపునిచ్చింది. ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సకోర అభ్యాన్ పేరుతో మూగజీవాలు, పక్షుల దాహం తీర్చేందుకు చెట్లకు మంచినీటితో కూడిన మట్టి పాత్రలను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా నగర స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్ కన్వీనర్ ఝాన్సీ మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ కేవలం విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం పోరాడే సామాన్య విద్యార్థి సంఘం మాత్రమే కాదని, ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, అందులో భాగంగానే ఏబీవీపీ పర్యావరణ పరిరక్షణకై స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్ పేరుతో కొమరంభీం ఆశయాలు కొనసాగిస్తు జల్, జంగల్, జమీన్, జాన్వర్, జన్ కోసం పనిచేస్తున్న ఏకైక స్టూడెంట్ ఆర్గనైజేషన్, ఎన్విరాన్మెంటల్ ఆర్గనైజేషన్ అన్నారు.

ఈ వేసవి సమయంలో పక్షులకు, మూగజీవులకు నీరు, ధాన్యం గింజలు అందిస్తూ ప్రకృతిలోని మూగ జీవాలను, పక్షులను రక్షించే బాధ్యత మానవులమైన మనందరిపై ఉందని గుర్తు చేసేందుకే సకోర అభ్యాన్ పేరుతో విద్యార్థులతో కలిసి పక్షులకు నీరు అందించే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ వైష్ణవి, జిల్లా కన్వీనర్ ప్రణయ్ కుమార్, ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఆదిత్య, సిద్దిపేట, మెదక్ జిల్లాల సంఘటన మంత్రి లక్ష్మీపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఫణిందర్, నగర కార్యదర్శి పరశురాం, జోనల్ ఇన్చార్జులు హరికృష్ణ, అనీష్ మరియు ముని, మహిపాల్, కార్తీక్ విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగరేణిలో మెరిట్ స్కాలర్ షిప్ పెంపు

**మంచిర్యాల, 22, ఏప్రిల్, ( మనం న్యూస్):** ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్, ఎయిమ్స్ తదితర కోర్సుల ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన సింగరేణి కార్మికుల, అధికారుల పిల్లలకు ఇప్పటివరకు ఇస్తున్న వార్షిక స్కాలర్ షిప్ మొత్తాన్ని 10 వేల నుంఛి 16 వేల రూపాయలకు పెంచుతూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే కనీస ర్యాంక్ 2 వేల లోపు నుండి 8 వేల లోపు వరకు పెంచినట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలియజేసింది. కార్మికుల పిల్లలను ఉన్నత చదువుల పట్ల ఆసక్తి పెంచడానికి, ప్రోత్సహించడానికి 1998లో ఈ స్కాలర్ షిప్ పథకాన్ని ప్రవేశ పెట్టారు. 2 వేల లోపు ర్యాంకు సాధించిన ఉద్యోగుల పిల్లలకు మాత్రమే దీనిని వర్తింపజేశారు. అన్ని ఏరియాల నుంఛి అర్హులై ఉండి దరఖాస్తులు స్వీకరించి, సదరు విద్యార్థి చదివే కోర్సు పూర్తయ్యేంతవరకు ఏడాదికి 6 వేల రూపాయల చొప్పున స్కాలర్ షిప్ ను కంపెనీ ప్రతి ఏడాది అందిస్తున్నది . స్కారల్ షిప్ మొత్తాన్ని పెంచాలని ఇటీవల వచ్చిన విజ్ఞప్తి మేరకు 2010 లో దీన్ని 10 వేల కు పెంచారు. కాగా ఇటీవల గుర్తింపు కార్మిక సంఘంతో జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో స్కాలర్షిప్ గా చెల్లించే మొత్తాన్ని 10 నుంఛి 16 వేలకు పెంచాలని, స్కాలర్షిప్ వర్తింపును కూడా 2 వేల ర్యాంకు లోపు నుంఛి 8 వేల ర్యాంకు లోపు వరకు పెంచాలని గుర్తింపు సంఘం నాయకులు యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. దీనికి సంస్థ సీఎండీ ఎన్.బలరాం సానుకూలంగా స్పందించారు, ఆయన ఆదేశం మేరకు సవరించిన స్కాలర్ షిప్ నకు సంబంధించిన సర్క్యులర్ ను డైరెక్టర్ (పా ) జారీ చేశారు. ఈ ఉత్తర్వులు



2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశ పరీక్షలకు హాజరైన విద్యార్థిని, విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందని, ఈ మేరకు అన్ని ఏరియాల నుంఛి జూన్ ,15 లోపు దరఖాస్తులను పంపించాలని డైరెక్టర్ పా తెలిపారు . ఎంసెట్ ప్రవేశ పరీక్షల్లో 8 వేల ర్యాంకు వరకు సాధించిన వారికి వారి కోర్సు పూర్తయ్యేంత వరకు ఏడాదికి 16 వేల చొప్పున స్కాలర్ షిప్ ను సంస్థ చెల్లిస్తుందని, అలాగే జేఈఈ మెయిన్స్ (ఎన్.ఐ.టి), ఎయిమ్స్, బిట్ సాట్ (బిట్స్-పిలాని) లో ప్రవేశం పొందిన వారికి అత్యుత్తమ ర్యాంకు ఆధారంగా స్కాలర్ షిప్ ను వర్తింపజేయనున్నామని తెలిపారు. ఈ సదవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు .

# పాఠశాలల బస్సులు నిబంధనలు పాటించాలి




- **ప్రవేట్ స్కూల్ బస్సు తనిఖీ చేసిన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్**

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 22, (మనం న్యూస్) :** ప్రైవేటు పాఠశాలల బస్సులు నిబంధనలకు లోబడి నడిపించుకోవాలని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం నాడు ఆయన పట్టణంలోని శ్రీ చైతన్య ప్రైవేటు స్కూల్ బస్సును తనిఖీ చేసి మాట్లాడారు. డ్రైవర్లు తప్పకుండా డ్రైవర్ యూనిఫామ్ ధరించాలని, బండి ఫిట్నెస్ ఉందా లేదా ప్రతిరోజు తనిఖీ చేసుకోవాలని సూచించారు. పిల్లలను ఎక్కించుకొని వెళ్లేటప్పుడు , ఇండ్ల వద్ద దించేటప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహనానికి సంబంధించిన ప్రతి ఒక్క పేపర్ వాహనంలోనే ఉంచుకోవాలని తెలిపారు. స్కూల్ పిల్లలు కాబట్టి వాహనాన్ని నెమ్మదిగా జాగ్రత్తగా నడిపించి పిల్లలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని తెలిపారు. రాంగ్ రూట్ లో డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. వేసవికాలం అయినందున ఫైర్ ప్రాబ్లం రాకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డ్రైవర్లకు సూచించారు.

# రామారెడ్డి, బికనూర్‌లో భూ భారతి అవగాహన సదస్సు

- **పాల్గొన్న కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి, ఏప్రిల్ 22 ( మనం ప్రతినిధి ) :** భూ భారతి చట్టం పై జిల్లాలోని ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులను జిల్లాలో ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగా మంగళవారంరామారెడ్డి, బిక్నూర్ రైతువేదికల్లో నిర్వహించిన అవగాహన సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి చట్టం 14 ఏప్రిల్ 2025 న ప్రారంభించడం జరిగిందని . చట్టం పై ప్రజలకు, రైతులకు అవగాహన సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ధరణీ స్తానంలో భూ భారతి భూమి హక్కుల చట్టం తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణ చేసుకోవచ్చని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని, 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదా బైనామ ద్వారా కొనుగోలు చేసి, గడచిన 12 ఏండ్లుగా అనుభవంలో ఉంటూ 12.10.2020 నుండి 10.11.2020 మధ్య కాలంలో క్రమబద్ధీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీఓ లు విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్ , స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. అట్టి వాటిని రికార్డు లలో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇస్తారని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు. పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్త ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై లేదా జారీచేసిన పాసుపుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకోవచ్చని, ఆర్డీఓ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్ తరహాలో రైతులకు భూదార్ కార్డుల జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి చట్టంలో ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలు ఇంతే నివృత్త చేసుకోవచ్చని తెలిపారు. గతంలో ధరణీలో అప్పీలు కు ఆస్కారం లేనందున సివిల్ కోర్టుకు వెళ్ళవలసి ఉండేదని, ప్రస్తుతం తహసీల్దార్ ఇచ్చిన తీర్పులో అభ్యంతరం ఉంటే ఆర్డీఓ కు, ఆర్డీఓ తీర్పులో అభ్యంతరం ఉంటే కలెక్టర్ కు అప్పీలు. చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వీణ మాట్లాడుతూ, భూ భారతి చట్టం గురించి వివరించారు. గత ధరణీ లో 33 మాడ్యూల్స్ ఉండేదని, ఈ భూ భారతి చట్టంలో కేవలం 6 మాడ్యూల్స్ తో భూముల యాజమానుల సమస్యలు తీర్చడానికి వీలు కలుగుతుందని తెలిపారు. భూముల విస్తీర్ణం, మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు. వార సత్వంగా వస్తున్న యజమానులకు పేరు మార్పులు చేయవచ్చని తెలిపారు. గతంలో ధరణీ లో అప్పీలు ప్రోవిజన్ లేదని, కేవలం సివిల్ కోర్టుకు వెళ్ళవలసి ఉండేదని తెలిపారు. భూభారతి చట్టంలో తహసీల్దార్ నిర్ణయించిన వాటిపై అభ్యంతరం ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకునే ఆస్కారం ఉందని, ఆర్డీఓ ఇచ్చిన ఆదేశాలకు అభ్యంతరం ఉంటే కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, ఒక వేళ కలెక్టర్ ఇచ్చిన తీర్పు అభ్యంతరాలు ఉంటే భూమి ట్రిబ్యునల్ కు వెళ్లవచ్చని తెలిపారు. జిల్లా గ్రంధాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి బిక్నూర్ సదస్సులో మాట్లాడుతూ, రైతుల సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకురావడం జరిగిందని, ఈ చట్టం ద్వారా రైతుల సమస్యలు తీర్చాలని కలెక్టర్ ను కోరారు. ఈ సదస్సులోఆయా మండల తహసీల్దార్లు,ఎంపీడీఓ లు, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు, పలువురు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# బావిలో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

- **స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీసిన ఎస్ఐ**

**కొమురవెల్లి, ఏప్రిల్ 22, (మనం న్యూస్):** బావిలో ఈతకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన






గొల్లపల్లి కనకయ్య (50) అనే వ్యక్తి ఈత కొట్టడానికి వెళ్లి నీటిలో మునిగిపోయాడు. అక్కడే ఉన్న పిల్లలు గమనించి చుట్టుపక్కల వారికి తెలుపగా అక్కడికి చేరుకున్న కొంతమంది పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి వచ్చిన ఎస్ఐ రాజు గౌడ్ స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికి బయటకు తీశారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు, కాగా మద్యం సేవించిన గొల్లపల్లి కనకయ్య బావిలో ఈత కొట్టేందుకు దూకినట్లు అక్కడ గమనించిన కొంతమంది యువకులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు గౌడ్ తెలిపారు.

# కార్పొరేట్, మతతత్వ ఎజెండా దేశానికే ప్రమాదం

- ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్న పాలకులు
- లెనిన్ 155వ జయంతిలో సిపిఎం నేతలు



ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్)ః కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్, మతతత్వ ఎజెండా దేశానికే ప్రమాదకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు విమర్శించారు. మంగళవారం అమరజీవి వి.ఐ. లెనిన్ 155వ జయంతి సందర్భంగా ఖమ్మం సుందరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్ అధ్యక్షతన జరిగిన లెనిన్ జయంతి సభలో సుదర్శన్ మాట్లాడుతూ ప్రపంచంలో ఒక మనిషిని, వేరొక మనిషి, ఒక జాతిని మరొక జాతి, ఒక దేశాన్ని మరో దేశం దోపిడీ చేయనటువంటి ఒక వ్యవస్థను రూపొందించిన మహనీయుడు లెనిన్ అన్నారు. మార్క్స్, ఏంగెల్స్ రూపొందించినటువంటి ప్రణాళికను ఆర్థిక తత్వశాస్త్రాన్ని ఆచరణలో అమలుపరచిన గొప్ప విప్లవకారుడు లెనిన్ అని అన్నారు. అప్పటి వరకు లేనటువంటి ఒక వ్యవస్థను రూపుదిద్దటమే కాకుండా ఆ వ్యవస్థ ఇతర దేశాలలో కూడా రూపుదిద్దుకొనేందుకు పాటుపడిన వ్యక్తి అని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని ప్రపంచ ఆధిపత్యం కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న సామ్రాజ్యవాద దురహంకార విధానాలకు మద్దతు ఇస్తూ భారత ప్రధాని మోడీ వ్యవహరించటం సిగ్గుచేటన్నారు. అమెరికాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థుల జీవితాలతో దురహంకార ట్రంప్ చెలగాటమాడుతుంటే ఇక్కడ మోడీ జె.డి వ్యాన్స్ పిల్లలతో ఆటలాడుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నాడని అన్నారు. అలాగే మధ్య భాగంలో ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసి జాతి ప్రజలపై మారణకాండ కొనసాగిస్తున్నాడని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా దళిత ఆదివాసీ బహుజనులపై హిందూ మతోన్మాద దాడులు పెరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం మనువాద విధానాలు అనుసరిస్తూ రాజ్యాంగంలో పేర్కొన్న హక్కులను హరించి వేస్తున్నదని విమర్శించారు. ఈ సమయంలో విప్లవ పార్టీల ఐక్యత ఆవశ్యకత ఏర్పడిందన్నారు. రష్యా సోషలిస్టు నిర్మాత లెనిన్ చేసిన పోరాటాలను విజయాలను అధ్యయనం చేయాలని మనదేశంలో కూడా నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కోసం జరిగే పోరాటాలలో పాల్గొనాలని, కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా, వివిధ వర్గాల ప్రజలు చేస్తున్న పోరాటాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటి సభ్యులు నందిపాటి మనోహర్, పారుపల్లి ఝాన్సీ, బండారు రమేష్, దొంగల తిరుపతిరావు, ఎస్.కె.బషీరుద్దీన్, ఎస్.కె.వి.ఎ.మీరాసాహెబ్, సిపిఎం సీనియర్ నాయకులు ఎం.సుబ్బారావు, కె.దేవేంద్ర, జిల్లా నాయకులు ఆర్.ప్రకాష్, బోడపట్ల రవీందర్, నెల్లూరి వీరబాబు, ఎల్.వెంకటేశ్వరరావు, నన్నక గోవిందరావు, నామా లక్ష్మినారాయణ, ప్రవీణ్, సుధాకర్, సిహెచ్. భద్రం, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా వేజెండ్ల సాయికుమార్ విజయం



మధిర, ఏప్రిల్ 22(మనం న్యూస్) ః యువజన కాంగ్రెస్ ఫలితాలలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా భారీ మెజార్టీతో విజయం సాధించిన మధిర నియోజకవర్గం కు చెందిన వేజెండ్ల సాయికుమార్ కు మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్ , పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మిరియాల వెంకటరమణ గుప్తా శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ విజయంతో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేస్తూ ఉపముఖ్యమంత్రి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క , నందిని విక్రమార్క పేరు నిలబెడుతూ మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మధిర మండలం పట్టణం నుంచి అనేకమంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు ఓట్లు వేసినారు. అలాగే గ్రామ శాఖ అధ్యక్షులు అనుబంధ శాఖ అధ్యక్షులు ముఖ్య నాయకులు అందరూ ఈ విజయంలో పాలుపంచుకున్న సందర్భంగా వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసినారు.

## ఇంటర్ ఫలితాలలో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ



గార్ల, ఏప్రిల్ 22(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలలో గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపిసి విభాగంలో టి.శ్రీజ 956/1000, సిఇసిలో వి. సాయి 898/1000 సాధించగా ప్రథమ సంవత్సరం నందు బి వినీల బి.పిసి గ్రూపులో 425/440, ఎం.మన్విత 374/440,బి.చిన్నారి ఎంపిసిలో 376/470, టి.రాజేశ్వరి బాయ్ 356/470 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఐ.వి రాజకుమారి పేర్కొన్నారు.ద్వితీయ సంవత్సరం నందు 91 మంది విద్యార్థులకు గాను 40 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 44% శాతం నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించాడానికి కృషి చేసిన అధ్యాపకులను కళాశాల పేరును నిలబెట్టిన విద్యార్థిని, విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

# కామాంధ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన ఐటిడిఏ పివో
- 'మనం' కథనానికి స్పందన



ఉపాధ్యాయుడి రాస లీలలు
దేహశుద్ధి చేసిన గ్రామస్తులు
చర్ల, ఏప్రిల్ 18 (మనం న్యూస్) : చర్ల మండలంలోని మారుమూల అటవీప్రాంత గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రమేష్ బాబు వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకుని రాసలీలలు నిర్వహిస్తూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడటంతో గ్రామస్తులు దేహశుద్ధి చేసారు. గత ఏడాది అక్టోబర్ లో డిప్యూటేషన్ పై గ్రామంలోని పాఠశాలకు డిప్యూటేషన్ పై వచ్చిన రమేష్ బాబు ఒక విద్యార్థి తల్లితో అసభ్యంగా ప్రవర్తించ సాగాడు. కొన్నాళ్లకు ఆమెను లొంగదీసుకొని అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. దీనిని గమనించిన గ్రామస్తులు వలపన్ని గురువారం సదరు ఉపాధ్యాయుడిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఆగ్రహించిన గ్రామ యువకులు ఉపాధ్యాయుడిని చితక బాదారు. అనంతరం పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి కుల తప్పు విధించారు. సదరు ఉపాధ్యాయుడు వాజేడు మండలంలో విధులు నిర్వహించిన సందర్భంలోనూ తన కామవాంఛను ప్రదర్శించడంతో అక్కడి జనం దేహశుద్ధి చేసి పంపారు. అనంతరం చర్ల మండలానికి బదిలీపై వచ్చి ఇక్కడ కూడా అదే తీరును ప్రదర్శించి అబాసుపాలయ్యాడు. ఐటిడిఏ అధికారులు ఈ విషయమై విచారించి ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.
మనం https://www.manamepaper.com/clip/69887 Khammam (19-4-2025)



చర్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు తన విధులను మరచి విద్యార్థుల తల్లికి ప్రేమ పాఠశాలు చెబుతున్న విషయమై 'మనం' లో వార్త ప్రచురితం కావడంతో చర్ల మండలం పులిగుండాల గిరిజన ప్రాథమిక పాఠశాల ఎస్ జి టి ఉపాధ్యాయుడు డి రమేష్ బాబు సస్పెన్షన్ కు గురయ్యాడు. ఈ నెల 17 వ తేదీన పులిగుండాల గ్రామంలో ఒక విద్యార్థి తల్లితో రాసలీలలు సాగిస్తుండగా గ్రామస్తులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని చితక బాదారు. ఈ విషయాన్ని 'మనం' దినపత్రికలో ' ఉపాధ్యాయుడి రాసలీలలు - దేహశుద్ధి చేసిన గ్రామస్తులు ' శీర్షికన వార్త కథనం ప్రచురించిన విషయం విదితమే. మనం పత్రికా కథనానికి స్పందించిన భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ సమగ్ర విచారణ నిర్వహించిన అనంతరం మంగళవారం రమేష్ బాబును సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసారు.

## ఇంటర్ ఫలితాలలో 'కృష్ణవేణి' విద్యార్థులు ప్రభంజనం



ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్)ః ఇంటర్ ఫలితాలలో కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో వెయ్యి మార్కులకు గాను కె.హాసిని 994, ఏ.ప్రియాంబిక 993, ఎస్.సాయిసంజన 993, వై.స్ఫూర్తి 993, టి.చందన 991, ఎస్.సంతోష్‌రెడ్డి 991 మార్కులు సాధించారు. బైపిసి విభాగంలో వెయ్యి మార్లుకు గాను జ్యోత్స 994, కె.నవ్యశ్రీ 988 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను ఆర్.భువన కృతి 468, బి.పవిత్ర 468, ఇ.హర్షిత్-467, ఎం.వెంకటేశ్వర్లు 467, ఎం.సాయిసాత్విక 467, వి.రాజిలక్ష్మీ 467, వివిఎస్ఎస్ లక్ష్మీ 467, కె.భరత్ కుమార్ 467, డి.భానురమ్య 467, ఎన్.చందన 467, వి.గణేష్ 467, సిహెచ్ సౌమ్యశ్రీ 467, పి.హర్షవర్ధన్ 467 మార్కులు సాధించారు. బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను జి.ప్రహర్ష 437, ఎన్.కరుణశ్రీ 437, సిహెచ్ ఇందిర 436, కె.అఖిల్‌సాయి 436, ఎం.డి అయేషా 436 మార్కులు సాధించారు. ఎంఇసి విభాగంలో 500 మార్కులకు గాను టి.సహస్రలీల 491 మార్కులు సాధించింది. సిఇసి విభాగంలో 500 మార్కులకు గాను ఎం.వర్ష 483 మార్కులు సాధించి కళాశాల ప్రతిష్టను ఇనుమడించారు.

### సమిష్టి కృషితోనే రాష్ట్ర స్థాయి మార్కులు

కార్పొరేట్ స్థాయి ధీటుగా ఇంటర్ పరీక్షా ఫలితాలలో రాష్ట్ర స్థాయి అత్యధిక మార్కులు రావడానికి కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు సమిష్టి కృషితోనే సాధించగలిగామని కృష్ణవేణి కళాశాల డైరెక్టర్ గొల్లపూడి జగదీస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు మార్చవరపు కోస్తేశ్వర రావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ గుర్రం రామచంద్రయ్య, అకడమిక్ డీన్ ఎల్లూరి వంశీ కృష్ణ, ఏఓ నిరంజన్ కుమార్ పాల్గొన్నారు.

## ఇంటర్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన హెడ్ కానిస్టేబుల్ కుమారుడు



- అభినందించిన ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 22 (మనంప్రతినిధి): ఇంటర్మీడియట్ ఫలితాలలో పాల్వంచ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న లిక్కి కోటేశ్వరరావు కుమారుడు లిక్కి విశ్రుత్ 994 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ రోహిత్ రాజు లిక్కి విశ్రుత్ ను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా ఉన్నత చదువులు అభ్యసించి మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ , పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి జిల్లాలో ఇంటర్ సెకండియర్ 72.43 శాతం ఉత్తీర్ణత

- ఫస్టియర్ 62.44 శాతం ఉత్తీర్ణత

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 22 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గత మార్చిలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షలలో ఫస్టియర్ జనరల్, ఒకేషనల్ కలిపి 62.44 శాతం, సెకండియర్ 72.43 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బాలురు 2, 996 మంది పరీక్షలకు హాజరు కాగా 1,855 మంది ఉత్తీర్ణత, బాలికలు 4,083 మంది పరీక్షలకు హాజరు కాగా 3,190 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 8,866 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 6,422 మంది, ఒకేషనల్ బాలురు 763 మంది హాజరు కాగా 495 మంది ఉత్తీర్ణత, 1787బాలికలు హాజరు కాగా 1,377 మంది 72.43 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ జనరల్ మొదటి సంవత్సరం 3028, మంది బాలురు హాజరు కాగా 1,570 మంది బాలికలు 7, 215 మంది హాజరు కాగా 4,514 మంది ఒకేషనల్ విభాగంలో 860 మంది బాలురు హాజరు కాగా 402 మంది, 2,039 బాలికలు 1,265 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం జనరల్ ఇంటర్, ఒకేషనల్ మొత్తం మీద 9,254 హాజరు కాగా 5,779 మంది 62.44 శాతం ఉత్తీర్ణత సాధించారు.

## ఇంటర్ పరీక్షా ఫలితాల్లో, 'హార్వేస్ట్' విద్యార్థుల విజయ దుందుభి



ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్)ః తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థులు అగ్రశ్రేణి ఫలితాలు సాధించినట్లు 'హార్వెస్ట్' జూనియర్ కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. 2024-25 విద్యాసంవత్సరానికిగానూ తమ కళాశాల నుండి ప్రథమ సంవత్సర విద్యార్థులు 133 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 102 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపింది. ఇంటర్ ప్రథమ ఫలితాల్లో ఎం.పి.సి గ్రూపు నుండి ఎ.శ్రీకళ 467, ఎ.యామిని 466, జి. ప్రణతి 466, ఎం. సిరి శాన్వి 466, కె.రుచిత 166, కౌసల్య 465, 2 పూజిత 465. జి. నమిత్ 164. అభిరామ చరణ్ 464 మార్కులు సాధించినట్లు తెలిపింది. ఎం.పి.సి గ్రూపులో గణితంలో ఎలో - 19 నుంది. గణితం 1బిలో 38 మంది. భౌతిక శాస్త్రంలో 40 మంది, రసాయన శాస్త్రంలో 16 మంది వందశాతం మార్కులు సాధించినట్లు పేర్కొంది. ద్వితీయ సంవత్సర విదార్థులు ఎం.పి.సి గ్రూపు నుండి సి.హెచ్. నిఖిత్, సి.హెచ్. నివేదిత. పి.హారిణి 990 మార్పులు సాధించి అగ్రస్థానంలో శిలిచారన్నారు. పి.వెంకటకౌషిక్ 986, సి. హెచ్. జీవన తేజశ్రీ 984, కె.భువన్ 984, ఎస్. జాన్నని రెడ్డి 981, ఏ.స్రవిష్ట నౌదరి 980 మార్కులతో ఎం.పి.సి గ్రూపు నుండి అత్యున్నత మార్కులు సాధించారని తెలిపింది. ద్వితీయ సంవత్సరంలో గణితం 2ఎ లో-30 మంది, గణితం 20 బిలో- 10 మంది వంద శాతం మార్కులు, భౌతిక శాస్త్రంలో 25 మంది, రసాయన శాస్త్రంలో 12 మంది వందశాతం మార్కులు సాధించినట్లు తెలిపింది. ఈ మేరకు మంగళవారం కళాశాల ఆవరణలో హార్వెస్ట్ గ్రూఫ్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్ పార్వతీరెడ్డి విద్యార్థులను అభినందించారు. భవిష్యత్లో మరిన్నీ విజయాలు సాధించాలని అభిలాషించారు.

## శ్రీ చైతన్య విద్యా సంస్థలో సంబరాలు



కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 22 (మనం న్యూస్)ఃజెఇఇ మెయిన్స్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో ఫస్ట్ ర్యాంకు సాధించిన నేపథ్యంలో మంగళవారం పాఠశాలలో సంబరాలు జరుపుకున్నారు.
ఈ సందర్భంగా స్థానిక బోయవాడలోని శ్రీ చైతన్య పాఠశాలలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ హైదరాబాద్ శ్రీ చైతన్య విద్యాసంస్థకు చెందిన విద్యార్థి వంగల అజయ్ రెడ్డి 300/300 సాధించి ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించడం ఎంతో గర్వకారణమన్నారు.
తమ విద్యాసంస్థలో అత్యుత్తమ బోధన, విద్యార్థుల నైపుణ్యానికి ఇది నిదర్శనంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల కరీంనగర్ జోన్ కో-ఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ విజయకృష్ణ, ప్రీ ప్రైమరీ, ప్రైమరీ ఇంచార్జ్ పూర్ణిమ, గురుప్రీత్ కౌర్, జోనల్ పిఇటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో ప్రైవేట్ కళాశాలకు ధీటుగా సత్తా చాటిన గురుకుల కళాశాల విద్యార్థులు



మధిర, ఏప్రిల్ 22(మనం న్యూస్): మంగళవారం నిలబడిన తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ ఫలితాలలో తమ సత్తా ఏంటో మరోసారి నిరూపించిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బోనకల్ కళాశాల విద్యార్థులు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో చదివిరాష్ట్ర స్థాయి ర్యాంక్ లతో సత్తా చాటారు మధిర మండలం కృష్ణాపురం లో ఉన్న ఎంజేపీ టి బోనకల్ విద్యార్థుల రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించడం పై అభినందనలు తెలియజేస్తున్నారు. మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను చరణ్ 468, ,సాయి 467,త్రివిక్రమ్ 466, వేణు 466 మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండు ,మూడు, నాల్గవ ర్యాంకులు పొందారు. ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను మహేష్ 988, లక్ష్మణ్ 987, విశాల్ 984, రాము 984,వినోద్ 980 మార్కులు సాధించడం పట్ల ప్రిన్సిపాల్ మన్నె సుష్మ అధ్యాపకులు విద్యార్థులని అభినందించి సత్కరించారు.

## ఇంటర్ ఫలితాలలో స్టెమ్‌స్పార్క్ జూనియర్ కాలేజి ప్రభంజనం



ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్)ః ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో అత్యద్భుత ప్రతిభను కనబరిచి విజయ దుందుబి మోగించారు. ఐ.ఐ.టి., యన్.ఐ.టి. సీట్ల సాధనే లక్ష్యంగా స్థాపించిన స్టెమ్‌స్పార్క్ జూనియర్ కాలేజ్ మొదటి సంవత్సరంలోనే ఇంటర్ ఫలితాలలో విద్యార్థులు ఎ. హర్షిత (467/470), సిహెచ్ హిమజ(466/470), పి.సాగసాయి అనిరుధ్ వర్మ(466/470), జి.గాయత్రి (465/470), ఎన్‌సిహెచ్ సుషాంక్ (465/470), వై.శ్రీరామ్(465/470), బి. బ్రాహ్మణి(464/470) మార్కులతో అత్యుత్తమైన ప్రతిభ కనబరిచి, 75 మంది 450 పైగా 30; 425 పైగా 47, 400 పైగా 57 విద్యార్థులు మార్కులు సాధించారు. ఈ మేరకు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.
అభినందన కార్యక్రమములో పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ సామాన్య విద్యార్థులు కూడా అసామాన్య ఫలితాలను సాధించగలిగేలా కృషి చేస్తున్నామన్నారు. వారు భవిష్యత్తులో జరగబోయే మేయిన్స్, అడ్వాన్స్, యం.సెట్, వంటి పోటీ పరీక్షలలో ఉత్తమ ప్రతిభను కనబరచి ఐ.ఐ.టి., యన్.ఐ.టి. సీట్లను సాధించి తల్లిదండ్రుల ఆశయాలను సాధించడానికి స్టెమా స్పార్క్ జూనియర్ కాలేజ్ శ్రీనగర్ ప్రణాళిక బద్ధంగా విద్యాబోధన చేస్తుందన్నారు. ఫాఠశాల డైరెక్టర్ కొండా కృష్ణవేడ్డి మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్దే ధ్యేయంగా నూతన ఆవిష్కరణలకు ముఖద్వారంగా ఉంటూ విద్యార్థులలో మంచి క్రమశిక్షణ, నైపుణ్యాలను పెంపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, తలిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో రెజొనెన్స్ ప్రభంజనం



ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్)ః జూనియర్, సీనియర్ ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకులతో పాటు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాలలో రెజొనెన్స్ కళాశాల విద్యార్థులు నిలిచారని రెజొనెన్స్ కళాశాల డైరెక్టర్స్ ఆర్.వి. నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు పేర్కొన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించడానికి పశిష్టమైన ప్రణాళిక అనుభవజ్ఞులైన ఆధ్యాపక బృందం, బోధనానుభవం కలిగిన మేనేజ్ మెంట్ కారణమని తెలియజేసారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ఈ సంధర్భంగా అభినందించారు.ఇంటర్ ప్రథమ సంవత్సరం యం.పి.సి. విభాగంలో డి. హారిక 466/470, ఇ.తిరుపతమ్మ 466/470, వి.తన్మయి 466/470, టి.సరిగమ466/470, బివిఎస్ వర్షిత 466/470, ఎ.వర్షిణి 466/470, ఎం.విగ్నేష్ 466/470, షేక్ అనీఫా 465/470, ఎల్. రామ్మోహన్ రెడ్డి 465/470, ఎం.మన్విత శ్రీ 465/470, ఎం.భవ్యశ్రీ465/470, ఎన్.వివేక్ 465/470, బి.చరిష్మా 465/470 మార్కులు సాధించారు. యం.పి.సి నందు 400 పైగా మార్పులు సాధించిన విద్యార్థులు 406 నుండి పైగా ఉండటం విశేషం. ఇంటర్ ప్రథమ సంవత్సరం బై.సి.సి. విభాగంలో కె. హారిక 436/440, జి. నిస్సి డెనీల 434/440, కె.అధితి 434/440, బి.దివ్యశ్రీ 432/440, సి.హెచ్.ధన్యత 430/440, ఎం. ధరణి 428/440, షేక్. ఫర్హీన్ 427/440, కె.శ్రీకళ 125/440, కె.వర్షిత 422/440 మార్కులు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం యం.పి.సి. విభాగంలో బి.నిహారిక 992/1000, ఎం.ప్రేమ్‌సాయి 992/1000, ఎ.లహరి 991/1000, రోహిణి 991/1000, ఛరిస్మా 990/1000, సాయి కీర్తన్ 990/1000 మార్కులు సాధించారు. వీరితో పాటు 950 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 169 మంది పైగా ఉండటం విశేషం.ఇంటర్ ద్వితీయ సంవత్సర బైపి.సి. విభాగంలో ఎన్. జాహ్నవి 989/4 1000, ఏ. జాహ్నవి 981/1000, డి.ఉషశ్రీ 980/1000, టి. హాసిని 973/1000, సిహెచ్. మణికంఠ, 972/1000 మార్కులు సాధించారు. 950 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 22 ముంది ఉన్నారు. ఇంతటి మంచి ఫలితాలు సాధించడానికి చక్కటి ప్రణాళికాబద్ధమైన బోధన వలన మాత్రమే సాధ్యమైనదని, జాతీయ, రాష్ట్ర స్థాయి, పోటీ పరీక్షలలో సైతం అద్భుతమైన ఫలితాలని సాధిస్తూ ఒక విలక్షణమైన విద్యాక్షేత్రంగా వెలుగొందుతూ, తన ప్రతిభను చాటుకుంటుందని రెజొనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు ఆర్.వి. నాగేంద్రకుమార్, కె.శ్రీధర్రావులు తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులను సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులకు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి, శాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# భూభారతి వల్ల భూ సమస్యలు పరిష్కారం కావాలి

- వారసత్వ హక్కులకు అందరికీ అవకాశాలు
- భూ భారతి సదస్సు సమావేశంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణా రావు




మహబూబ్ నగర్, ఏప్రిల్ 22( మనం బ్యూరో)ఃధరణి ద్వారా పరిష్కారం కాని భూ సమస్యలు పరిష్కరిం చేందుకు ప్రభుత్వం భూ భారతి అర్. ఓ .అర్ చట్టం 2025 ఏప్రిల్ 14 న అంబేద్కర్ జయంతి రోజున అమలు లోకి తీసుకు వచ్చినట్లు రాష్ట్ర ఎక్సైజ్, ఎర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు అన్నారు.మంగళవారం భూత్పూర్ మండలం కె.వి ఎన్ పంక్షన్ హాల్ లో నిర్వహించిన భూ భారతి సమావేశం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సులో మంత్రి మాట్లాడుతూ భూభారతి చట్టం అమలు లోకి రాకముందు ఎన్నో రకాల భూ సమస్యలతో రైతులు,సామాన్య ప్రజలు ఇబ్బంది ఎదురుకొన్నారని తెలిపారు. భూమి హక్కు గౌరవం,అత్మ విశ్వాసం, ధైర్యం అని అన్నారు.గత 50,60 సంవత్సరాల క్రితం తెల్ల కాగితాలపై కొనుగోలు చేసిన సాదా బైనామా రెవిన్యూ రికార్డుల్లో నమోదు చేయలేధని తెలిపారు.భూమి



కొనుగోలు చేసిన పట్టాదారు రికార్డు లో నమోదు కాక పోవడం కారణంగా రైతుకు బంధు,రైతు భరోసా రాలేదని తెలిపారు. సాగు చేసుకునే రైతు పేరు కాకుండా ధరణిలో ఉన్న వారే యజమానులుగా వ్యవహరిస్తున్నారు. దాన్ని ఆసరా చేసుకుని తిరిగి రిజిస్ట్రేషన్ చేయాలంటే మళ్ళీ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు.భూ సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాక ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారని అన్నారు.భూ రికార్డులను సవరణ చేసేందుకు అధికారులకు అధికారం లేదని అన్నారు

రకరకాల భూ సమస్యలతో రైతులు మనోవేదనకు గురయ్యారని, చాలామంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ధరణి ద్వారా నష్టపోయిన రైతులకు న్యాయం చేసేందుకు భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు.పాస్ పుస్తకాల్లో సవరణలు నిర్దేశిత సమయంలోగా పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. గతం లో ఇచ్చిన దరఖాస్తులను,సాధా బైనామా దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. సర్వే నెంబర్, గ్రామం, మండలం,సెల్ నెంబర్ తో సంతకం చేసి తహశీల్దార్,అర్.డి. ఓ కు దరఖాస్తు చేసి రశీదు పొందాలని అన్నారు.దరఖాస్తు వాట్సఅప్,మెయిల్ ద్వారా పంపాలని అన్నారు.నూతన చట్టం ద్వారా కార్యాలయాలకు తిరగవలసిన అవసరం లేదని, దరఖాస్తు చేసుకున్న గ్రామ వి .ఏ.ఓ వెరిఫై చేసి నెల రోజుల్లో పరిష్కరించాలి లేదా తిరస్కరణ చేయాలని అన్నారు.సక్రమంగా ఉన్న దరఖాస్తు తిరస్కరణ చేస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతాంగాన్ని ఇబ్బంది పెట్టకుండా భూ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. రైతుబంధు, ఇలాంటి పథకాలు ఇంకాఛీ అందుబాటులో రాలేదని ప్రతిపక్ష పార్టీలు అంటున్నారు. వాస్తవాల కు విరుద్ధంగా ప్రచారం జరుగుతుందని,రైతు సంఘాలు, మహిళా సంఘాలు,యువజన సంఘాలు,రచ్చ బండ ద్వారా చర్చ జరిగి ప్రజలకు వాస్తవాలు తెలుపాలని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 64 సం ల లో 21 మంది ముఖ్యమంత్రులుగా పని చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాకముందు 64 సంవత్సరంలో 65 వేల కోట్లు అప్పు ఉంటే నెలకు 600 కోట్ల రూ.లు వడ్డీ అప్పు కడితే కె.సి.అర్ సి.ఎం.గా పది సంవత్సరాల కాలంలో ఏడు లక్షల 30 వేల కోట్ల రూపాయల అప్పు చేసినట్లు తెలిపారు.ఈ అప్పుకు ప్రభుత్వం నెలకు 6500 కోట్ల వడ్డీ కడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత లక్ష 50 వేల కోట్ల రూ..లు అప్పు చేశారని, అసలు వడ్డీ కలిపి లక్ష 40 వేల కోట్ల రూ.లు కడుతున్నట్లు తెలిపారు.

ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల లోపు రైతు రుణాలు మాఫీ చేసినట్లు తెలిపారు.చిన్న చిన్న పొరపాట్ల వలన కొన్ని మిగిలినట్లు తెలిపారు. కె.సి.అర్ రెండవ సారి అధికారం లో లక్ష రుణ మాఫీ చేస్తామని, చివరి సం.లో అర కొరగా చేశారని అన్నారు

రాష్ట్రం అప్పుల ఊబిలో లేకుంటే మరిన్ని సంక్షేమ పథకాలను అమల్లోకి తేచ్చేవాళ్ళం. గతంలో చేసిన అప్పులు రాష్ట్రానికి శాపంగా మారాయని అన్నారు. ధనిక రాష్ట్రాన్ని పేద రాష్ట్రంగా చేసిన ఘనత కె.సి.అర్ కే దక్కుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణ మాఫీ,500 రూ.లకు గ్యాస్ సబ్సిడీ, మహిళలకు అర్.టి.సి లో ఉచిత ప్రయాణం,200 లోపు విద్యుత్ వినియోగించిన పేదలకు జీరో బిల్లు ఆరు గ్యారెంటీ లు తదితర పథకాలు అమలు చేస్తున్న ట్లు తెలిపారు. సన్న బియ్యం పండించిన రైతులకు క్వింటాల్ కు 500 రూపాయలు బోనస్ వానాకాలం లో అంద చేసినట్లు తెలిపారు దేవరకద్ర నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల కు 170 కోట్ల రూ.లు కేటాయించినట్లు తెలిపారు. గత పది సంవత్సరాల కాలంలో చేయలేని పనులను మేము ఒక సంవత్సరంలో అమలు చేశామని తెలిపారు . మిగతా సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా ప్రజల చెంతకు తెస్తామని అన్నారు.

ఎన్నికల్లో ఇంటింటికి వెళ్లి ఓటు అడిగినట్లు, అదేవిధంగా సంక్షేమ పథకాలపై ప్రతి గ్రామం లో కుటుంబ సభ్యుల దగ్గరికి వెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు.సంస్కృతి అంటే మన జీవన విధానం అని అనేక మంది రోగాల బారిన పడి ఆసుపత్రులలో డబ్బులు ఖర్చు చేస్తున్నట్లు, సాంప్రదాయంగా వచ్చిన అలవాట్ల ప్రకారం ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ ధరణి మహమ్మారి వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఎంతోమంది భూ సమస్యలకు పరిష్కారం దొరకక రెవిన్యూ ఆఫీసులో చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. 18 రాష్ట్రాలలో ఉన్న రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు. ప్రజలందరికీ అనుకూలమైన అంశాలను భూభారతి చట్టంలో పొందుపరచడం జరిగిందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ధరణి తీసుకువెళ్లి బంగాళాఖాతంలో కలిపినట్లు తెలిపారు. ధరణిని అడ్డం పెట్టుకొని గత ప్రభుత్వంలో నాయకులు తమకు అనుకూలంగా చేసుకొని భూకబ్జాలకు తెర లేపారని తెలిపారు. రాబోయే రోజుల్లో గత ప్రభుత్వం లో నేతలకు కబ్జాల వివరాలను వెల్లడించనున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా తహసిల్దార్ మీ సమస్యలను పరిష్కరించే విధంగా భూభారతిలో వెసులుబాటు ఉందని అన్నారు. గతంలో ఇప్పుడు గ్రామ పాలన అధికారులు లేరని తెలిపారు. వీఆర్వో వ్యవస్థను రద్దు చేసారని అన్నారు.గ్రామ పరిపాలన అధికారులను నియమించి రెవెన్యూ వ్యవస్థ బలోపేతం చేస్తామని అన్నారు. దానివల్ల గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. రైతుల సమస్యలను గ్రామాల్లో అక్కడికక్కడే పరిష్కారం చేస్తామని అన్నారు. భవిష్యత్తులో మరో వందేళ్లు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భూభారత్ చట్టాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. వారసత్వ హక్కులకు అందరికీ సమానంగా శాశ్వత పరిష్కారం దొరకనుందని అన్నారు. చాలా సమస్యలు అధికారుల ద్వారా పరిష్కారం అవుతాయని అన్నారు.

రైతు పక్షపాతిగా రాష్ట్ర ముఖ్యమంత్రి గొప్ప నిర్ణయం తీసుకునీ భూ భారతి చట్టం ప్రారంభించారని ఆన్నారు

ఇచ్చిన హామీల్లో భాగంగా ఒక్కొక్కటి నెరవేరుస్తున్నట్లు తెలిపారు. భూత్పూర్ మండలంలో రెండు లక్షల లోపు రుణాలకు సంబంధించి 40 కోట్ల 60 లక్షల రూపాయలు 5200 మంది రైతులకు రుణమాఫీ



జరిగిందని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారమే సన్న ఒట్లకు మద్దతు ధర తో పాటు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ అంద చేసినట్లు తెలిపారు.మండలం లో వానాకాలం లో 3 కోట్ల రూ.లు బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.రైతు భరోసా కింద ఇప్పటికే 11 కోట్ల రూ.లు జమ చేసినట్లు తెలిపారు .యాదంగి లో 12 కొనుగోలు కేంద్రాలు తెరచినట్లు,రైతు దగ్గర నుండి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారం జరిగేలా భూ భారతి చట్టం రూపొందించినట్లు తెలిపారు.సాధా బైనామా లకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. వారసత్వ భూములు 30 రోజుల్లోగా విచారించి పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు.తహశీల్దార్ వద్ద పరిష్కారం లభించకుంటే అర్.డి. ఓ,కలెక్టర్, సి.సి.ఎల్. ఏ వద్ద అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని అన్నారు.ప్రతి భూమి రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే చేసి మ్యాప్ తయారు చేసి పాస్ పుస్తకంలో పొందుపరచనున్నట్లు తెలిపారు. ఈ సమావేశం లో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు,అర్.డి. ఓ నవీన్,మండల ప్రత్యేక అధికారి వేణు గోపాల్,తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో రిషి కళాశాల సంచలనం




మహబూబ్ నగర్ టౌన్, 22 ఏప్రిల్(మనం న్యూస్) ః ఇంటర్మీడియట్ ఫలితాలలో రిషి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అద్భుతమైన ఫలితాలు సాధించి పాలమూరు విద్యా ఖ్యాతిని .ఈ సందర్భంగా రిషి జూనియర్ కళాశాల చైర్ పర్సన్ చంద్రకళ వెంకట్ మాట్లాడుతూ ఇంటర్ ఫలితాలలో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో మొదటి సంవత్సరం విభాగం నుంచి ఎంపీసీ నందు ఎం. భావన 468/470, 7 గురు విద్యార్థులకు 467/470 మార్కులు, బైపిసి నందు మలిహ కహేకశ 438/440, 3 గురు విద్యార్థులకు 437/440 మార్కులు, 3 గురు విద్యార్థులకు 436/440 మార్కులు సాధించారు. అలాగే రెండవ సంవత్సరం విభాగం నుండి ఎంపీసీ నందు టి.మేఘన 993/1000, 5 గురు విద్యార్థులకు 990/1000 పైగా మార్కులు, బైపిసి నందు మలిహ తహనియత్ 992/1000 మార్కులు, 5 గురు విద్యార్థులు 990/1000 పైగా మార్కులు సాధించారని కళాశాల యాజమాన్యం తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్ పర్సన్ చంద్రకళ వెంకట్ , అకాడమిక్ చీఫ్ అడ్వైజర్ వెంకటయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ లక్ష్మారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డీన్ భూపాల్ రెడ్డి,ప్రిన్సిపల్ ప్రసన్నలక్ష్మి, మరియు అధ్యాపక బృందం అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## లైంగిక దాడులకు గురికాకుండా అణిచివేసే దిశగా చర్యలు తీసుకోవాలి



- కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ వి. విక్టర్
- అదనపు సుపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ చైతన్య రెడ్డి

కామారెడ్డి, ఏప్రిల్ 22 ( మనం ప్రతినిధి ) ః తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ప్రతి పాఠశాల నుండి ఒక చైల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ లను నియమించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ తెలిపారు. సోమవారం మరియు మంగళవారం స్థానిక కళాభారతి ఆడిటోరియంలో జిల్లాలోని అన్ని ఖ్రిఖి, పార్టీ(ఖ్రాఖీ), పార్టీ ఏజీజి ఖిఖిజాూఖ ఇటజిర్బ్ని స్కూల్స్ లోని 807 ఏఖు మరియు 553 చైల్ ప్రొటెక్షన్ ఆఫీసర్లకు రెండు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. నియమించబడిన ప్రొటెక్షన్ ఆఫీసర్ పాఠశాలలలో పిల్లల పట్ల ఎటువంటి లైంగిక దాడులకు గురికాకుండా వాటికి ప్రారంభ దశలోనే అణిచివేసే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. స్టూడెంట్ లాగా కాకుండా మన పిల్లలుగా భావించాలని, పిల్లలలో మనం నమ్మకం అనేది కల్పించాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమాలను చూసి వేరే జిల్లా వారు కూడా మన జిల్లాను ఆదర్శంగా తీసుకుంటున్నారని తెలపడం జరిగింది. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లాలోని అన్ని పాఠశాలలకు 7 విడతల వారీగా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. దాదాపు మొత్తం 2013 మంది ఈ అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారని తెలిపారు. అదనపు సుపరిండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ చైతన్య రెడ్డి ఐపీఎస్ మాట్లాడుతూ., పిల్లలపై అసభ్యకరమైన సంఘటన జరిగిన ఎడల ఆ పాఠశాల చైల్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పు చేసిన వారిపై కేసు లు నమోదు చేయించాలని తెలపడం జరిగింది. చైల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ గా మీ బాధ్యతలు పిల్లల పట్ల నిర్వహించాలని చెప్పడం జరిగింది. పోక్సో కేసులు జరిగినప్పుడు పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి భవిష్యత్తును ప్రభావితం చేసే అంశాలను వివరించారు. ఈ రకమైన కేసులలో తల్లిదండ్రులు మరియు టీచర్ల బాధ్యతలను కూడా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, జిల్లా బాలల పరిరక్షణ అధికారి స్రవంతి, స్వర్ణలత చైల్ వెల్ఫేర్ కమిటీ కామారెడ్డి, సుకన్య ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, డేవిడ్ రాజ్ హైదరాబాద్, బాల రక్షాబంధన్ సిబ్బంది హాజరు కావడం జరిగింది.

## ఎస్ఆర్ఎన్కే కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను విజయవంతం చేయాలి



- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ, ఏప్రిల్ 22 ( మనం న్యూస్ ) కామారెడ్డి జిల్లా బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలనుపూర్వ విద్యార్థులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 24న నిర్వహించే కళాశాల సిల్వర్ జూబ్లికి ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు విచ్చేస్తున్నారని తెలిపారు. బాన్సువాడలో డిగ్రీ కళాశాల కోసం ఎంతో కృషి చేశానని, 1997లో జీవో రాగా.. 1998లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా బాన్సువాడ కళాశాల కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకు కళాశాలలో చదువుకున్న 10వేల మంది విద్యార్థులు వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని పేర్కొన్నారు. కళాశాల న్యాక్ బీ ప్లస్ గ్రేడ్తో స్వయం ప్రతిపత్తి కలిగి ఉందన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ వేణుగోపాలస్వామి, ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, బీర్కూరు ఏఎంసీ ఛైర్మన్ శ్యామల, నాయకులు కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, వెంకన్న గుప్తా, నార్ల సురేష్ గుప్తా, ఎజాజ్, ఖాలేక్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియాలో ఎకో టూరిజం



- ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడి
- కలెక్టర్ తో కలిసి అధికారులతో సమీక్ష

నిజామాబాద్, ఏప్రిల్ 22 (మనంప్రతినిధి)ః తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతాలను ఎకో టూరిజం ప్రదేశాలుగా తీర్చిదిద్దుతామని ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిలిచే నందిపేట మండలం ఉమ్మెడ, జలాల్పూర్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించేందుకు ఎకో టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్ తో కలిసి సీసీఎఫ్ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం నిజామాబాద్ పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి అటవీ, రెవెన్యూ, నీటి పారుదల తదితర శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియాలో ఎకో టూరిజం అభివృద్ధి కోసం అనువైన పరిస్థితుల గురించి కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, సమగ్ర వివరాలతో నివేదికలు సమర్పిస్తే, తక్షణమే మంజూరీ తెలుపుతూ, నిధులు కేటాయిస్తామని అన్నారు. రాష్ట్రంలోని అనువైన ప్రాంతాలను పర్యావరణహితంతో కూడిన పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు సూచించారు. ఎకో టూరిజం అభివృద్ధి చర్యలలో భాగంగా 25 సఫారీ వాహనాలను కొనుగోలు చేశామన్నారు. ఎకో టూరిజం అభివృద్ధితో ప్రజలకు కూడా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. నందిపేటలో ఎకో టూరిజం అభివృద్ధి పనులలో భాగంగా సఫారీ వాహనాల కొనుగోలు, వాచ్ టవర్, పార్కింగ్ ప్రదేశం, రెస్టారెంట్లను మొదటగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని అన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియాలు అయిన ఉమ్మెడలో 1.20 ఎకరాలు, జలాల్పూర్ లో 3 ఎకరాలలో ఎకో టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. ఉమ్మెడ నుండి బాసర వరకు బోటింగ్ ప్రణాళికను కూడా సిద్ధం చేస్తామని అన్నారు. అలాగే ఉమ్మెడ నుండి గాదెపల్లి వరకు - 20 కి.మీ, గాదెపల్లి నుండి జలాల్పూర్ వరకు - 16 కి మీ సఫారీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. 3 రోజులలో సమగ్ర ప్రణాళికలు, కావల్సిన నిధుల వివరాలతో నివేదిక సమర్పిస్తే, వెంటనే బడ్జెట్ విడుదల చేస్తామన్నారు. ఈ సమీక్షలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, ఆర్డీఓ రాజాగౌడ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలు అమలులో నిర్లక్ష్యానికి తావులేదు

- వేసవి లో త్రాగు నీటి సమస్య రాకుండా పరిష్కరించాలి
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం కు రశీదు ఇవ్వాలి
- పెండింగ్ పర్యాటక అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- సి.ఎం.అర్ బకాయిలు మిల్లర్ల నుండీ రికవరీ చేయాలి
- సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు




మహబూబ్ నగర్ బ్యూరో, 22 ఏప్రిల్, (మనం బ్యూరో)ః ఎండాకాలం లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక ,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి చిన్నారావు అధికారులను ఆదేశించారు. మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో, జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక శాఖ, సాంస్కృతిక శాఖ మంత్రి త్రాగునీటి సరఫరా,ధాన్యం కొనుగోలు,పర్యాటక అభివృద్ధి పనులు,గ్యాస్ సబ్సిడీ తదితర అంశాలు సమీక్షించారు.వేసవి లో త్రాగు నీటి సరఫరా పరిస్థితి పై సమీక్షించారు.జిల్లాలో హాబిటే షన్ లు,పట్టణ ప్రాంతాలలో త్రాగు నీరు సరఫరా పై మిషన్ భగీరథ అధికారులు వివరించారు. మంత్రి మాట్లాడుతూ రిజర్వాయర్లలో నీటి నిల్వల కు ఇబ్బంది లేదని ,నిర్వహణ లో కొన్ని లోపాలు ఉన్నవని,వాటిని పరిష్కరించి వేసవి లో త్రాగు నీటి సరఫరా లో ఇబ్బంది. లేకుండా చూడాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితి లో త్రాగునీరు సరఫరా చేసే ందుకు గౌరవం రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లకు కోటి రూపాయలు నిధులను మంజూరు చేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు ఇంకా అదనంగా రామినేటి సరఫరాలో సమస్యలుంటే శాసనసభ్యుల ఎస్.డి. ఎఫ్ నిధులు కూడా వినియోగించుకోవచ్చని ఈ సందర్భంగా తెలిపారు.

### ధాన్యం కొనుగోలు పై సమీక్షించారు

రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే నిర్ణీత తేమశాతం, నాణ్యతా ప్రమాణాలు ఉన్న ధాన్యం తూకం వేసిన వెంటనే కొనుగోలు చేసిన ధాన్యం పరిమాణం ననుసరించి రశీదు అంద చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ వంద శాతం అమలు చేయాలని ఆదేశించారు.రైతు లు ధాన్యం ను మిల్లులకు రవాణా చేసుకుని పడిగాపులు పడకుండా కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు మిల్లులకు పంపించాలని ఆదేశించారు.ఎట్టి పరిస్థితి లో తేమ, తాలు పేరిట తరుగు తీయవద్దని స్పష్టం చేశారు.గత రబీ లో మిల్లర్ లు వడ్లు మిల్లింగ్ చేసి బియ్యం డెలివరీ చేయకుండా అమ్ముకున్న మిల్లర్ ల నుండి 150 కోట్ల మేర బకాయిలు రికవరీ చేయాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారులను నియమించి కొనుగోళ్ల పర్యవేక్షణ చేయాలని సూచించారు. మార్కెట్ యార్డు ల వద్ద నిధులతో అదనంగా టార్పాలిన్ లు కొనుగోలు చేయాలని,వర్షం పడితే ఒక్క ధాన్యం గింజ తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెట్ యార్డులలో రైతులకు త్రాగునీరు టాయిలెట్లు షెడ్లు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు ధాన్యం కొనుగోలు నిర్వాహకులు అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్ళు సాఫీగా నిర్వహించేలా సమీక్షించి ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ కు సూచించారు. ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ కు 500 రూ లు సబ్సిడీ అంద చేస్తుందని,పేరు,ఆధార్ నెంబర్,రేషన్ కార్డు లో తప్పుల వలన అర్హులు మిస్ అయ్యారని అన్నారు.200 యూనిట్ లోపల విద్యుత్ వినియోగించుకునే వారికి జీరో బిల్లు రాకుంటే వాటిని కూడా సరి చేయాలని సూచించారు. 15 రోజుల్లో ప్రోఫోర్మా రూపొందించి అర్హులైన వారు ఉంటే జాబితా రూపొందించి డేటా తయారు చేయాలని సూచించారు.నూతన రేషన్ కార్డు లు కూడా అంద చేయనున్నట్లు ఆయన తెలిపారు.జిల్లాలో పర్యాటక అభివృద్ధి పనులుసమీక్షించారు.ప్రభుత్వం మంజూరు చేసిన పనులు వెంటనే చేపట్టాలని అన్నారు. పిల్లల మర్రి లో,కోయిల్ సాగర్ లో ప్రభుత్వం మంజూరు చేసిన పనులు వెంటనే టెండర్ పిలిచి చేపట్టాలని ఆదేశించారు.శిల్పారామం లో ఉన్న ఆడిటోరియం లో సౌండ్ ప్రూఫ్ కు ఎస్టిమేట్ వేయాలని పర్యాటక అభివృద్ధి శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మన్యంకొండ లో హరిత హోటల్,కళ్యాణ మండపం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ట్యాంకుబండ్ నెక్లెస్ రోడ్డు, ఐ లాండ్ పనులు రీ ఎస్టిమేట్ చేయాలని ఆదేశించారు.మహబూబ్ నగర్ లో నిర్మాణం లో ఉన్న టూరిజం హోటల్ పనులు ప్రగతి సమీక్షించారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ. శిల్పారామం లో నాడు బలవంతంగా ప్లాట్లను ఓనర్స్ ద్వారా తీసుకున్నారని , అట్టి ప్లాట్లు శిల్పారామానికి అవసరమైతే తీసుకుని నష్టపరిహారం ఇవ్వాలని, శిల్పారామానికి అవసరం లేకపోతే వెంటనే ప్లాట్లను తిరిగి ఓనర్స్ అప్పజెప్పాలని ఆయన అధికారులను ఆదేశించారు. రెవెన్యూ భూము లు అని అధికారులు చెప్పగా గత 15 సంవత్సరాల క్రితం లే ఔట్ చేసినప్పుడు రెవెన్యూ అధికారులు ఎందుకు ఊరుకున్నారని ఆయన ప్రశ్నించారు. వెంటనే మంత్రి కల్పించుకుని వారం రోజుల్లోపు శిల్పారామం ప్లాట్ల విషయం లో ఫిజికల్ గాను రికార్డు రూపంలోను నివేదిక ఇవ్వాలని మంత్రి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. 48.99 కోట్ల రూపాయల తో పెద్ద చెరువు దగ్గర ఐస్ లాండ్ , సుందరీకరణ, నెక్లెస్ రోడ్ నిర్మాణం చేపట్టేందుకు గతంలో ఎస్టిమేట్స్ చేయగా 7 కోట్ల రూపాయల పనులు పూర్తి చేయడం జరిగిందని, బిల్లులురాని కారణంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, స్థానిక ఎమ్మెల్యే తో కలిసి రీ ఎస్టిమేషన్ తయారు చేసి , 3 వారాల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎంతో ఖర్చు చేసి శిల్పా రామం నిర్మించారని, కానీ ఫంక్షన్ హాలు నిరుపయోగంగా ఉందని దానిని ఉపయోగించు కోవాలంటే సౌండ్ ప్రూఫ్ కావాలని, మొన్న ఉగాది వేడుకలు నిర్వహించిన సందర్భంగా సౌండ్ ప్రూఫ్ లేకపోవడం చేత ఇబ్బందులు కలిగినట్లు చెప్పారు. శిల్పారామం లో సౌండ్ ప్రూఫ్ కోసం ఎస్టిమేట్స్ ను వెంటనే తయారు చేసి నివేదిక ఇవ్వాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. మన్యం కొండ దగ్గర నిర్మించే హోటల్ ను అన్ని రకాల వసతులు కల్పించాలని ఆయన కోరారు. దేవరకద్ర శాసన సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం లో త్రాగు నీటి పనులు,కోయిల్ సాగర్ పర్యాటక పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలు... 59.25 పాస్ ఇంటర్

నిజామాబాద్, ఏప్రిల్ 22 (మనంప్రతినిధి): 2024-25 విద్యా సంవత్సరానికి గాను గత మార్చి నెలలో జరిగిన ఇంటర్ వార్షిక పరీక్షలలో జిల్లాలో రెండవ సంవత్సరం విద్యార్థులు 59.25% ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో విద్యార్థులు 53.37% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.కాగా బాలికల ఉత్తీర్ణత శాతం పైచేయిగా నిలిచింది. మొత్తం బాలికలు రెండవ సంవత్సరంలో 70% మంది ఉత్తీర్ణులు కాగా, బాలురు 45 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో బాలికలు 64% సాధించగా బాలురు 41 శాతం ఉత్తీర్ణత సాధించారు.

నిజామాబాద్ జిల్లాలో రెండవ సంవత్సరం జనరల్ కోర్సులలో మొత్తం విద్యార్థులు 13,945 మంది హాజరు కాగా వీరిలో 8,117 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలికలు 7,657 మంది హాజరుకాగా 5,309 మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా బాలురు 6,288 మంది పరీక్షలకు హాజరు కాగా 2,808 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే రెండవ సంవత్సరం ఒకేషనల్ లో మొత్తం 2,042 మంది విద్యార్థులు హాజరుకాగా 1,231 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలికలు 814 మంది పరీక్షలకు హాజరుకాగా 666 మంది



ఉత్తీర్ణులయ్యారు. బాలురు 1,228 మంది పరీక్షలకు హాజరు కాగా 565 మంది ఉత్తీర్ణులయ్యారు.

కాగా బాలురు 6,982 మంది పరీక్షలకు హాజరు కాగా 2,844 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 2,790 మంది పరీక్షలకు హాజరుకాగా 1,223 ఉత్తీర్ణులయ్యారు. కాగా బాలికలు 1,111 మంది హాజరు కాగా వీరిలో 756 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 1,679 మంది పరీక్షలకు హాజరుకాక 467 మంది ఉత్తీర్ణులయ్యారు.

# మహిళాభివృద్ది శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 7 వ జాతీయ పోషణా పక్షం కార్యక్రమం

- ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి, ఏప్రిల్ 22 ( మనం ప్రతినిధి):** మహిళాభివృది శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 7 వ జాతీయ పోషణా పక్షం కార్యక్రమాన్ని మంగళవారం ఐ డి ఓ సి మీటింగ్ హాల్ లో నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గారు పాల్గొనడం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ., గర్భిణి, బాలింతలు సరైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు, మొదటి 1000 రోజుల ప్రాముఖ్యతను తెలియజేస్తూ మొదటి 1000 రోజులలో గర్భిణి, బాలింతలు, చిన్నారులు తెసుకునే ఆహరం వారి సరైన పెరుగుదలకు దోహదం చేస్తుందని తెలిపారు, చిన్నారులకు అంగన్వాడి లో అందిస్తున్న పోషకాహారంతో పాటుగా ఇంటి వద్ద కూడా సరైన పోషకహారం అందించాలని తెలిపారు, పిల్లల యొక్క పెరుగుదల పర్యవేక్షణ లో ఖచ్చితమైన ఎత్తు, బరువులను గుర్తించి ఆ వివరాలను ఆన్లైన్ లో తప్పులు లేకుండా నమోదు చేయాలని, తప్పుడు వివరాలను నమోదు చేయవద్దని సూచించారు. లోప పోషణ గల చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. అనంతరం అధికారులు లబ్దిదారుల చేత పోషణా ప్రతిజ్ఞ చేయించడం జరిగింది మరియు సామూహిక సీమంతాలు, అన్నప్రాసన చేయడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను కలెక్టర్ గారు సందర్శించారు. ఇట్టి స్టాల్ నందు అంగన్వాడి టీచర్లు స్వయంగా తయారుచేసిన మునగాకు రసం, రాగి జావా, నువ్వుల లడ్డు మరియు ఇతరం పోషకాహార పదార్థాలను కలెక్టర్ గారు రుచి చూసి రాగి జావా, మునగాకు రసం, నువ్వుల లడ్డులో ఉన్న పోషకాలు ఐరన్ లోపాన్ని తగ్గించడం లో, ఆరోగ్య కరమైన జీవన శైలి కి దోహద పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విక్టర్, చందర్ నాయక్ లు, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, డీపీఆర్వో భీమ నాయక్, కామారెడ్డి సీడీపీఓ శ్రీలత, సూపరింటెండెంట్, సూపర్వైసర్లు, పోషణ్ అభియాన్ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, లబ్దిదారులు మరియ తదితరులు పాల్గొన్నారు.



# బియ్యం కేసు రాజకీయ కక్ష సాధింపులో భాగమే

- బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్

**బోధన్, ఏప్రిల్ 2 2 (మనం న్యూస్):** బియ్యం కేసులో తనను కుట్రపూరితంగా ఇరికించారని మాజీ ఎమ్మెల్యే షకీల్ అన్నారు.నేను నియోజకవర్గంలో లేని సమయంలో కష్టం మిల్లింగ్ వ్యవహారంలో నేను అక్రమాలకు పాల్పడ్డట్టుగా కేసులు చేశారన్నారు. తన కుమారుడిపై కూడా కేసు నమోదు చేశారు అని ఆవేదన వ్యక్తం చేసారు. మంగళవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన బిఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డిని ఉద్దేశించి విమర్శలు గుప్పించారు.ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి దూరంగా ఉంటూ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆరోగ్య సమస్యల కారణంగా తాను ప్రజలకు అందుబాటులో లేని సందర్భాన్ని కొందరు కాంగ్రెస్ నేతలు తప్పుగా ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పూర్తిచేసిన అభివృద్ధి పనులపై ఇప్పుడు కాంగ్రెస్ నేతలు శంకుస్థాపనలు చేసి ప్రజల మెప్పు పొందే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. అభివృద్ధి నిధులు తీసుకురావడంలో సుదర్శన్ రెడ్డి విఫలమయ్యారని అన్నారు. రెండు రోజులలో వరంగల్లో జరిగే పార్టీ ఆవిర్భావ సభకు పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ గంగా రెడ్డి మాట్లాడుతూ..పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త ఐకమత్యంతో ముందుకు రావాలి. విభేదాలు దూరంగా పెట్టి పార్టీకి అండగా నిలవాలి. లేకపోతే నాయకత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుందనీ అన్నారు.ఈ కార్యక్రమంలో ఎడపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్, బోధన్, ఎడపల్లి, వెంజల్, నవీపేట మండలాల పార్టీ అధ్యక్షులు సంజీవ్, గోగినేని నరేంద్రబాబు, శ్రీరామ్, భూమారెడ్డి నర్సింగ్ రావు, అబ్దుల్ వాసే, నాగేందర్ రెడ్డి, గుమ్మల అశోక్ రెడ్డి, రుద్ర సత్యనారాయణ, వెంజర గంగారాం, మాజీ ఎంపీటీసీలు మనీషా, వనజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయ రీడింగ్ రూమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**బోధన్ ఏప్రిల్ 22(మనం న్యూస్):** పట్టణంలోని గ్రంథాలయం ఆవరణలో నూతన రీడింగ్ రూమ్ ను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడుతూ పోటీ పరీక్షలకు రాబోయే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టి రాబోయే పరీక్షలకు సిద్ధం కావాలని గ్రంథాలయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో కాంగ్రెస్ నాయకులు తాహెర్ బిన్ హందాన్ ,గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తూము శరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలి
- ఉద్యోగుల జేపీసీ చైర్మన్ సుమన్ కుమార్ కన్వీనర్ అల్కో కిషన్

**నిజామాబాద్,ఏప్రిల్ 22 (మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేలా చూడాలని ఉద్యోగ జేపీసీ చైర్మన్ సుమన్, జిల్లా కన్వీనర్ అలుక కిషన్ కోరారు. మంగళవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జేపీసీ కో చైర్మన్లు రమేష్, రమణ రెడ్డి, శ్రీనివాస్, రాము, వైస్ చైర్మన్ శేఖర్, కృపాల్ సింగ్, ఫైనాన్స్ సెక్రటరీ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



# పోషణ పక్షం సుపోషిత్ గ్రామ పంచాయతీ అభియాన్



**భీమ్ గల్ (మనం న్యూస్, ఏప్రిల్ 22):** భీంగల్ పట్టణంలోని సహస్ర ఫంక్షన్ హాల్ లో భీంగల్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పోషణ పక్షంలో భాగంగా ప్రాజెక్టు పరిధిలో గల ఆరు మండలాలు భీంగల్, వేల్పూర్, సిరికొండ, మోర్తాడ్, ఏరుగట్ల, కమ్మర్పల్లి, అంగన్వాడీ ప్రీ స్కూల్ పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర మహిళా కమిషనర్ సుధా లక్ష్మి, పాల్గొన్నారు వారు మాట్లాడుతూ::.ప్రీ స్కూల్ పిల్లలతో, పాటలు, డాన్సులు, ఫ్యాన్సీ, డ్రెస్ కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్వాడి సెంటర్లో పోషణ పక్వాడ . బరువులు తుచడం, ఆకలి పరీక్ష, సామ్ మామ్, వీటిపై తల్లులకు, ఆరోగ్యం పై కూడా అవగాహన కల్పించి తద్వారా గర్భిణీ బాలింతలకు కూడా తల్లిపాల ప్రాముఖ్యత కూడా అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ అజయ్ పవర్ కుమార్, డి డబ్ల్యు ఓ రసూల్ బి, హెల్త్ డిపార్ట్మెంట్ సులోచన, భీంగల్ ప్రాజెక్ట్ సిడిపిఓ స్వర్ణలత, ఏ సి డి పి ఓ జ్ఞానేశ్వరి, అన్ని మండలాల సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్ లు, ఆయాలు,, కోఆర్డినేటర్స్, తల్లులు తదితర లు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ నూతన కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే

**బోధన్ ఏప్రిల్ 22(మనం న్యూస్):** బోధన్ పట్టణంలో ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్కు కొత్త భవనాన్ని ప్రారంభించారు. పాత కార్యాలయం నుండి ఆర్అండ్ బి గెస్ట్ హౌస్ లోనికి తరలించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి కార్యాలయం ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవంలో ఉమ్మడి జిల్లా స్థాయి అధికారులు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిజామాబాద్ ఎక్సైజ్ సూపర్ ఇంటెండెంట్, సబ్ కలెక్టర్ఏ,సీపీ, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



# అమెరికాలో ఉగ్రవాది 'హ్యాపీ' దొరికినా వదిలేశారా..!




**వాషింగ్టన్, ఏప్రిల్ 22:** అమెరికాలో అరెస్టైన ఖలిస్థానీ ఉగ్రవాది హ్యాపీ పాసియాకు శిక్ష పడేటట్లు చేస్తామని ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ స్వయంగా వెల్లడించారు.

అమెరికాలో పట్టుబడిన పంజాబ్ గ్యాంగ్‌స్టర్ హ్యాపీ పాసియాకు శిక్ష పడేటట్లు చేస్తామని ఎఫ్‌బీఐ అధిపతి కాశ్ పటేల్ భరోసా ఇచ్చారు. బైడెన్ సర్కారు హయాంలో హ్యాపీ దొరికినా వదిలేసినట్లు ఫాక్స్ న్యూస్ ఓ కథనం ప్రచురించింది. ఇక ఎఫ్‌బీఐ అధిపతి కాశ్ పటేల్ ఎక్స్‌లో కీలక ప్రకటన చేశారు. ''అమెరికాలో అక్రమంగా నివశిస్తున్న విదేశీ ఉగ్రవాద ముఠాకు చెందిన హర్‌ప్రీత్ సింగ్ పట్టుబడ్డాడు. అమెరికా, భారత్‌లో పలు పోలీస్‌స్టేషన్లపై దాడులకు కుట్ర పన్నినట్లు అనుమానాలు ఉన్నాయి. దీనిపై మేము స్థానిక భాగస్వాములు, భారత్‌లోని ఏజెన్సీలతో సమన్వయం చేసుకొని దర్యాప్తు చేస్తాం. అధికారులు అద్భుతంగా పనిచేశారు. న్యాయం లభిస్తుంది. హింసను వ్యాపించేవారు ఎక్కడ ఉన్నా ఎఫ్‌బీఐ వదిలిపెట్టదు'' అని ఆ పోస్టులో పేర్కొన్నారు.

**నాడు అమెరికాలో దొరికినా వదిలేశారు..!**

హ్యాపీ పాసియా 27జనవరి 2022లో అమెరికాలోని అరిజోనా రాష్ట్రంలోకి ప్రవేశించాడు. నాడు ఆ దేశ బోర్డర్ పెట్రోల్ ఏజెంట్ అతడిని టక్సన్ సెక్టార్లో అరెస్ట్ చేశారు. ఆ తర్వాత రిమూవల్ ప్రొసీడింగ్స్‌లో ఉంచారు. కానీ, ఆ తర్వాత అతడిని వదిలేశారు. దీనిపై తాజాగా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అసిస్టెంట్ సెక్రటరీ ఫర్ పబ్లిక్ అఫైర్స్ ట్రైసియా మెక్లాఫ్లిన్ స్పందిస్తూ..''ఒక వాంటెడ్ టెర్రరిస్టును బైడెన్ కార్యవర్గం దేశంలోకి అనుమతించిది. చివరికి అతడిని బోర్డర్ పెట్రోల్ విభాగం అరెస్టు చేసినా విడిపించి దేశంలోకి పంపింది. బైడెన్ కార్యవర్గం అమెరికా కమ్యూనిటీల్లో ఇలాంటి ఉగ్రవాదులను పంపడం ఆశ్చర్యకరమేమీ కాదు. కానీ, ట్రంప్ కార్యవర్గంలోని నియోమ్ నాయకత్వంలో ఇలాంటి ఉగ్రవాదులను అమెరికా నుంచి ఏరివేస్తాం. వారిని వేటాడి అరెస్టు చేసి లాకప్‌లో పడేస్తాం'' అని పేర్కొన్నారు.

పంజాబ్‌లో పలు ఉగ్రదాడులకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్యాంగ్‌స్టర్, ఉగ్రవాది హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ హ్యాపీ పాసియా అలియాస్ జోరా (29)ను ఇటీవల అరెస్టు చేశారు. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ), అమెరికా వలస విభాగానికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ అధికారులు శాక్రమెంటోలో సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. నాడు ఈ విషయాన్ని ఎఫ్‌బీఐ ఎక్స్ వేదికగా వెల్లడించింది. అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన నిందితుడు హర్‌ప్రీత్.. అధికారులకు చిక్కకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు ఫోన్లు మార్చేసేవాడని పేర్కొంది. అయితే హర్‌ప్రీత్‌పై 14 గ్రనేడ్ దాడుల కేసులు సహా 16 ఉగ్రదాడుల కేసులు నమోదైనట్లు పంజాబ్ పోలీసులు వెల్లడించారు. గతేడాది సెప్టెంబరులో చండీగఢ్‌లోని ఓ ఇంటిపై జరిగిన గ్రనేడ్ దాడిలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) హర్‌ప్రీత్, పాకిస్థాన్ ఉగ్రవాది హర్విందర్ సింగ్ సద్దు అలియాస్ రిండా సహా నలుగురిపై అభియోగపత్రం దాఖలు చేసింది. హర్‌ప్రీత్‌పై రూ.5 లక్షల రివార్డును ప్రకటించింది. పలు ఘటనలకు సంబంధించి హర్‌ప్రీత్‌పై మొత్తం 33 ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయని, 10 సార్లు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ, ఖలిస్థానీ అంతర్జాతీయ ఉగ్రసంస్థ బబ్బర్ ఖల్సాలకు హర్‌ప్రీత్ సింగ్ సహకరించాడని అనుమానిస్తున్నారు.

# ట్రూడో నిష్క్రమణతో పుంజుకున్న లిబరల్ పార్టీ!

**ఒట్టావో, ఏప్రిల్ 22:** జస్టిన్ ట్రూడో నుంచి మార్క్ కార్నీ బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి లిబరల్ పార్టీకి క్రమంగా ప్రజాబలం పెరుగుతున్నట్లు పలు పోల్ సర్వేలు వెల్లడిస్తున్నాయి.

దశాబ్దకాలం పాటు కెనడాకు ప్రధానిగా ఉన్న జస్టిన్ ట్రూడోకు సొంత పార్టీ నుంచే తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రధాని పదవితో పాటు, పార్టీ నాయకత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో నూతన ప్రధాన మంత్రి మార్క్ కార్నీ నియమితులయ్యారు. అయితే ట్రూడో నిష్క్రమణ తర్వాత లిబరల్ పార్టీ తిరిగి పుంజుకున్నట్లు పలు ఒపీనియన్ పోల్స్ వెల్లడిస్తున్నాయి. పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో మార్క్ కార్నీ తనదైన మార్క్‌ను చూపిస్తున్నారని రాజకీయ నిపుణులు పేర్కొన్నారు. ట్రూడో నుంచి మార్క్ కార్నీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పార్టీకి ప్రజాబలం క్రమంగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఏప్రిల్ 28న కెనడాలో ఎన్నికలు జరగనున్నాయి.




నెల రోజుల క్రితం ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ కంటే చాలా వెనకబడిపోయిన లిబరల్స్ ఎన్నికలకు ముందు తిరిగి పుంజుకోవడంతో ఆ పార్టీ మరోసారి అధికారం చేపట్టే అవకాశం ఉన్నట్లు పోల్స్ పేర్కొంటున్నాయి. తాజాగా విడుదలైన నానోస్ పోల్స్ లిబరల్స్‌కు 43.7 శాతం ప్రజా మద్దతు లభించగా.. కన్జర్వేటివ్స్‌కు 36.3 శాతం మద్దతు ఉన్నట్లు వెల్లడించాయి. ఓటింగ్ రోజు వరకు ఈ మద్దతు ఇలాగే ఉంటే 343 మంది సభ్యులున్న కెనడియన్ పార్లమెంట్లో లిబరల్ పార్టీ అధిక మెజారిటీతో విజయం సాధించే అవకాశం ఉన్నట్లు అంచనా వేశాయి. కార్నీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి కెనడా అభివృద్ధి కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇందులోభాగంగా తమ దేశంపై అమెరికా అధ్యక్షుడు విధించిన టారిఫ్లను ధీటుగా ఎదుర్కోవడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. కెనడా అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకొని, తన ఆర్థికవ్యవస్థను పూర్తిగా పునర్నిర్మించుకోవాల్సిన అవసరం గురించి ప్రజలకు పిలుపునిచ్చారు. కెనడాను తమలో కలుపుకుంటామని అగ్రరాజ్యం చేస్తున్న బెదిరింపులను ఎదుర్కోవాలంటే దేశంలో బలమైన పార్టీ అధికారంలో ఉండాలని ఆయన పేర్కొన్నారు.

కెనడా పార్లమెంటులోని 338 స్థానాలకు ఏప్రిల్ 28న ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రధాని కార్నీ కెనడా రాజధాని ఒట్టావా నుంచి బరిలోకి దిగుతున్నారు. అతిపెద్ద వాణిజ్య భాగస్వాములైన కెనడా, మెక్సికో నుంచి వచ్చే దిగుమతులపై మార్చి 4 నుంచి అమెరికా 25శాతం సుంకాలు వసూలుచేస్తున్న సంగతి తెలిసిందే. వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణాను సరిహద్దుల్లోనే కట్టడి చేయడంలో విఫలమైతే కెనడా యూఎస్‌లో 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ ఆ దేశానికి హెచ్చరికలు చేశారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆ దేశంలో జరగనున్న ఎన్నికలు కీలకంగా మారాయి.

# ట్రంప్ పాలనా యంత్రాంగంపై హార్వర్డ్ వర్సిటీ దావా

**వాషింగ్టన్, ఏప్రిల్ 22:** హార్వర్డ్‌కు నిధులు నిలిపివేయడం ద్వారా ట్రంప్ విద్యాపరమైన నిర్ణయాలపై నియంత్రణ సాధించడానికి ప్రయత్నిస్తున్నారని విశ్వవిద్యాలయం అమెరికా ప్రభుత్వంపై కేసు దాఖలు చేసింది.

ట్రంప్ పరిపాలనా యంత్రాంగంపై హార్వర్డ్ విశ్వవిద్యాలయం కోర్టులో దావా వేసింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి 2.2 బిలియన్ డాలర్ల నిధులపై ట్రంప్ యంత్రాంగం ఇప్పటికే కోత విధించిన విషయం తెలిసిందే. తాజాగా మరో 1 బిలియన్ డాలర్ల నిధుల కోతకు అమెరికా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో హార్వర్డ్ ఈ దావా వేసింది. హార్వర్డ్‌కు నిధులు నిలిపివేయడం ద్వారా విద్యాపరమైన నిర్ణయాలపై నియంత్రణ సాధించడానికి ప్రయత్నిస్తున్నారని కేసు దాఖలు చేసింది. ట్రంప్ యంత్రాంగం లక్ష్యంగా చేసుకున్న ఇతర విద్యాసంస్థల పేర్లను కూడా



ఫిర్యాదులో పేర్కొంది.విశ్వవిద్యాలయానికి నిలిపివేసిన 2.2 బిలియన్ డాలర్లకు పైగా గ్రాంట్ నిధులను సమాఖ్య ప్రభుత్వం నిలిపివేయాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరింది. గత వారం హార్వర్డ్ తన చట్టవిరుద్ధమైన డిమాండ్లను పాటించడానికి నిరాకరించడంతో సమాఖ్య ప్రభుత్వం విశ్వవిద్యాలయంపై ఇటువంటి చర్యలు తీసుకుంటోం దని హార్వర్డ్ అధ్యక్షుడు అలాన్ గార్బర్ పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వారికి ఉన్న అధికారానికి మించినవి అయినందువల్ల తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని అన్నారు.

విదేశీ విద్యార్థుల అక్రమ, హింసాత్మక కార్యకలాపాల రికార్డులను సమర్పిస్తేనే కొత్తగా విదేశీయులను చేర్చుకునేందుకు అనుమతిస్తామని వైట్‌హౌజ్ గతవారం హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి స్పష్టం చేసింది. రికార్డులను సమర్పించకపోతే వర్సిటీకున్న ప్రవేశాల అర్హతను రద్దు చేస్తామని హెచ్చరించింది. ఈ పరిణామాలపై హార్వర్డ్ స్పందిస్తూ.. ప్రభుత్వ డిమాండ్లకు ఏమాత్రం తలొగ్గేది లేదని.. తమ స్వాతంత్ర్యం, రాజ్యాంగ హక్కుల విషయంలో రాజీ పడలేమని పేర్కొంది. తాము చట్ట ప్రకారమే నడుచుకుంటామని.. ప్రభుత్వ యంత్రాంగం కూడా వాటికి అనుగుణంగానే వ్యవహరించాలని కోరింది. ఈనేపథ్యంలోనే విశ్వవిద్యాలయానికి ఇచ్చే నిధులపై తాజాగా మరో 1 బిలియన్ డాలర్ల కోతకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం.



## అంబర్ కోటను సందర్శించిన జేడీ వాన్స్ దంపతులు

**జైపూర్, ఏప్రిల్ 22:** భారతదేశంలో పర్యటిస్తున్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ కుటుంబం రాజస్థాన్‌లోని అంబర్ కోటను సందర్శించారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం జెడీ వాన్స్ దంపతులు తమ కుమారులు ఇవాన్, వివేక్, కుమార్తె మీరాబెల్లతో జయపురలోని అంబర్ కోటను సందర్శించారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, డిప్యూటీ సీఎం దియాకుమార్ వారికి స్వాగతం పలికారు. చంద, పుష్ప అనే ఏనుగులతో వారికి ప్రత్యేక ఆహ్వానాన్ని ఏర్పాటుచేశారు. కోటలో ప్రదర్శించిన పలు రాజస్థానీ సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలను వీక్షిస్తూ.. వాన్స్ కుటుంబం కోటను సందర్శించారు. అనంతరం ఆయన రాష్ట్ర గవర్నర్ హరిభావు కిషన్‌రావ్ బగాడేతో సమావేశం, మధ్యాహ్నం రాజస్థాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రసంగించనున్నట్లు సమాచారం. సోమవారం ఢిల్లీ చేరుకున్న వాన్స్ కుటుంబం ప్రధాని నరేంద్రమోడీని కలిశారు. ఆయనతో విందు అనంతరం సోమవారం రాత్రికే జయపురలోని విలాసవంతమైన రాంబాగ్ ప్యాలెస్ హోటల్‌కు చేరుకున్నారు.

# ముర్షిదాబాద్ అల్లర్లకు బయటి వ్యక్తులే కారణం

- బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

**కోల్‌కతా, ఏప్రిల్ 22:** వక్ఫ్ సవరణ చట్ట వ్యతిరేక నిరసనలతో ఇటీవల ముర్షిదాబాద్‌లో పరిస్థితులు హింసాత్మకంగా మారడానికి బయటి వ్యక్తులే కారణమని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. వక్ఫ్ (సవరణ) చట్టం అమలుకు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్లో నిరసనలు ఉద్రిక్తంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ.. ముర్షిదాబాద్ అల్లర్లకు బయటి నుంచి వచ్చిన వ్యక్తులే కారణమని మండిపడ్డారు. బెంగాల్ సరిహద్దుల నుంచి అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశించిన కొందరు గూండాలు యువకులను రెచ్చగొట్టి ఉద్రిక్తతలకు కారణమయ్యారని ఆమె అన్నారు. ఈ హింసాకాండ వెనుక ఉన్న కుట్రదారులను త్వరలోనే ప్రజలముందుకు తీసుకువస్తానని అన్నారు. హింసలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున చెరో రూ.10 లక్షలు పరిహారం ఇస్తామని ప్రకటించారు. మే నెల మొదటి వారంలో అల్లర్లు జరిగిన ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తానని వెల్లడించారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న బంగ్లార్ బారి పథకం కింద వారి ఇళ్లను కూడా పునర్నిమిస్తామని హామీ ఇచ్చారు.

మనం Manam

Nalgonda నల్గొండ

# భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం

- సాదా బైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం
- భూ భారతి అవగాహన సదస్సులో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**పెన్ పహాడ్, ఏప్రిల్ 22 (మనం న్యూస్):** భూ సమస్యల పరిష్కారానికి గొప్ప వేదిక భూభారతి 2025 కొత్త ఆర్ ఓ ఆర్ చట్టమని భూభారతి కొత్త చట్టం ద్వారా సాదా బైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం ఉందని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఈ చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సత్యా గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ప్రభుత్వం నూతనంగా చేపట్టిన భూభారతి కొత్త ఆర్వోర్ చట్టంపై ప్రజలకు, రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు ధరణి పోర్టల్ ద్వారా సామాన్య రైతులకు రెవెన్యూ అధికారులు న్యాయం చేయలేకపోయారని తెలిపారు. ధరణి పోర్టల్ లోని వివాదాస్పద అంశాలను తొలగించిన ప్రభుత్వం మరిన్ని సవరణలు చేయడం వల్ల పేదోడు భూములకు రక్షణగా ఈ చట్టంనిలిచిపోనుందన్నారు ఈ కొత్త చట్టం వల్ల రైతులు చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు అణువుగా ఉంటుందన్నారు. ఈ పోర్టల్ లో చిన్న చిన్న తప్పులను కూడా సరిచేసుకునే వెసులుబాటు కల్పించారని, రైతులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి దరఖాస్తులకు పరిష్కారం చూపే విధంగా కొత్త చట్టం ఉందన్నారు. రైతులు ప్రతి చిన్న విషయాలకు కలెక్టర్ ను,కోర్టులను ఆశ్రయించే వారని, వారసత్వం,భూ హద్దులు, తదితర అంశాలపై ప్రజలకు పూర్తి న్యాయం భూభారతి ద్వారా జరుగుతుందని తెలిపారు ఈ చట్టం ద్వారా సాదా బైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం ఉందని తెలిపారు ఈ సదస్సులో మహమ్మదాపురం, భక్తలాపురం గ్రామాల మహిళలు తమ భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా త్వరలో గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు. సదస్సు ప్రారంభానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు మాజీ మార్కెట్ చైర్మన్ తూముల భుజంగరావు మాట్లాడుతూ మండల కేంద్రంలో భూభారతిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి అధికారులకు మండల రైతులు, ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో పిఏసిఎస్, అనాజిపురం ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్, అధికారుల బృందం సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాంబాబు, ఆర్ డి ఓ వేణు మాధవ రావు, స్థానిక ఇన్చార్జి తహశీల్దార్ ధరావత్ లాలునాయక్, ఎంపీడీవో జే. వెంకటేశ్వరరావు, సూర్యాపేట తహశీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ నాయక్, ఎస్సై కస్తాల గోపికృష్ణ, ఏపీఎం అజయ్ నాయక్, టి పి సి సి కార్యదర్శి,మాజీ మార్కెట్ చైర్మన్ తూముల భుజంగరావు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, సిబ్బంది, పిఏసిఎస్ సిబ్బంది సైదులు, ఆయా గ్రామాల రైతులు,ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి భూ భారతి

### సూర్యాపేటలో..

సూర్యాపేట, ఏప్రిల్ 22 (మనం ప్రతినిధి)భూ భారతి చట్టం -2025 ను అమలు పర్చటం ద్వారా అధికారులు వికేంద్రికరణ జరుగుతాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని సుమంగళి పంక్షన్ హాల్, పెన్ పహాడ్ పంక్షన్ హాల్ లో భూ భారతి చట్టం 2025 పై అవగాహన సదస్సు కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు



తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జ్యోతి ప్రజ్వలన చేసి తెలంగాణ గీతాలాపన చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... తెలంగాణ ప్రభుత్వం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి రోజున భూ భారతి చట్టం అమలులోనికి తీసుకొని రావటం జరిగిందని పేర్కొన్నారు . రాష్ట్ర స్థాయి లో, జిల్లా స్థాయి లో రెవిన్యూ సిబ్బందికి అవగాహన కల్పించటం జరిగిందని ఇప్పుడు మండల స్థాయి లో భూ సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో తెలుసుకునేందుకే ప్రజలకి చట్టం పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. జిల్లాలోని 23 మండలాలలో సదస్సు లు నిర్వహిస్తున్నామని ధరణిలో చాలా సమస్యలు పరిష్కరించలేనివి ఉన్నాయని ప్రతి సమస్య కలెక్టర్ ద్వారా గానీ కోర్టు ద్వారా గానీ పరిష్కరించే విధంగా ఉండేదని ప్రతి ఒక్కరు గ్రామం నుండి సూర్యాపేట వచ్చి సమస్య పై దరఖాస్తు ఇవ్వాలంటే ప్రజలకి చాలా ఇబ్బందిగా ఉండేదని కానీ భూ భారతి చట్టం ద్వారా అధికారం వికేంద్రికరణ జరుగుతుందని వెల్లడించారు. ఫిర్యాదు దారుల సమస్యని బట్టి తహసీల్దార్, ఆర్ డి ఓ, కలెక్టర్ స్థాయి లో పరిష్కరించవచ్చు అని త్వరలో గ్రామ స్థాయి లో భూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ పరిపాలన అధికారి (జి పి ఓ) నియమించబోతున్నామని దీనితో గ్రామ స్థాయి లో ప్రభుత్వ భూములకి రక్షణ ఏర్పడుతుందని అన్నారు.భూ భారతి చట్టం-2025 ఏప్రియల్ 14 న ప్రారంభించి నాలుగు మండలాలలో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు జరుగుతుందని తర్వాత ప్రతి జిల్లాలో ఒక్క మండలంలో అమలు చేస్తారని తదుపరి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామం లో భూ భారతి చట్టం అమలు జరుగుతుందని తెలిపారు. సెక్షన్ 13 ద్వారా గ్రామ రెవిన్యూ రికార్డులు గతంలో రికార్డులు జమబంది చేసే వారని ధరణి లో రద్దు చేసారని ఇప్పుడు ప్రతి సంవత్సరం గ్రామ లెక్కలలో మ్యుటేషన్ జరిగిన ప్రతి సారి మార్పులు జరుగుతాయి.అలాగే ప్రతి సంవత్సరం డిసెంబర్ 31 న ప్రతి గ్రామంలో ప్రతి రైతు కి 1 బి అందజేస్తామని ఏమైనా తప్పులు ఉంటే సరి చేస్తామని తెలియజేశారు.భూమిలకు ఆధార్ వల్లే భూధార్ అనే యూనిక్యూ నెంబర్ ఇచ్చి ప్రతి భూమికి సరిహద్దులు నిర్ణయించి సర్వే మ్యాప్ ని భూ భారతి పోర్టల్ లో అప్డేట్ చేస్తామని తదుపరి ప్రజలు పోర్టల్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు అని తెలి పారు.రాబోయే రోజులలో భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవిన్యూ అధికారులు కృషి చేస్తారని అన్నారు.సెక్షన్ 4 ద్వారా (1971 ఆర్ ఓ ఆర్ చట్టం)రికార్డులో తప్పుల సవరణ, భూమి పై ఉండి రికార్డులో నమోదు లేకపోతె దరఖాస్తు చేసుకోవాలని, ధరణిలో ఈ అవకాశం లేదని

సెక్షన్ 5 ద్వారా వ్యవసాయ భూముల కొనుగోలు, గిఫ్ట్, తనఖ బదిలీ లు, బాగపంపకాలు ద్వారా తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి మ్యుటేషన్ చేసి హకులు రికార్డులలో నమోదు చేసి పాస్ పుస్తకం జారీ చేయడం జరుగుతుందని తెలిపారు.స్లాట్ బుకింగ్ సామాన్యులు కూడా బుక్ చేసే విధంగా ఈ చట్టం రూపొందించారు.

సెక్షన్ 7 వారసత్వంగా వచ్చిన భూములు పౌతి చేసేటప్పుడు కుటుంబ సభ్యులకి నోటీసులు జారీ చేసి వారం వెయిటింగ్ పీరియడ్ ఉంటుందని ఈ సమయంలో కుటుంబ సభ్యులు అభ్యంతరాలు చేయవచ్చు అని ఏమి అభ్యంతరాలు లేకపోతే తహసీల్దార్ మ్యుటేషన్ చేస్తారని ఒకవేళ తహసీల్దార్ మ్యుటేషన్ చేయకపోతే 30 రోజులలో ఆటోమేటిక్ గా డీమ్డ్ మ్యుటేషన్ జరుగుతుందని స్పష్టం చేశారు.సెక్షన్ 8 ద్వారా సివిల్ రెవిన్యూ కోర్ట్,లోక్ అదాలత్ అసైన్మెంట్, 38 ఈ, 13 బి, ఓ ఆర్ సి, సేల్ సర్టిపికెట్ మొదలగు వాటి గురించి ఆర్ డీ ఓ కి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సెక్షన్ 6 ద్వారా సాదా బైనమా ద్వారా క్రమబద్దికరణ 2014 జూన్ 2 కంటే ముందు సాదా కాగితం ద్వారా కొనుగోలు చేసిన వారు భూమి పై 12 సం. లు కబ్జా లో ఉండి 2020 అక్టోబర్ లో ధరఖాస్తు చేసుకున్న వారు ఆర్ డీ ఓ విచారణ చేసి ప్రస్తుత స్టాంప్ డ్యూటీ చెల్లించి హక్కుల రికార్డ్ లో నమోదు చేసి పాస్ బుక్ జారీ చేయడం జరుగుతుందని అదేవిధంగా సెక్షన్ 15 ద్వారా అప్పీల్ వ్యవస్థతహసీల్దార్ లు చేసిన మ్యుటేషన్ లపై ఆర్ డీ ఓ కి, ఆర్ డి ఓ చేసిన మ్యుటేషన్ లపై కలెక్టర్ కి అప్పీల్ చేసుకోవచ్చు అని తెలిపారు. ధరణిలో అప్పీల్ వ్యవస్థ లేదు కోర్ట్ లను ఆశ్రయించాల్సిందే. భూ భారతి చట్టం పై పిపిటి ద్వారా ప్రజలకి కలెక్టర్ వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... గత నాలుగున్నర సంవత్సరాలుగా ధరణిలో చాలా సమస్యలు ఉన్నాయని ప్రజలు కలెక్టర్ కార్యాలయ చుట్టూ తిరిగారని అప్పుడు అధికారులు ఏమి చెయలేకపోయారని ధరణి వైఫల్యాలు సరిదిద్ది పారదర్శకంగా గౌరవ ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా భూ భారతి చట్టం ఏప్రియల్ 14 నాడు ప్రారంభం జరిగిందని ,సాధాబైనామా ధరఖాస్తులు ధరణిలో పరిస్కారం కాలేదని భూ భారతిలో సాధాబైనామ ధరఖాస్తులు పరిశీలించి క్రమబద్దికరిస్తామని గతంలో గ్రామ స్థాయి లో వి ఆర్ ఓ, వి ఆర్ ఎలుండెవరని ధరణి అమలు తర్వాత గ్రామాలలో అధికారులు లేరని, భూ భారతిలో పలు సమస్య లు మండల స్థాయి లో పరిస్కారం అవుతాయని తెలిపారు. ఈ చట్టంలో. రైతుల భూమి రికార్డులలో భద్రంగా ఉంటుందని,ప్రజలు కోర్ట్ లు చుట్టూ తిరగకుండా అప్పీల్ వ్యవస్థ రూపొందించరని తెలిపారు. రెవిన్యూ అధికారులు ప్రజలకి సహకరిస్తు వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్న యాదవ్ మాట్లాడుతూ భూ భారతి చట్టం రైతన్నల చుట్టం అని ,ధరణి తో అధికారులు, రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని ధరణి లోని వైఫల్యాలను ఏలా త్వరగా పరిష్కరించాలో నిపుణులు, మేధావులతో కమిటీ ఏర్పాటు చేసి, ప్రజల నుండి సలహాలు సూచనలు తీసుకొని మెరుగైన చట్టం రూపొందించారని పేర్కొన్నారు.ఇక భూసమస్యలన్ని పరిష్కారమవుతాయని తెలియజేశారు.సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా పేదల భూములకి పటిష్టమైన భద్రత దొరుకుతుందని, ప్రజా ప్రభుత్వం మొదటి నుండి రైతుల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తుందని కొనియాడారు.ఈ సమావేశం లో ఆర్ డి ఓ వేణుమాధవ రావు,తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, లాల్ నాయక్, ఎంపిడిఓ లు బాలకృష్ణ రెడ్డి, వెంకటేశ్వర్లు,,పి ఎ సి ఎస్ చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



**తుంగతుర్తి, ఏప్రిల్ 22(మనం న్యూస్):** తుంగతుర్తి మండలం వెంపటి ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్తలూరి వెంకట్రామ నరసమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు కృషి చేయడం మాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు పలు క్రీడల్లో విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. తదనంతరం విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక కళా రూపాలను ప్రదర్శించారు. దేశభక్తి ,జానపద పాటలకు నృత్యాలు చేస్తూ చూపరులను ఆకట్టుకున్నారు. రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి స్వాతంత్రోద్యమ చారిత్రక పాత్రలకు ఏకపాత్రాభినయం చేసి చూపరులను ఆలోచింపజేశారు. అలాగే సోది చెబుతాం, మాయల మాంత్రికుడు, ప్లాస్టిక్ భూతం ,చాకలి ఐలమ్మ వంటి నాటికలను అద్భుతంగా వేసి చూపరులచే ఔరా అనిపించుకున్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు పాఠశాల ప్రత్యేకతను తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలు అందిస్తున్నామని నాణ్యమైన విద్య అందుతుందని దానికోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ,ఉన్నత అర్హతలు గల ఉపాధ్యాయులు పాఠశాలలో బోధిస్తున్నారని, అనేక రకాల పోటీ ప్రవేశ పరీక్షలకు తరగతుల వారీగా శిక్షణ ఇస్తున్నామని ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో క్రీడా పాఠశాల మరియు గురుకుల, సైనిక పాఠశాల ఆదర్శ పాఠశాలలో సీట్లు సాధిస్తున్నామని తెలియజేశారు. విద్యార్థుల లక్ష్యాలను నిర్దేశించుకుని అత్యున్నత శిఖరాలను చేరుకోవాలని క్రమశిక్షణతో రాణించి పాఠశాల పేరు ప్రఖ్యాతలను రాష్ట్రస్థాయిలో ఇనుమడింప జేయాలని విద్య, క్రీడలు ఇతర రంగాల్లో రాణిస్తేనే మంచి గుర్తింపు లభిస్తుందని పాఠశాలల విద్యనుభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకున్న పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాలకుర్తి ఎల్లయ్య, మల్లెపాక రవీందర్, గట్టు మాధవి, బండారు భవాని ,నిమ్మనబోయిన నవీన, జీడి అనిల్ కుమార్, మిట్టగడుపుల విక్రమ్ ,మాలోతు కృష్ణ, గుండ్ల ఆంజనేయులు ,రమాదేవి అబ్బగాని మంజుల తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**పెన్ పహాడ్ ఏప్రిల్ 22 (మనం న్యూస్):** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూడాలని సూర్యపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అన్నారు మంగళవారం మండల కేంద్రంలోని పిఎసియస్, అనాజిపురం గ్రామంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం ఎగుమతులు, దిగుమతులు వేగవంతం చేయాలని, కేటాయించిన మిల్లుల వల్ల ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని తరలించేందుకు లారీలను అధికంగా వాడుకోని రవాణా చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. కార్య క్రమంలో ఆర్ డి ఓ వేణు మాధవ రావు పాల్గొన్నారు.



## ఐకెపి కేంద్రాల తనిఖీ

**తిరుమలగిరి ఏప్రిల్ 22(మనం న్యూస్):** తిరుమలగిరి మండలంలోని తొండ, సిద్ధి సముద్రం ఐకెపి కేంద్రాలను తహసిల్దార్ హరిప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కేంద్ర నిర్వాహకుల పుస్తకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీసీ విజయలక్ష్మి,మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, వివోఏ సంధ్య పాల్గొన్నారు.



## హెడ్ కానిస్టేబుల్ మృతికి సంతాపం

**తిరుమలగిరి, ఏప్రిల్ 22(మనం న్యూస్):** తిరుమలగిరి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న, హెడ్ కానిస్టేబుల్ డి.రమేష్ రాథోడ్, విధులు నిర్వర్తిస్తూ ఈనెల 13న గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్ లో పెద్ద కర్మ సందర్భంగా, అతని మృతికి ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది సంతాపంగా తెలిపారు. అకాల మరణం పొందిన హెడ్ కానిస్టేబుల్ రమేష్ రాథోడ్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగారం సిఐ ఈ.రఘువీర్ రెడ్డి, తిరుమలగిరి యస్.ఐ సిహెచ్. వెంకటేశ్వర్లు, పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరు



కలసి మొత్తం రూ 60వేలు ఆర్థిక సహాయం వారి కుటుంబ సభ్యుల కు అందిచారు.

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

**సూర్యాపేట, ఏప్రిల్ 22 (మనం ప్రతినిధి):** మునగాల పోలీస్ స్టేషన్ పరిధి ముకుందాపురం సమీపంలోని జాతీయ రహదారి 65 పై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ రాంబాబు భౌతికకాయానికి మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్ యందు పూలమాలవేసి పోలీస్ శాఖ తరపున ఘనంగా నివాళులర్పించారు, ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ....రాంబాబు మరణించడం చాలా బాధాకరం అని దహన సంస్కారాల నిమిత్తం కానిస్టేబుల్ కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు. రాంబాబు కుటుంబాన్ని పోలీస్ శాఖ అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా కల్పించారు. మృతిచెందిన కుటుంబానికి ప్రభుత్వం అదేవిధంగా పోలీసు శాఖ ద్వారా రావలసిన అన్ని రకాల ఆర్థిక తోడ్పాట్లను, ప్రభుత్వ సహాయంతో అందించే కారుణ్య నియామక ఉద్యోగం త్వరగా



వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ వెంట మునగాల సి ఐ.రామకృష్ణా రెడ్డి, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు, పోలీసు సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, మునగాల ఎస్సై ప్రవీణ్ కుమార్, కోదాడ ట్రాఫిక్ ఎస్సై మల్లేశం, పోలీసు సిబ్బంది, మృతుని బంధువులు ఉన్నారు.

# బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

**తుంగతుర్తి ,ఏప్రిల్ 22(మనం న్యూస్):**ఎల్కతుర్తి మట్టిని తాకి... రజితోత్సవ సభను తిలకించి ...కేసీఆర్ మాటలు వినాలన్న రైతుల తపన ఈ వరంగల్ సభ తెలంగాణ రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అని రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు గుజ్జ యుగేందర్రావు అన్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఈనెల 27న వరంగల్లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజితోత్సవ సభను విజయవంతం చేయాలని ఆయన ముఖ్య కార్యకర్తలను కోరారు. చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా బిఆర్ఎస్ రజితోత్సవ సభ జరగబోతుందన్నారు .24 ఏళ్లు పూర్తి చేసుకొని 25 వ, వసంతంలోకి అడుగుపెడుతున్న బిఆర్ఎస్ పార్టీ బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ సారథ్యంలో జరగనున్న 25 ఏళ్ల బిఆర్ఎస్ పండుగ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. రైతాంగం తో పాటు అన్ని రంగాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి తప్పు చేశామని తెలుసుకున్నారని అప్పుడు నీడలో ఉన్న వాళ్ళం ఇప్పుడు ఎండలో నిలనబడ్డామనే బాధతో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పై కోపంగా ఉన్నారన్నారు. దండగ అనుకున్న వ్యవసాయాన్ని



పండగలగా మార్చిన ఘనత కేసీఆర్ దే అన్నారు .అటువంటి దేవుడు లాంటి కేసీఆర్ ను వదులుకున్నామన్న బాధలో ప్రజలంతా ఉన్నారని అందుకే కేసీఆర్ మీద అభిమానంతో బిఆర్ఎస్ రజితోత్సవ సభకు రైతాంగం ప్రజలంతా హాజరై ఈ సభను కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా ఈ సభను జరుపుకోవాలని భావిస్తున్నామన్నారు. ఎల్కతుర్తి మట్టిని తాకి ....రజితోత్సవ సభను తిలకించి ....కేసీఆర్ మాటలు వినాలన్న రైతుల తపన ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. కేసీఆర్ పైన రైతాంగం చూపుతున్న అభిమానాన్ని చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ మీద వారికి ఎంత వ్యతిరేకత ఉందో అర్థం అవుతుందన్నారు. కొండంత అభిమానంతో పాటు సాహసోపేతమైన యాత్రగా ప్రజలంతా తరిరావాలని తెలియజేశారు .ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బండారం బయటపడిందని ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టి కాలం గడుపుతుందని ఆయన అన్నారు. ఈ రాష్ట్రానికి మళ్ల ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటానని ఆయన అన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను పక్కనపెట్టి కాంగ్రెస్ పార్టీ పబ్బం గడుపుతుందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో టిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరబోతుందని తెలియజేశారు ప్రతి కార్యకర్త మరో కార్యకర్తను సభకు తీసుకురావాలని కోరారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య ,జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్ ,దుర్గయ్య , తునికిసాయిలు, దొంగరి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం పాల్గొన్నారు.

### రజతోత్సవ సభకు తరలి రండి

**నేరేడుచర్ల, ఏప్రిల్ 22 మనం న్యూస్:** ఈనెల 27న వరంగల్ నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు హుజూర్ నగర్ నియోజకవర్గం నుండి వేలాదిగా తరలి రావాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఒంటెద్దు నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో మంగళవారం నేరేడుచర్లలో ... చలో వరంగల్ గోడ పెయింటింగ్ ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అద్యక్షులు అరిబండి సురేష్ బాబు, డిసిసిబి డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, సీనియర్ నాయకులు చెన్నబోయిన సైదులు,మాజీ మున్సిపల్ చైర్మన్ చందమల్ల జయబాబు, మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు, ఉపాధ్యక్షులు వస్కుల సుదర్శన్, రాపోలు నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో మోడల్ స్కూల్ విద్యార్థుల హవా

**పెన్ పహాడ్ ఏప్రిల్ 22 (మనం న్యూస్):** మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మండల పరిధిలోని అనాజిపురం మోడల్ స్కూల్ విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించి తమ హవ్వనుసాటారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రిన్సిపల్ కోడి లింగయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి ఇంటర్ రెండవ సంవత్సరం ఫలితాల్లో బైపీసీలో బి. భూమిక 981/1000 ప్రథమ స్థానాన్ని, బి. స్రవంతి 967/ 1000 ద్వితీయ స్థానాన్ని ఎంపీసీలో బి. యుగేందర్ 943/1000 ప్రథమ స్థానాన్ని, సీఈసీలో జి. అర్చన 904/ 1000 ప్రేదమ స్థానంలో నిలిచారని అదేవిధంగా ఇంటర్ మొదటిసంవత్సరంలో ఎంపీసీలో టీ. వంశీక 457/ 470 ప్రథమ స్థానాన్ని, యస్. మహాలక్ష్మి 453 /470 ద్వితీయ స్థానాన్ని,బైపీసీలో యం. ప్రతీక. 393/440 ప్రథమంగా, సీఈసీలో ఎన్. రమ్య 343/ 500 ప్రథమ స్థానాన్ని సాధించి ఉత్తమంగా నిలిచారని తెలిపారు ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయనతో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



# పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక

- రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**వరంగల్ /ములుగు,ఏప్రిల్ 22 (మనం ప్రతినిధి)**: పేదల సొంతింటి కల నిజం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడత లబ్ధిదారుల ఎంపికను అధికారులు పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర సీఎస్ శాంతి కుమారి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌతమ్ లతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి పై కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పేదవాడు సొంత ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రజా ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలను ఉచితంగా సబ్సిడీ కింద అందిస్తుందని, దేశంలో మరే రాష్ట్రంలో ఇంత పెద్దన సాయం అందడం లేదని, మిగిలిన రాష్ట్రాల్లో లక్షన్నర నుంచి 3 లక్షల వరకు ప్రభుత్వాలు సహాయం చేస్తుంటే మన తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలను అందిస్తుందని మంత్రి తెలిపారు.ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి విడత లో 3 వేల 500 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతి పర్యవేక్షించేందుకు నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని అన్నారు. మనకు వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు, జనాభా ఆధారంగా గ్రామాలకు, మున్సిపల్ వార్డులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పూర్తి చేయాలని అన్నారు.గ్రామాలు, మున్సిపల్ వార్డులో ఉన్న ఇందిరమ్మ కమిటీల ద్వారా ఇందిరమ్మ ఇండ్లకు అర్హుల జాబితా ఎంపిక చేయాలని, ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇండ్లకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి ఏప్రిల్ 30 లోపు మరో సారి ఫీల్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి నాణ్యతతో పారదర్శకంగా జరగాలని, ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే మంజూరు చేసే జాబితా నుంచి తొలగించాలని అన్నారు.ప్రతి మండలంలో ఎంపిక చేసిన పైలెట్ గ్రామంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లలో బేస్మెంట్ లెవల్ పూర్తి చేసుకున్న వారికి మొదటి విడత కింద లక్ష రూపాయలను ఇటీవలే విడుదల చేశామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పెద్ద సంఖ్యలో గ్రౌండ్ అవుతున్న నేపథ్యంలో ఎక్కడ సామాగ్రి ధరలు అనుభవంగా పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాపారులు ఎక్కడ కృత్రిమ కొరత సృష్టించకుండా చూడాలని మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చూడాలని, బలహీన వర్గాల ఇంటి నిర్మాణానికి ఉచితంగా సరఫరా చేయాలని ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నందున, ప్రతి మండల కేంద్రంలో ఇసుక అందుబాటులో పెట్టాలని మంత్రి తెలిపారు. మండలంలో నిర్మించిన మోడల్ ఇండ్లు నమూనాలను లబ్ధిదారులకు చూపించాలని మంత్రి అధికారులకు సూచించారు. పేదలకు ఇంటి నిర్మాణంలో ప్రతి దశ లోను అధికారులు సహాయం అందించాలని మంత్రి పేర్కొన్నారు.వర్షాకాలం ప్రారంభం కంటే ముందే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని అన్నారు. 5 లక్షల రూపాయల వరకు సబ్సిడీ ఇస్తున్నందున అత్యంత నిరు పేదలకు మొదటి విడతలో ఎంపిక చేయాలని అన్నారు. సివిల్ ఇంజనీరింగ్ లో అత్యుత్తమ మార్కులు వచ్చిన యువకులను తాత్కాలిక ప్రాతిపదికన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఇంజనీర్లుగా నియమిస్తున్నామని, వీరికి అవసరమైన శిక్షణ అందించి త్వరలోనే మండలాలకు కేటాయిస్తామని మంత్రి తెలిపారు.ప్రతి మండలంలో జరిగే ఇందిరమ్మ ఇండ్ల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలియజేస్తూ సదరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల సహాయం త్వరగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలలో స్లం ఏరియాలో జి+3 మోడల్ లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించేందుకు వీలుగా లబ్ధిదారులు ముందుకు వస్తే రాబోయే విడత లలో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు.భూ భారతి చట్టం మన రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద 4 మండలాలలో ముందస్తుగా అమలు చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాలలో ఈ చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి సూచించారు. 4 మండలాలో రెవెన్యూ సదస్సులు పూర్తిచేసుకున్న తర్వాత అందులో నుంచి వచ్చిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి జిల్లాలో ఒక మండలం నుంచి తహసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్ వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రతి జిల్లాకు అవసరమైన సర్వే సామాగ్రి అందించడం జరుగుతుందని అన్నారు. భూ భారతి చట్టాన్ని క్షేత్రస్థాయిలో తూచ తప్పకుండా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లు, జిల్లా స్థాయి ఉన్నతాధికారుల పై అధికంగా ఉంటుందని అన్నారు.ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రజలకు భారం కాకుండా 25% రాయితీని అందించామని, దీనినే ముఖ్యమంత్రి ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించారని అన్నారు. మరోసారి ఎల్.ఆర్.ఎస్ 25% రాయితీ గడువు పొడిగింపు ఉండదని, ఈ అంశాన్ని ప్రజలకు విస్తృతంగా తీసుకుని వెళ్లి, ఆమోదం పొందిన దరఖాస్తుల ఫీజులు వసూలు చేసి క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గణపతి, జిల్లా సహకార అధికారి నీరజ, ఆర్డీఓ లు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జిడబ్ల్యూఎంసీ ఉప కమిషనర్ ప్రసన్న రాణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదలతో ఉన్నత స్థానాలకు ఎదగాలి



- మంత్రి ధనసరి అనసూయ సీతక్క

**ములుగు, ఏప్రిల్ 22, మనం ప్రతినిధి:** ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో రాష్ట్రంలోనే ములుగు జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం హర్షించదగ్గ విషయమని, విద్యార్థినీ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జరిగిన సమావేశంలో మంత్రి ఇంటర్మీడియట్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా కలెక్టర్ తో పాటు విద్యాశాఖ అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు నూతన పరిజ్ఞానంతో విద్యను అందించడంతో పాటు కంప్యూటర్ పై అవగాహన కల్పించడానికి అన్ని పాఠశాలలకు కంప్యూటర్లను మంజూరు చేయడం జరిగిందని, పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా నూతన విద్య బోధనను అందించడం జరుగుతున్నదని అన్నారు. విద్యను బోధించే ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థిని విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండే విధంగా అవగాహన కల్పించాలని, పిల్లల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. విద్యలో రాణించినప్పుడే బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందని తెలిపారు.

## కళ్యాణ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

**మంగపేట, ఏప్రిల్ 22, మనంన్యూస్:** శ్రీ హేమాచల లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర పంచాయ తీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. మంగళవారం మంగపేట మండల మల్లూరు గ్రామం లోని శ్రీ హేమాచల లక్ష్మీ నృసింహస్వామి దేవా లయం లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఏ ఎస్ పి శివం ఉపాధ్యాయ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారుల తో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మే 8వ తేది నుండి 17 వరకు శ్రీ హేమాచల లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణ బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, పారిశుద్ధ్యం, త్రాగునీటి పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పార్కింగ్ స్థలాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సైన్ బోర్డులు, త్రాగునీరు, టాయిలెట్ తదితర అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగాలన్నారు. భక్తులకు చేపడుతున్న సౌకర్యాల కల్పనలో రాజీపడవద్దని, ప్రతి అంశంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. దర్శనం కోసం క్యూ లైన్ లు, లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం మంత్రి కళ్యాణ బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఓ, ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా అధికారులు, మండల అధికారులు, పూజారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# భూ సమస్యల సత్వర పరిష్కారానికి భూ భారతి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



**నర్మెట ఏప్రిల్ 22 మనం న్యూస్:** భూ సమస్యల సత్వర పరస్కారానికి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తెచ్చినట్లు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాష తెలిపారు. మంగళవారం నర్మెట్ట మండల కేంద్రం కేఎస్ఆర్ గార్డెన్లో ఏర్పాటు చేసిన భూభారతి ( భూమి హక్కుల రికార్డ్ చట్టం) 2025 అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. భూ భారతి చట్టంలోని సెక్షన్ వాటి వివరాలను రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పనలో ప్రజలు అడిగిన సమస్యలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 2025 రోజున భూభారతి అమలోకి వచ్చిందని, భూ భారతి చట్టంతో రైతు భూములకు రక్షణ లభిస్తుందని అన్నారు. రైతులు ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారానికి ఇంద్రుల కంటితో వివిధ రాష్ట్రాలలో అధ్యయనం చేసి ప్రతిష్టమైన చట్టాన్ని రూపొందించి అమ్మలోకి తెచ్చిందని తెలిపారు. ప్రత్యేకించి రైతులకు భూములపై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొన్నారని కానీ భూభారతి చట్టం ద్వారా అన్ని సమస్యలు సులభంగా పరిష్కరించడానికి అవకాశం ఉందా అని అన్నారు. భూ సమస్యలపై రైతులు మీ సేవలో దరఖాస్తు చేసుకోవచ్చని ఏదైనా సమస్య పరిష్కారానికి దరఖాస్తు చేస్తే నిర్దేశించిన సమయంలో పరిష్కరిస్తామని తెలిపారు. ధరణిలో అప్పీల్ చేయడానికి అవకాశం లేదని సివిల్ కోర్టుకు వెళ్లాలని కానీ భూభారతి చట్టంలో తాహసిల్దార్ నుండి ఆర్డిఓ, ఆర్డిఓ నుండి కలెక్టర్, కలెక్టర్ నుండి ట్రిబ్యునల్ నకు వెళ్లడానికి అవకాశం కల్పించారని అన్నారు. అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 2025 నుండి ఏప్రిల్ 14, 2026 వరకు దరఖాస్తు చేసుకున్నచో సమస్యలు పరిష్కరించబడతాయని అన్నారు. ఇది ఒక సంవత్సరం వరకు ఉంటుందని అన్నారు. ప్రతి ఏడాది భూ భారతి చట్టంలోని నిబంధనల ప్రకారం రికార్డులను నవనీకరణ చేస్తారని తెలిపారు. రైతులు ఇకపై బ్యాంకు రుణాలకు వెళ్లినప్పుడు భూములకు సంబంధించిన దృవీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని, భూభారతి పోర్టల్ లోని రికార్డులు ఆధారంగా బ్యాంకర్లు రుణాలు ఇస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, సాదా బైనామాకు సంబంధించిన వివరాలు అన్నిటినీ రైతులు ఇతర రైతులతో కలిసి పరిష్కరించుకోవాలి, చట్టంపై ప్రతి ఒక్కరు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏమైనా సమస్యలు వస్తే పరిష్కరించుకోవడానికి అవకాశం ఉందా అని ఒకవేళ రైతులకు ఎవరికైనా న్యాయ సాయం అవసరం అయితే ప్రభుత్వ పరంగా ఉచిత న్యాయ సాయాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ చట్టంతో భూములకు హక్కులు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామని భూమి వివరాలను కూడా మ్యాపులు పొందుపరచడం జరుగుతుందని తెలిపారు. ధరణి నుంచి కొత్త పోర్టల్ భూ భారతి కి మారుతున్నందున రెవెన్యూ అధికారులు సమగ్రమైన స్పష్టమైన ఆహ్వాన కలిగి ఉండాలని ఎలాంటి లోటు పాట్లు ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్లడానికి పైలెట్ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో నాలుగు మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఈ చట్టాన్ని పసిస్తుంగా ఆ పని చేయాల్సిన గురుత్తర బాధ్యత మనందరిపై ఉందా అని అందరూ కలిసి ప్రభుత్వ ఆశాలను నెరవేర్చాలని సూచించారు. జిల్లాస్థాయిలో అన్ని మండలాల్లో చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై చట్టం అట్లా అవగాహన పెంచుకోవాలని తెలిపారు. భూ వివాదాల పరిష్కారానికి భూ భారతి చట్టం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా సాయం కోసం తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని సూచించారు. గతంలో ధరణిలో రికార్డుల నిర్వహణ లేదని ఇప్పుడు రికార్డుల నిర్వహణ ఉంటుందని, భూమి కలిగిన ప్రతి రైతుకు ఆధార్ కార్డు లాగే భూదార్ కార్డు జారీ చేస్తామని అన్నారు. గతంలో ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే అప్పీల్ వ్యవస్థ లేదని, ఎప్పుడు రెండు అంచల ఆపిల్ వ్యవస్థ ఉందని, ప్రతి అంశం భూ భారతి పోర్టల్ ఉంటుందని, ఎవరైనా వారి భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవచ్చు అని తెలిపారు. భూమి ఆకుల రికార్డు నిర్వహణతో ఎవరు భూమికి యజమానో స్పష్టత వస్తుందని అన్నారు. భూమి హక్కుల రికార్డులు భూభారతి పోర్టల్లో అందరికీ అందుబాటులో ఉంటాయన్నారు. ఎవరైనా భూ హక్కుల రికార్డు సర్టిఫై కాపీ కావాలంటే భూభారతిలో ఉన్న ఫారంలో దరఖాస్తుకు పది రూపాయలు ఫీజ్ చెల్లిస్తే తహసిల్దార్ సర్టిఫైడ్ కాపీ జారీ చేస్తారని అన్నారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన సందేహాలు సమస్యలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, ఆర్డిఓ గోపి రామ్, ఎస్ బి సి అడిషనల్ కలెక్టర్ సువాసిని, తహసిల్దార్ రామంజచారి, ఎంపీడీవో అరవింద్, ఏవో మనోహిత్, డిటి వెంకటేష్, ఆర్ ఐ సాయిబాబా, రెవిన్యూ సీనియర్ అసిస్టెంట్ యాదయ్య, బచ్చన్నపేట డిటి ఫణి కిషోర్, ఏఈఓ లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సింగల్ విండో డైరెక్టర్ కు మంత్రి పరామర్శ



**మంగపేట, ఏప్రిల్ 22,మనం ప్రతినిధి:** మంగపేట మండలం రమణక్కపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సింగల్ విండో డైరెక్టర్ కోడం బాలకృష్ణ కొద్దీ రోజుల క్రితం బైక్ యాక్సిడెంట్ లో గాయపడగా వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క ఈ కార్యక్రమం లో...
జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి తో పాటు గా జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల సీనియర్ నాయకులు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రానున్న మేడారం మహా జాతరకు శ్వాశ్వత పనులు చేయాలి

**ములుగు, ఏప్రిల్22, మనం ప్రతినిధి:** వచ్చే సంవత్సరం ఫిబ్రవరి మాసంలో జరిగే మేడారం మహా జాతర వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టే పనులు శ్వాస్వతాగా నిలిచేలా పనులు పూర్తి చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మహా జాతరకు ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం 145 కోట్ల రూపాయలను కేటాయించనున్నదని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధ్యక్షతన 2026 సంవత్సరంలో జరగనున్న మేడారం మహా జాతరను పురస్కరించుకొని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు చేపట్టనున్న పనులను మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో లాగా జాతరకు రెండు నెలల ముందు పనులు ప్రారంభించి హడావుడిగా పనులు పూర్తి చేయకుండా కనీసం ఆరు నెలల సమయం తీసుకుని పూర్తి నాణ్యత పనులు ముగించాలని సూచించారు. వచ్చే సంవత్సరంలో మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర తో పాటు గోదావరి పుష్కరాలు నిర్వహించడం జరుగుతుందని, రెండు పెద్ద పండుగలను పురస్కరించుకొని అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కుంభమేళ తరహాలో జరుగుతున్న శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను విజయవంతం చేయడానికి కృషి చేయాలని, గత మహా జాతర సందర్భంగా మిగిలి ఉన్న 50 కోట్ల రూపాయలను రానున్న మహా జాతరకు వినియోగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ములుగు డిఎస్పి రవీందర్, ఆర్డీఓ వెంకటేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, ఎఫ్ డి ఓ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వేసవి వడగాలుల నియంత్రణకు చర్యలు

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్,ఏప్రిల్ 22 (మనం ప్రతినిధి):** వేసవి వడగాలుల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్లో వేసవి వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ డాక్టర్ సత్య శారద అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణితో కలసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వడగాలులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. జూలై వరకు ఆశా కార్యకర్తల నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరూ అవసరమైన మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వడగాలుల వల్ల వచ్చే ప్రమాదాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. సమ్మర్కుసంబంధించి జిల్లా, మండలస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. సాంస్కృతిక సారధి కళాకారులతో వడగాల్పులపై ప్రచారం చేయాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్ల ద్వారా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఆర్టీసీ బస్ స్టాండ్ లలో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని, పశువులు సంచరించే ముఖ్య కూడలలో నీటి కుండీలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ విజయలక్ష్మి , జెడ్పి సీఈఓ రామి రెడ్డి, డిఎంహెచ్ఓ సాంబశివరావు, పిడి హౌసింగ్ గణపతి, డిసిఓ నీరజ, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి ఉమారాణిలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# భూ భారతి చట్టం తో భూ సమస్యలకు పరిష్కారం



**వరంగల్ జిల్లా ఏప్రిల్ 22 మనం న్యూస్:** భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నర్సంపేట శాసనసభ్యులు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అన్నారు.మంగళవారం వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట, ఖానాపూర్ మండలాల రైతు వేదికల వద్ద నిర్వహించిన భూ భారతి చట్టం -2025 అవగాహన సదస్సులకు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి , ఆర్డీవో ఉమారాణి , మండల ప్రత్యేక అధికారులు బాలకృష్ణ, సౌజన్య, తహసిల్దార్లు ఫణి కుమార్, కిరణ్ , ఎంపీడీవోలు మండల అగ్రికల్చర్ అధికారులు తో పాటు నర్సంపేట మార్కెట్ ఛైర్మెన్ పాలాయి శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్




**మహబూబాబాద్ జిల్లా ఏప్రిల్ 22 (మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి - చట్టం 25, అవగాహన సదస్సు మంగళవారం భూపతిపేట గ్రామ రైతువేదిక లో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మంచారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి, తదితరులు హాజరై తెలంగాణ గీతం ఆలపించి, పిపిటి, చదివి వినిపించి రైతులకు భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం - 2025 పై అవహన కల్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.... ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భూ భారతి నూతన ఆర్వోఆర్ చట్టం అని దాని ప్రకారం దరఖాస్తు చేసుకున్న భూ సమస్యలు కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు, గతంలో భూ విషయాలు, సమస్యలు పరిష్కారం తమ పరిధిలో లేక అనేక ఇబ్బందులు ఏర్పడేవన్నారు. ఇప్పుడు సామాన్య ప్రజలకు, రైతులకు అందుబాటులో భూ సమస్యలు పరిష్కారం కోసం ప్రతి ఒక్కరికి గ్రామ అధికారి నుండి కలెక్టర్ స్థాయి వరకు వివిధ సమయాలు కేటాయించడం జరిగిందని ఆ సమయాలలో దరఖాస్తు రైతు రైతు యొక్క క్షేత్రస్థాయి పరిశీలన చేసి తగు న్యాయం చేయడానికి ఈ చట్టం చాలా ఉపయోగపడుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి మాట్లాడుతూ... ధరణి, ప్రస్తుత భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం - 2025 ల వ్యత్యాసం, సేవలపై క్లుప్తంగా రైతులకు వివరించారు.రైతు ఆకుల రమేష్ అడిగిన ప్రశ్నలకు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ సమాధానం చెప్పి భూభారతి చట్టం ద్వారా సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల పాల్గొన్నారు.




# CSK: సీఎస్కే బలహీనమైన జట్టు.. గెలవాలనే తపన లేదు: సురేశ్ రైనా



ఐపీఎల్ లో ఐదుసార్లు ఛాంపియన్ గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్లో ఘోరంగా విఫలమవుతోంది. ఇప్పటివరకు ఎనిమిది మ్యాచ్లు ఆడిన చెన్నై.. ఆరు మ్యాచ్లో పరాజయంపాలై రెండింట మాత్రమే గెలిచింది. ప్రస్తుతం సీఎస్కే పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. దీంతో చెన్నై ఆటతీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జట్టు ఎంపిక సరిగా లేదని, అందుకే చెన్నై ఈ పరిస్థితిని ఎదుర్కొంటోందని క్రికెట్ విశ్లేషకుల మాట. సీఎస్కే మాజీ ఆటగాడు సురేశ్ రైనా కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. సాయి సుదర్శన్, సాయి కిషోర్ వంటి ప్రతిభావంతులైన లోకల్ ఆటగాళ్లను మెగా వేలంలో తీసుకోలేదన్నాడు.

ప్రస్తుతం ఉన్న చెన్నై జట్టుకు గెలవాలనే తపన లేదని, 2025 సీజన్లో ఇదే బలహీనమైన టీమ్ అని విమర్శించాడు. 'ఈ సీజన్లో బలహీనమైన జట్టు సీఎస్కేనే. వారిలో గెలవాలనే తపన లేదు. ఎవరినీ అగౌరవపరచడానికి ఇలా మాట్లాడటం లేదు. కానీ, సీఎస్కే అంటేనే ఒక బ్రాండ్. అది ఇప్పుడు లేదు. తమిళనాడు ప్రీమియర్ లీగ్లో స్థానిక ఆటగాళ్లు ఎలా ఆడారో చూడండి. ఐపీఎల్లో గుజరాత్ టైటాన్స్ తరపున ఆడుతున్న సాయి సుదర్శన్ అదరగొడుతున్నాడు. సాయి కిశోర్, షారుక్ ఖాన్లు కూడా గుజరాత్కు ఆడుతున్నారు. మీరు స్థానిక ఆటగాళ్లను తీసుకురావాలి. మేము టైటిళ్లు గెలిచినప్పుడు సీఎస్కేలో తమిళనాడు ప్లేయర్స్ మురళీ విజయ్, లక్ష్మీపతి బాలాజీ, బద్రీనాథ్, అశ్విన్ ఉన్నారు' అని రైనా పేర్కొన్నాడు.

### పతనానికి ప్రధాన కారణం అదే

పవర్ప్లేలో దూకుడుగా ఆడకపోవడమే చెన్నై సూపర్ కింగ్స్ జట్టు పతనానికి ప్రధాన కారణమని రైనా విమర్శించాడు. పవర్ ప్లేలో డాట్ బాల్స్ ఆడకూడదని, స్ట్రైక్రొటేషన్ మ్యాచ్లను గెలిపిస్తుందన్నాడు. 'మేం చెన్నై సూపర్ కింగ్స్కు ఆడినప్పుడు డాట్ బాల్స్ ఆడేవాళ్లం కాదు. స్ట్రైక్రొటేషన్ అనేది చాలా ముఖ్యం. మేం మొదటి ఆరు ఓవర్లలో దూకుడుగా ప్రదర్శిస్తే.. డెత్ ఓవర్లలో ధోనీ, ఎల్బీ మోర్కెల్ ఫినిషింగ్ టచ్ ఇచ్చేవారు. ఇలా చేయడం వల్లే చెన్నై విజయవంతమైన జట్టుగా నిలిచింది' అని సురేశ్ రైనా వివరించాడు.







# జట్టు కోసం దేనికైనా సిద్ధమే.. వదంతులకు చెక్ పెట్టిన రోహిత్

ఐపీఎల్ 18వ సీజన్లో రోహిత్ శర్మ టచ్లోకి వచ్చాడు. మునపటిలా ఫుల్షాట్లతో అలరిస్తూ రికార్డులు బద్ధలు కొడుతున్న హిట్మ్యాన్ ముంబై ఇండియన్స్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ ఎడిషన్లో ఈ డాషింగ్ బ్యాటర్ 'ఇంప్యాక్ట్ ప్లేయర్'గా తన ముద్ర వేస్తున్నాడు. అయితే.. అభిమానులు మాత్రం రోహిత్ బ్యాటింగ్కు మాత్రమే మైదానంలోకి రావడం పట్ల అసంతృప్తిగా ఉన్నారు. అతడికి గాయం అయిందా?.. అందుకే ఫీల్డింగ్కు రావడం లేదా?.. అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో రోహిత్ వదంతులకు చెక్ పెడుతూ.. జట్టు కోసం ఏదైనా చేసేందుకు సిద్ధమేనని స్పష్టం చేశాడు. 'రెండు మూడు ఓవర్లు పెద్ద ప్రభావం చూపిస్తాయని నేను అనుకోను. అయితే.. ఆరంభం నుంచి కాకుండా చివరి మూడు ఓవర్లు ఫీల్డింగ్ కోసం మైదానంలోకి దిగడం.. చురుకుగా కదలడం కాస్త కష్టంగానే ఉంటుంది. కానీ, జట్టు ప్రయోజనాల దృష్ట్యా కోచ్, కెప్టెన్, మేనేజ్మెంట్.. అందరూ నన్ను ఇంప్యాక్ట్ ప్లేయర్గా ఆడించడమే మంచిదని భావిస్తున్నారు. వాళ్ల నిర్ణయం మేరకు ఫీల్డింగ్ చేయకుండా నేరుగా బ్యాటింగ్కు వచ్చేందుకు నేను సిద్ధమే. ఇంప్యాక్ట్ ప్లేయర్గా ఆడుతున్నందుకు నేనేమీ ఇబ్బంది పడడం లేదు. నాకు మా జట్టు విజయమే ముఖ్యం' అని రోహిత్ వెల్లడించాడు.

## నితీశ్ కు బీసీసీఐ కాంట్రాక్టు



భారత క్రికెటర్లకు బీసీసీఐ వార్షిక కాంట్రాక్టులను ప్రకటించింది. గత ఏడాది లాగే కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి, ఆల్రౌండర్ రవీంద్ర జడేజా, ఫాస్ట్బౌలర్ జస్ప్రీత్ బుమ్రా.. రూ.7 కోట్ల వార్షిక వేతనం చెల్లించే ఎ+ గ్రేడ్లో చోటు దక్కించుకున్నారు. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్తో పాటు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య, మహ్మద్ షమి, రిషబ్ పంత్ 'ఎ' గ్రేడ్లో ఉన్నారు. ఈ గ్రేడ్ ఆటగాళ్లకు రూ.5 కోట్ల వార్షిక వేతనం దక్కుతుంది. రోడ్డు ప్రమాదం వల్ల ఏడాదికి పైగా క్రికెట్ ఆడకపోవడంతో నిరుడు 'బి'లో ఉన్న పంత్.. తిరిగి 'ఎ'లో స్థానం సంపాదించాడు. గత ఏడాది 'ఎ'లో ఉన్న రవిచంద్రన్ అశ్విన్ రిటైరవడంతో కాంట్రాక్టు కోల్పోయాడు. ఈ రెండు సిరీస్లోనూ అతను రాణించాడు. మరో తెలుగు కుర్రాడు తిలక్ వర్మ 'సి'లో చోటు నిలబెట్టుకున్నాడు. 3 టెస్టులు లేదా 8 వన్డేలు లేదా 10 టీ20లు ఆడిన క్రికెటర్లు బీసీసీఐ కాంట్రాక్టుకు అర్హులు. వారికి నేరుగా 'సి'లో అవకాశం దక్కుతుంది. ఈ గ్రేడ్ ఆటగాళ్ల వేతనం రూ.కోటి.



# అగ్రస్థానంలో హంపి

పుణె: మహిళల గ్రాండ్ ప్రీ చెస్ టోర్నమెంట్లో కోనేరు హంపి టైటిల్ దిశగా సాగుతోంది. సోమవారం ఏడో రౌండ్లో ఈ భారత గ్రాండ్మాస్టర్ 55 ఎత్తుల్లో జు జినెర్ (చైనా)ను ఓడించింది. పొలీనా షవలోవా (రష్యా)తో పోరును ద్రోణవల్లి హారిక 43 ఎత్తుల్లో డ్రా చేసుకుంది. దివ్య దేశ్ముఖ్ 42 ఎత్తుల్లో బత్కుయుగ్ (మంగోలియా)పై విజయం సాధించగా.. అలీనా కలిన్స్కయా (రష్యా)తో వైశాలి పాయింట్ పంచుకుంది. మరో రెండు రౌండ్లు మిగిలున్న ఈ టోర్నమెంట్లో.. హంపి 5.5 పాయింట్లతో ముందంజలో ఉంది. దివ్య దేశ్ముఖ్ (5) రెండు, హారిక (3.5) నాలుగో స్థానాల్లో ఉన్నారు. వైశాలి (3) అయిదో స్థానంలో కొనసాగుతోంది.

# హీరో మహేశ్ బాబుకు ఈడీ నోటీసులు

స్టార్ హీరో మహేశ్ బాబుకు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఈనెల 27న విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొంది. సాయిసూర్య డెవలపర్స్, సురానా ప్రాజెక్టు కేసుల్లో ఈడీ ఆయనకు నోటీసులు ఇచ్చింది. ఆ రెండు సంస్థలకు మహేశ్ బాబు ప్రచారకర్తగా ఉన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ఆయన ఇన్ఫ్లూయెన్స్ చేశారనే అభియోగంపై ఈడీ నోటీసులు జారీ చేసింది. మహేశ్ బాబుకు ఆయా సంస్థలు చెల్లించిన పారితోషికంపై ఆరా తీయనుంది. తొలుత 27వ తేదీన ఆయనకు ఈడీ నోటీసులు పంపింది. అయితే.. ఆరోజు ఆదివారం ఉన్న నేపథ్యంలో ఆ మరుసటిరోజు (28వ తేదీన) ఉదయం 11గం. విచారణకు రావాలని కోరింది. సంబంధిత గ్రూపులతో జరిగిన లావాదేవీలపై ఈడీ ఆయన్ని ప్రశ్నించే అవకాశం ఉంది.



# డిజాస్టర్ అని అప్పుడు డిక్లేర్ చేయండి..:రివ్యూలపై నాని



విడుదల రోజే రివ్యూలు ఇవ్వడం వల్ల సినిమాలపై ప్రభావం చూపుతోందని కొన్నాళ్లుగా టాలీవుడ్లో చర్చ జరుగుతోన్న సంగతి తెలిసిందే. తన కొత్త చిత్రం 'హిట్ 3' (ఏజ్జీ 3) ప్రమోషన్ లో భాగంగా హీరో నాని దానిపై స్పందించారు. ''ఒకప్పుడు అయితే ఓకేగానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎవరిని ఆపగలం. 'ఫలానా సన్నివేశం, ఫలానా పాట నాకు నచ్చలేదు' అని చెప్పొచ్చు. కానీ, ఈ సినిమా ఆడదు అని డిసైడ్ చేయొద్దని నా విజ్ఞప్తి. వారం, పది రోజులపాటు ఏదైనా సినిమాని ఎవరూ చూడకపోతే అప్పుడు డిజాస్టర్ అని డిక్లేర్ చేసేయండి'' అని పేర్కొన్నారు. నా సినిమా విషయంలో ఎదురవలేదుగానీ.. 'అబ్బో.. తలనొప్పి వచ్చేసింది' అని కొన్ని మూవీస్ విషయంలో కొందరు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు చూశా. వ్యక్తిగతంగా ఓకేగానీ ప్రొఫెషనల్స్ కూడా అలా చేయడం తగదు' అని అభిప్రాయం వ్యక్తం చేశారు.హిట్ 3 గురించి నాని మాట్లాడుతూ.. ''ఈ పోలీస్ కథలో తుపాకుల కంటే ఎక్కువగా కత్తులు వినియోగించడానికీ ఓ కారణం ఉంది. వైలెన్స్ కోసమని ఉద్దేశపూర్వకంగా పెట్టలేదు. దానికో బ్యాక్స్టోరీ ఉంటుంది. కన్నడ హీరోయిన్లు టాలీవుడ్లో రాణిస్తున్నారన్న ఉద్దేశంతో శ్రీనిధి శెట్టిని ఎంపిక చేయలేదు. మృదుల పాత్ర రాయడం పూర్తయ్యాక దానికి ఎవరు న్యాయం చేస్తారా? అనే అన్వేషణలో దర్శకుడికి శ్రీనిధి బెస్ట్ ఛాయిస్ అనిపించింది. కొన్ని సినిమాల్లో నేను పోషించిన అర్జున్ పాత్రలకు ప్రేక్షకులు, అభిమానులు బాగా కనెక్ట్ అయ్యారు. ఇందులోనూ అర్జున్ సర్కార్గా కనిపిస్తా. అయితే, హీరో పాత్రకు ఫలానా పేరు పెట్టాలని నేను చెప్పను. అది దర్శకుల ఆలోచనే'' అని తెలిపారు. ''నేను నటిస్తున్న 'ది ప్యారడైజ్' వచ్చే ఏడాది మార్చి 26న విడుదలవుతుంది. మార్చి 27న రామ్చరణ్ 'పెద్ది' రిలీజ్ కానుంది. రెండూ విజయం అందుకోవాలని ఆకాంక్షిస్తున్నా'' అని అన్నారు.

''కాలేజీ రోజుల్లో నాని సినిమాలు ఎక్కువగా చూసేదాన్ని. ఆయనతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. 'కేజీయఫ్'లో నా పాత్ర ముగిసింది. 'హిట్ 3'లో నా క్యారెక్టర్ చివరి వరకూ ఉంటుందా? 'కేజీయఫ్'లోలాగా ఏదైనా జరుగుతుందా?తెలియాలంటే సినిమా చూడాల్సిందే'' అని శ్రీనిధి పేర్కొన్నారు. 'హిట్' ఫ్రాంచైజీలో భాగంగా శైలేష్ కొలను తెరకెక్కించిన 'హిట్ 3' మే 1న విడుదల కానుంది.

# ఆస్కార్ నిబంధనల్లో మార్పులు

## ఏఐ చిత్రాలకు కూడా అవార్డుల్లో చోటు



సరికొత్త నిబంధనలతో వచ్చేయేడు ఆస్కార్ వేడుక జరగనుంది. చిత్రాల ఎంపికలోనూ మార్పులు, చేర్పులు చోటుచేసుకోబుతున్నాయి. 98వ ఆస్కార్ అవార్డుల వేడుక 2026 మార్చి 15న జరగనున్నట్లు తెలిపింది, అలాగే ఈసారి కొన్ని కొత్త నిబంధనలను ప్రవేశ పెట్టింది. ఆస్కార్ కోసం పోటీ పడనున్న చిత్రాల జాబితాను 2026 జనవరి 22న ప్రకటించనున్నట్లు- అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ వెల్లడించింది. కొన్ని కేటగిరీల్లో ఓటింగ్ విధానంలో మార్పులు చేసినట్లు తెలిపింది. నామినేట్ చేసిన ప్రతి చిత్రాన్ని అకాడమీ సభ్యులు కచ్చితంగా వీక్షించాలని పేర్కొంది. అలాగే అచీవ్మెంట్ ఇన్ కాస్టింగ్ అనే కేటగిరీని ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఈ కేటగిరీకి రెండు దశల్లో ఓటింగ్ ప్రక్రియ ఉండనున్నట్లు వెల్లడించింది. చిత్ర పరిశ్రమలో పెరుగుతోన్న టెక్నాలజీని దృష్టిలోపెట్టుకున్న అకాడమీ.. ఈసారి ఏఐ ఉపయోగించి తీసిన చిత్రాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు వెల్లడించింది. లాస్ ఏంజెలెస్లోని డాల్బీ థియేటర్లో ఈ 98వ ఆస్కార్ వేడుక జరగనుంది. 2025 జనవరి నుంచి డిసెంబర్ వరకు విడుదలైన చిత్రాలు పోటీ-పడనున్నాయి. అయితే మ్యూజిక్ కేటగిరీలో మాత్రం తుది గడువు 2025 అక్టోబర్ 15గా నిర్ణయించింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.